# ఆంధ్రపత్రిక

## సచిత్రవారపత్రిక





4 అణాలు

24-1-51

# విషయానుక్రమణిక

## 24 జనవరి 1951

**వ్యాసాలు:**



**సీరియల్:**



**కథలు:**



**నాటిక:**



**సినిమా:**




**బొమ్మరిల్లు:**



**గేయం:**






# ఆంధ్రపత్రిక

సంవత్సరచందా
రు. 12-0-0
విడిపత్రిక
4 అణాలు

ప్రతి బుధవారము
ప్రకటింపబడును
**Founder: K. NAGESWARA RAO**

సంపుటము **43**
సంచిక **19**

వికృతి సంవత్సర పుష్య బహుళ పాడ్యమి బుధవారము


**శాంతి (రహదారిలో) రద్దీ:** శాంతి సాధనకోసం ఈమధ్య చాలా పథకాలు ప్రతిపాదించబడ్డాయి.

— నేషనల్ హెరాల్డ్

# రిపబ్లిక్ ప్రథమ వర్షం



రాజ్యాంగ ఆశయనిర్ణేత

భారతదేశం రిపబ్లిక్ వ్యవస్థ ప్రాప్తింపచేసుకుని ఏడాది అయింది. ఈ యేడాదిలో భారత రాజ్యాంగస్వరూపం కొంత మార్పును రూపించుకున్న మాట నిజమే కాని, స్థిరస్వరూపం ఏర్పడలేదని మాత్రం చెప్పుకోవాలి. రాజకీయంగా, అంతర్జాతీయ వ్యవహారాలలో భారతదేశ వ్యవహార విధానానికి అపారగణ్యత సిద్ధించింది. ఆంతరంగిక వ్యవహారాలలో అరాచకనిర్మూలన తప్ప వేరే చెప్పుకోదగిన అసాధారణ కార్యాలేమీ లేవు. ఆర్థిక సామాజిక రాజకీయస్థితులలో పెద్ద మార్పులేవీ లేకపోగా, కొన్ని సమస్యలు మరింత క్లిష్టమైనాయి.

అంతర్జాతీయ వ్యవహారాలలో భారతదేశం సాధించిన గణ్యతకు హేతువు ధర్మయుక్తమైన రాజనీతి. రష్యా, అమెరికాల వలె అమేయ యుద్ధబలసంపదలు లేకపోయినా, బ్రిటన్ వలె ప్రపంచవాణిజ్య ప్రాబల్యం లేకపోయినా, భారతదేశం అగ్రరాజ్యశ్రేణిలో చేరగలిగింది. శాంతిసాధనే ఏకైకలక్ష్యంగా అంతర్జాతీయ రాజకీయాలలో భారతదేశం కృషిచేసింది. సామాన్యజనకోటి బాగోగులతో నిమిత్తం లేకుండా ప్రపంచరాజ్యకూటాలు రెండూ యుద్ధసన్నాహాలు చేస్తున్నాయి. తృతీయ ప్రపంచయుద్ధం సంభవించినట్లయితే, యుద్ధంతో నిమిత్తంలేని అనేక కోట్ల ప్రజలకు ముప్పు తప్పదు. ఈ ముప్పు నివారించి శాంతిని సాధించడానికి జరుగుతున్న కృషిలో పండిట్ నెహ్రూ అనుసరిస్తున్న విధానమొక్కటే ఆచరణయోగ్యమైనదనీ, నీతిబద్ధమైనదనీ అన్ని దేశాలలోని ప్రజలూ గ్రహిస్తున్నారు. అందువల్లనే నేడు నెహ్రూశాంతిసందేశానికి ప్రపంచంలో ఇంతటి బలం కలిగింది. భారతదేశం అనుసరిస్తున్న రాజనీతిని రష్యా అమెరికాలు నిరాకరించలేకున్నాయి.

నెహ్రూరాజనీతివల్ల ముఖ్యంగా రెండు ఘట్టాలలో శాంతి సాధించబడిందని చెప్పవచ్చును. 1. ఏప్రిల్‌లో జరిగిన నెహ్రూ-లియాఖతాలీ ఒడంబడిక, 2. చీనాతో రాయబారాలు.

ఏప్రిల్ ఒడంబడికఫలితంగా బెంగాల్లో మతకలహాలు నివారించబడినాయి. జన్మభూమి విడిచి వలసవెళ్ళిన హిందూ మహమ్మదీయులలో సగమందికి పైగా స్వస్థలాలకు తిరిగి వెళ్ళగలిగారు. భారతదేశం పాకిస్తానమధ్య యుద్ధంరాకుండా నివారించబడింది.


కొరియాయుద్ధాన్ని ప్రపంచయుద్ధంగా గాని, చీనా అమెరికాలమధ్య యుద్ధంగా గాని వ్యాప్తిచెందకుండా నివారించగలిగారు పండిట్ నెహ్రూ. నైతికబలంతో అంతర్జాతీయరాజకీయాల స్వరూపాన్ని భారతదేశం మార్చగలిగిన ఈ ఘట్టం చరిత్రలో అపూర్వం. ఈ సత్యాన్ని అన్యదేశాలవారు వెంటనే గుర్తించలేకపోవచ్చు. కాని వాస్తవంగా ప్రపంచశాంతిని కాంక్షించే ప్రజానీకం గుర్తిస్తున్నది.

భారతదేశం ఇట్టి కృషిచేయగలిగిందంటే అనువిచ్చినది రిపబ్లికన్ ప్రతిపత్తి. ఈ ప్రతిపత్తి లేనిదే అంతర్జాతీయ వ్యవహారాలలో ఇట్టి గణ్యత సాధించడం కష్టం. రిపబ్లికన్ వ్యవస్థతోనే కామన్వెల్త్‌లో సభ్యత్వంకూడా నిలుపుకున్నందువల్ల భారతదేశం శాంతికృషిలో మైత్రిబలంకూడా తోడ్పడింది.

ఆంతరంగిక వ్యవహారాలలో ఇప్పటికి సాధించగలిగినవి రెండే. 1 మతకలహాల నివారణ. 2 కమ్యూనిస్టుల అరాచకచర్యల నివారణ.

ప్రజల జీవితవిధానంలో చెప్పుకోదగిన మార్పు లేదు. కాంగ్రెస్ కక్ష్యరాజకీయాల యొత్తిడిమినహా, రిపబ్లికన్ వ్యవస్థ ప్రాప్తించినందువల్ల ప్రజలకేమి లభించిందని ప్రశ్నించడం ఉచితం కాదు. ఆ వ్యవస్థ కేవలం నిరోధాలను తొలగించి అవకాశాలను ఇస్తుంది. అంతే. ఆ అవకాశాలను వినియోగించుకోగలగడం నాయకులు, పరిపాలకుల సమర్థత, ప్రవర్తనలపైన ఆధారపడిఉంటుంది. ఈ స్థితి ఏ రాజ్యాంగవ్యవస్థకైనా వర్తిస్తుంది.

ఆర్థికస్థితి దేశంలోని సంపదుత్పత్తిని బట్టి, వాణిజ్యగతినిబట్టి ఉంటుంది. ఉత్పత్తిరంగంలోనూ వాణిజ్యరంగంలోనూ అభివృద్ధికి ఇతఃపూర్వంకంటె రిపబ్లికన్ వ్యవస్థ అధికావకాశాలిస్తుంది. కాని ఆర్థికాభివృద్ధికి అవకాశాలివ్వడంతో సరిపోదు. అన్యవిషయాలు సుముఖంగా లేకపోబట్టే ఆర్థికరంగంలో అభివృద్ధి కనిపించడంలేదు.



రాజ్యాంగ సుస్థాపకులు

అయితే దీనికి బాధ్యత ప్రభుత్వంకూడా వహించవలసిఉంటుంది. పరిపాలించే నాయకులూ ఉద్యోగులూ రాజకీయాలు ప్రధానంగా, దేశీయ కార్యక్రమాలు అప్రధానంగా పరిగణించినందువల్లనే, జనచర్యరీత్యా ప్రభుత్వం ఎన్ని కార్యక్రమాలు ప్రకటించినా ఫలించకుండా పోతున్నాయి. కాంగ్రెస్ పార్టీని ఏకముఖంగా నిర్దిష్ట కార్యక్రమాలను విశ్వాస బలంతో అనుసరింప చెయ్యలేనంతవరకూ కాంగ్రెస్ ప్రభుత్వాలు సాధించగలిగేది అంతగా ఉండబోదు. అగ్రనాయకులలో ఎవరో ఇద్దరు ముగ్గురు మినహా పరిపాలనాబాధ్యత కలవారందరూ ఆత్మవిశ్వాసలోపంవల్ల ఏ కార్యక్రమాలనూ అమలుజరపలేకపోతున్నారని చెప్పాలి. రిపబ్లిక్ రాజ్యాంగం ఇస్తున్న పరిపాలనాసౌకర్యాలను వినియోగించుకోలేకపోతున్నారు. ఈనాడు శాసనసభలు చర్చించి చేస్తున్న శాసనాలను చూస్తే, పరిపాలకులకు స్థిరలక్ష్యం ఉన్నట్లు కనిపించదు. కేవలం సమావేశాలు జరిపి కాలక్షేపం చెయ్యడంకోసం కార్యం జరుపుతున్నట్లు కనిపిస్తుంది. అవసరవిషయాలలో శాసనాలనుగురించి మంత్రులు ఆలోచించరు. పెద్ద సంస్కరణలు ప్రవేశపెట్టాలనే తాపత్రయం కనిపిస్తుంది. చేసిన శాసనాలకు తప్పులు దిద్దుకోవడం అధికం.

పరిస్థితుల మార్పులనుబట్టి, కాలాన్నిబట్టి అనుగుణంగా ఎప్పటికప్పుడు శాసనాలు చెయ్యక తప్పనిమాట నిజమే. కాని శాసనవిధిలో ఒకరీతి ఉంటుంది. దేశం అభివృద్ధికి శాసనగతి చక్కని సూచిక. కాని మన రాష్ట్రాల శాసనాల గతి చూస్తే అయోమయంగా ఉంటుంది. ఒక రీతి కనిపించదు. ఒక లక్ష్యంకనిపించదు. అభివృద్ధి సూచన అసలే లేదు.



రిపబ్లిక్ ప్రథమాధ్యక్షుడు

శాసనాలు కేవల నిషేధాజ్ఞలు కావు. నిత్యనిర్బంధాలు కావు. సమాజ నియమాన్ని సక్రమగతిలో నడిపి సంపదుత్పత్తికి సక్రమ వాణిజ్యానికి, క్షేమజీవనానికీ సదుపాయాలను చేకూర్చాలి. అవకాశాలు సమకూర్చాలి. ప్రజలమధ్య సహకార సమాజ జీవనాన్ని పెంపొందించాలి. కాని నేడు మనరాష్ట్రశాసనసభలనుంచి వచ్చే ఒక్కొక్క శాసనం ప్రజలకు ఉచ్చుతాళ్లవలె కనిపిస్తుంది.

అయితే ఇది పరిపాలకులపై దోషారోపణ కాదు. పరిపాలనలో శాసనాల అవసరాన్ని, పరిమితిని, ప్రాబల్యాన్ని గ్రహించలేకపోవడమే దీనికి కారణం. ప్రజలు మన్నించలేని శాసనాలను విధించి ప్రయోజనం లేదు. అట్టివానిని విధించినట్లయితే, కోరి ప్రజలకు శాసనోల్లంఘన నేర్పినట్లవుతుంది. సమాజంలో ఒక వర్గానికి ఉపకారం మరొక వర్గానికి అపకారం చేకూర్చే శాసనాలవల్ల కాని, ఆజ్ఞలవల్ల కాని ప్రభుత్వం చేజేతులా సమాజంలో సంఘర్షణను పెంపొందించిన దవుతుంది. ఒక వర్గానికి లొంగి, ఆవర్గంలోని అవినీతిని అరికట్టలేక లోపభూయిష్టమైన శాసనాలను చేసినట్లయితే, ఎన్ని మంచి శాసనాలను చేసినా ఏవర్గమూ మన్నించదు. అర్థమనస్కంగా ప్రవేశపెట్టే శాసనాలు విపరీతఫలితాలనిస్తాయి. శాసనవిధిలోని ప్రధానసూత్రాలను పాటించకపోవడంవల్ల శాసనాలకోసం వెచ్చిస్తున్న కోట్లాదిరూపాయల ప్రజలసొమ్ము నష్టమే.

మన శాసనాలన్నిటికీ రెండు తార్కాణాలు చాలు. 1. కంట్రోల్స్. 2. దేశశాంతిరక్షణ శాసనాలు.

కంట్రోల్స్ ఏయే వస్తువులలో విధించారో, అన్ని వస్తువులూ కరువైనాయి. అయితేఅవి పూర్తిగా అంతర్ధానం కాలేదు. చాటుమాటువ్యాపారంలో వ్యాపారులకు లక్షలు, కోట్లు ఆర్జించిపెడుతున్నాయి. సమక్షంలో జరిగే మోసాలను కానలేకపోవడం, కనిపెట్టినా నివారించలేకపోవడం శాసనాలలోని లోపాలవల్లనే. శాసనాలలోని లోపాలకు అమలు జరిపే విధానంలో లోపాలు తోడవుతున్నాయి. కంట్రోల్స్ విధించని వస్తువులకన్న విధించినవస్తువులే ధరలు పెరిగిపోయి కరువైనాయి. 1951 సంవత్సరారంభంలో ప్రజానీకానికి నూరింట 12 వంతులు ధరల పెరుగుదల సంప్రాప్తమయింది. గోధుమలధర, బియ్యం ధర, వస్త్రంధర, పంచదారధర, బెల్లం ధర పెంచబడుతున్నాయి.



రాజ్యాంగ రచయిత

శాసనవిధిలోని లోపాలు శాంతిరక్షణ శాసనాల్లో స్పష్టంగా గోచరిస్తున్నాయి. ఈ శాసనాలను ప్రవేశపెట్టిన వారికీ, ఆమోదించిన వారికీ కూడా అసలు రిపబ్లిక్ రాజ్యాంగతత్వమే బోధపడలేనట్లుందని, ఒక హైకోర్టు ఒక కేసుతీర్పులో చెప్పింది. ఇంతివరకూ కేంద్రప్రభుత్వం చేసిన శాసనాలు కాని, రాష్ట్రాలు చేసిన శాసనాలు కాని లోపాలమూలంగా సవరణచెయ్యబడనిది ఒక్కటికూడా లేదు.

ఒక్క శాసనాలవిధానంలోనే కాదు. పరిపాలనా రీతిలోగాని, ఆర్థికవ్యవహార నిర్వహణలోగాని మన రాజ్యాంగం ఆంతర్యాన్ని శాసకులు గ్రహించలేదనిపిస్తుంది. ప్రజల జీవనసౌకర్యానికి అనువుగా వాణిజ్యాన్ని అదుపులోపెట్టేఅధికారాన్ని ప్రభుత్వాలకు రాజ్యాంగం ఇచ్చింది. అధికారం ఇవ్వడమే కాదు. అదుపులో పెట్టవలసిన బాధ్యత ప్రభుత్వాలపైన విధించింది. కాని ఆ బాధ్యతనునిర్వహించగలిగిన ప్రభుత్వమే కనిపించదు. కాశ్మీర్‌లో ప్రజల ఆదర

(45-వ పేజీ చూడండి)

# ఆంధ్రం

## మహాసభ

ఆంధ్ర మహాసభ 25వ వార్షిక సమావేశం గుంటూర్లో అతి వైభవంగా జరిగిపోయింది. ఉపన్యాసాలు దిగ్విజయంగా ఇవ్వబడినాయి. సందేశాలు అమోఘంగా చదవబడినాయి. తీర్మానాలు చర్చతో నిమిత్తం లేకుండా, అట్టే రభస జరగకుండా పాసైనాయి. నాయకులు చాలా చాలా కాళ్లయెద్దుల్ని పూన్చిన బండి యెక్కి ఊరేగారు. అంతా అద్భుతంగా అనుకోన్నట్టుగా జరిగిపోయింది (అనుకున్నట్టు ఏదీజరగడం లేదు కాబట్టి.)

తీరా సమావేశం జరిగిన తరవాత ఇళ్లదారి పట్టినవాళ్లు ఒళ్లుతడివి చూసుకుంటే కనపడింది ఏమిటంటే — రాష్ట్రం వస్తుందనే ఆశకి రవంతకూడా పురి బిగవలేదు. ఇంక ఏంచెయ్యాలి అని వెతుక్కుంటే— మౌనం మహోత్తమం అని తేలింది.

అయితే మహాసభాధ్యక్షులు ఊరుకోమని చెప్పలేదు. అనుసరించ వలసిన కార్యక్రమం అంటూ ఏవో సూచించారు. కాని అది అనుసరించడం ఎల్లా?

జె. వి. పి. రిపోర్టు (అంటే నెహ్రూ, పటేల్, పట్టాభిగార్లు ముగ్గురూ ఏకమై తయారుచేసిన నివేదిక) మళ్లీ ముందు వేసుకు కూచుని, అరవలూ, తెలుగులూ మళ్లీ రాష్ట్ర విభజనకాండ మొదలెట్టాలి. (రామలింగారెడ్డిగారు ఈమాట అనవద్దన్నారు. రాజ్యవిభజనే అందాంపోనీ. వాగ్దోషం, దృష్టిదోషం పోతాయేమో!) మొదలెట్టి రాజ్యవిభజన చెయ్యవలసిందిగా భారత ప్రభుత్వాన్ని కోరాలి. విభజన కాండలో కొరుకుపడని తగాదాల్ని తీర్చడానికి పంచాయితీ ఏర్పాటు చెయ్యాలని కూడా కోరాలి. అయితే నివేదిక ముందు వేసుకు కూర్చోవలసిన ఆంధ్ర సోదరులెవరో, అరవసోదరులెవరో తెలియరాదు. మేం చెయ్యవలసిందేమీ లేదని మద్రాసు ప్రభుత్వం తరఫున ముఖ్య మంత్రి కుమారస్వామి రాజాగారు చేతులు కడిగేసుకున్నారు. చెదలు తినేసిన రాష్ట్రం అక్కర్లేదని ప్రకాశంగారన్నారు. చెదలెక్కడా పట్టలేదు, మనకున్నదే ఇంత, ఉన్నదికాస్తా శుభ్రంగానే ఉందని వెంకట్రావుగారంటారు.

## తగాదాల మాట

ఇవ్వడానికి పైవాళ్లు సిద్ధంగా ఉండాలేగాని, నిజానికి ఇవ్వకపోడానికి అంతపెద్ద అడ్డంకు లెప్పుడూ లేవు. మన నాయకులమధ్య విరోధాలు, కక్షలు కారణాలుగా చూపిస్తున్నారంటే అది మిషమాత్రమే. కాబట్టి మన తగాదాలు తీర్చుకుంటే వొచ్చేస్తుందని ఎవ్వరూ భ్రమించనక్కర్లేదు. పదేపదే మన తగాదాల్ని ఇతరులుకాని, మనముకాని ఎత్తిచూప నవసరంలేదు. ఈనాడు తగాదాలూ కక్షలూ లేని ప్రాంతమే లేదు. తగాదాపడని కాంగ్రెస్ నాయకుడే దేశంలో ఎక్కడా లేడు.

ఉభయప్రాంతాల సోదరులూ మళ్లీ అడిగితే, భారతప్రభుత్వం ఇవ్వకపోతే, అప్పుడేం చెయ్యాలో మహాసభాధ్యక్షులు హరి సర్వోత్తమరావుగారు కొన్ని సూచనలు చేశారు.

## తనకు మాలిన ధర్మం

అవేమిటంటే తెలుగు శాసనసభ్యులు (ఢిల్లీలోనూ, చెన్నపట్నంలోకూడా) నడుంకట్టి మూన్నెల్లవరకూ శాసనసభల్లో తెలుగే కాని మరో భాషమాట్లాడమని వ్రతంపట్టాలి. ఈమూన్నెల్లూ తెలుగువిని చెవులు హోరెత్తి భయపడిపోయి, రాష్ట్రంఇవ్వకపోతే, ఈ తెలుగు శాసనసభ్యు లంతా ఏకమై సభ్యత్వాలకి రాజీనామా లిచ్చెయ్యాలి. ఊరూరా జనంసభలుచేసి "మాకు రాష్ట్రం ఇచ్చితీరాలి" అని అంటూ పారాయణచేసి, ఢిల్లీమీదికి జర్లతుపాను పంపించినంగువల్ల ఏమీ ప్రయోజనంలేదని హరి సర్వోత్తమరావుగారన్నారు.

అయితే వారి సూచనల్ని అమలు జరపవలసినవారు కాంగ్రెస్‌సభ్యులు. వాళ్లు మాట్లాడకూడదంటే ఏంమందు వెయ్యాలో కూడా చెప్పారు. అయిదేళ్లవరకూ వాళ్లకి మళ్లీ ఎవ్వరూ ఒక్క ఓటివ్వకూడదు. ఇది ప్రజలకిచేసిన సూచన. అయిదేళ్లలో ఎన్నికలు జరిగేది ఒక్కసారే. ఆ ఎన్నికల సమయానికి, కాంగ్రెస్‌వాళ్ళ కివ్వకుండా కసికొద్దీ దాచిపెట్టిన ఓట్లు తీసుకెళ్లి హరి సర్వోత్తమరావుగారూ, పున్నయ్యశాస్త్రిగారూ కలిసి ఏర్పాటుచేసే అభ్యర్థులికి సమర్పించాలన్న మాట. ఇదంతా చెయ్యడానికి వీలైనదేనా అని సభాధ్యక్షులు ఆలోచించి ఉండకపోరు. కాని ఈమాత్రపు ప్రచారంచేత మన కాంగ్రెస్ నాయకులకు (ఉన్నకాస్తయినా) పరపతిపోదు. తమకుమాలిన ధర్మం లేదన్న సంగతి కాంగ్రెస్‌వారికి బాగా తెలుసు. నెరవేరని కార్యాలు సూచిస్తే నవ్వులపాలవడం మినహా మరే ప్రయోజనం ఉండదు.

## రాజకీయం

మహాసభకి ప్రారంభోత్సవం చేసిన హరికృష్ణ మెహతాబ్ గార్ని విశాఖ, కోరాపుట్టిజిల్లాలవాళ్లెన్నడూ మరిచిపోరు. ఆంధ్రులపట్లనూ, వారి ఉద్యమంపట్లనూ వారికిగల భావం అందరికీ తెలిసినదే. ఆయన ప్రారంభోపన్యాసమిస్తూ, రాష్ట్రనిర్మాణ సమస్యను రాజకీయ వాదులికి ఒదిలెయ్యాలన్నారు. అంటే మహాసభలో రాజకీయ నాయకులుకారని వారి ఉద్దేశమా? అలా పొరబడ్డానికివీల్లేదు. ఎందుకంటే రాజకీయాలంటే వారికి చాలా అనుభవమే. లక్షలాది సభ్యత్వంకల ఆంధ్ర కాంగ్రెస్‌లో మూడు కక్షలుంటే, రెండుమూడు చేతుల మీదనడుస్తున్న ఆంధ్రమహాసభలో డజను గ్రూపులున్నాయి. దీన్నిబట్టే రాజకీయాల్లో ఆంధ్రమహాసభే పదాకు లెక్కువ చదువుకుందని స్పష్టమౌతోంది. మహాసభలో డజన్ గ్రూపులు, లేక కక్షలు ఉన్న సంగతి మెహతాబ్ గారికి తెలియాదేమో. ఆంధ్రమహాసభలో కక్షలే లేకపోతే, ఆంధ్రరాజ్యం వొచ్చేస్తుందని ఆయన భయమేమో?

అయితే మెహతాబ్ గారు ఒక ముఖ్య విషయంలో హెచ్చరికచేసి ఆంధ్రలోకానికి మహోపకారం జేశారు, ఇతరప్రాంతాలవాళ్లొచ్చి మనదేశాన్ని ఆర్థికంగా అభివృద్ధిపరిచి దోచుకోవడం ఆరంభించకముందే, ఆంధ్రులు తొందరపడాలన్నారు. రేపు వి భఘూత్ మల్లోవచ్చి ఇక్కడ పీఠం వేసుక్కూచుని, ఆంధ్రరాజ్యానికి ముఖ్యమంత్రైపోయే ప్రమాదం బొత్తిగా లేకపోలేదు. కోరాపుట్టిజిల్లా, బరంపురాల్లో ఆంధ్రులకేంజరిగిందో మర్చిపోవద్దని మెహతాబ్ గారు జ్ఞాపకం చేస్తున్నారు.

[సీతారామ్]

# ప్రాచ్యదేశాలలో శాంతి

## అమెరికా సందిగ్ధం

కొరియాలో యుద్ధాన్ని విరమింపచేసి, చీనాతో సంఘర్షణ రాకుండా నివారించడానికి గాను, ఇప్పటికి ఐక్యరాజ్య సమితి మూడు మార్లు కృషిచేసింది. సమితి రాజకీయ సంఘం ఆమోదించిన ఈమూడు సూచన్లనూ కమ్యూనిస్టు చీనా నిరాకరించింది.

మొదటినుంచీ చీనాప్రభుత్వం మూడు ముఖ్యాంశాలపై పట్టుదల చూపుతూనే ఉంది. 1. కొరియానుంచి విదేశీసేనల ఉపసంహరణ. 2. ఫార్మోజానుంచి అమెరికన్ బలాల నిష్క్రమణ. 3. సమితిలో సభ్యత్వం.

ఈమూడు షరతుల్ని అమెరికా అంగీకరించాలంటే, ఇంతవరకూ అనుసరిస్తున్న విదేశాంగ విధానాన్ని మార్చుకోవాలన్న మాట. సైనిక కార్యక్రమాలను మార్చుకోవాలన్నమాట. చీనా సందర్భంలో ఇంతవరకూ అమెరికా అనుసరిస్తున్న విధానంలో ప్రధానాంశాలు:-1. కమ్యూనిస్టులకు విరుద్ధంగా చియాంగ్ ప్రభుత్వాన్ని బలపర్చడం; ఆర్థికంగానూ, సైనికంగానూ చియాంగ్‌కు తోడ్పడ్డం. 2. అంతర్జాతీయసమస్య లన్నిటికీ కమ్యూనిస్టుల ఆక్రమణ విధానమే మూలమని భావించి, కమ్యూనిజం వ్యాప్తి చెందకుండా నిరోధించడం. 3. రెండో ప్రపంచయుద్ధం అనుభవందృష్ట్యా, తమ సైనికప్రాబల్యాన్ని నిలుపుకోడానికిఅవసరమైన సైనిక నౌకా, వైమానిక స్థావరాల్ని నిలబెట్టుకుని బలపర్చుకోవడం. 4. కమ్యూనిజం వృద్ధికి మూలమైన ఆర్థికదుస్థితిని అన్యదేశాలలో తొలగించడానికి తమ సంపదను వినియోగించడం.

ఇప్పుడు చీనా షరతుల్ని అంగీకరించడమంటే ఇంతవరకూ అమెరికాఅనుసరిస్తున్న విధానం విఫలమైపోయిందని అంగీకరించడమన్నమాట.

కాని చీనాలో అనుభవాన్నిబట్టి ఇంతవరకూ తా ననుసరిస్తున్న విధానం పొరపాటని అమెరికన్లు గ్రహించడంలేదు. జరిగినదానికి రష్యాని నిందించి తృప్తిపడ్డం మాత్రం జరుగుతోంది. తదనుగుణంగానే చీనాలో కమ్యూనిస్టుల ప్రభుత్వం ఏర్పడ్డానికిహేతువు రష్యన్లకుట్ర ఒక్కటేనని చెప్తూ, ఉపసమితిలో (లిటిల్ ఎసెంబ్లీ) ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. నెహ్రూ అమెరికన్ల చేతిలో కీలుబొమ్మ అని ఎవరైనా అంటే, భారతదేశం ఏమిభావించాలి? అదేరీతిగా చీనాలో 45 కోట్లమందిని ఒక్క కీలుబొమ్మ ప్రభుత్వంద్వారా స్టాలిన్ పరిపాలిస్తున్నాడని అంటే చీనా అదేవిధంగా భావిస్తుంది.

ఈ మనస్తత్వాన్నే మార్చుకోవాలని పండిట్ నెహ్రూ పాశ్చాత్యులకు బోధిస్తున్నారు. చీనాలో ఇదివరలో ఎన్నడూ లేనిబలీయమైన ప్రభుత్వం ఏర్పడిందనీ, ఆ ప్రభుత్వం కూలిపోతుందని ఆశించడం భ్రమ మాత్రమేననీ నెహ్రూ అన్నారు. ప్రపంచంలోని బలవత్తరమైన రాజ్యాలలో ఒక్కటిగా చీనాను పరిగణించక తప్పదన్నారు.

ఆసత్యాన్నిగుర్తించ గలిగితే అమెరికా అనుసరిస్తున్న పై విధానాన్ని మార్చుకోక తప్పదని స్పష్టపడుతుంది. కానిఅమెరికన్ నాయకు లీ సత్యాన్ని గుర్తించ దలుచుకోలేదు. గుర్తించనందువల్లనే అమెరికా ఏమి చెయ్యదలుచుకున్నదో ననే అనుమానానికి తావుకూడా వస్తుంది. పెకింగ్ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి అమెరికా కృషి చేస్తున్నదని కమ్యూనిస్టులు నిందిస్తున్నారంటే అందులో తప్పులేదు. చియాంగ్ సైన్యాల్ని బలపర్చడంలో ఆంతర్యం పెకింగ్ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి యత్నంకాక మరేమౌతుంది ?

అమెరికన్ల సైనికవ్యూహంనించికాని, చియాంగ్‌సేనల దండయాత్రనుంచి కాని చీనాదేశాన్ని కాపాడుకోవాలంటే ఏ చర్యలు తీసుకోవాలో, ఆ చర్యల్నే పెకింగ్ ప్రభుత్వం తీసుకుంటోంది. చీనా ప్రభుత్వానికికల ఈ అనుమానాన్ని నివారించవలసిన బాధ్యతని బ్రిటన్ ఫ్రాన్సులు గుర్తించినట్లుగా అమెరికా గుర్తించడం లేదు. అందువల్లనే చీనా తీసుకుంటున్న చర్యలు సక్రమమైనవేననే భావం బ్రిటన్ ఫ్రాన్సులలో బలపడుతోంది. కొరియా యుద్ధంలో జోక్యం, ఫార్మోజానుంచి అమెరికన్ సేనలు నిష్క్రమించి తీరాలనడం, చీనా స్వదేశరక్షణకు సంబంధించినవని ఒప్పుకోక తప్పదు.

## కామన్వెల్త్ సూచన

చీనా ప్రభుత్వానికి కల అనుమానాన్ని నివృత్తి చెయ్యాలంటే కొరియా ఫార్మోజాల సమస్యలకు సంబంధించినంతవరకు కమ్యూనిస్టు చీనా, రష్యా, అమెరికా, బ్రిటన్‌లమధ్య రాయబారాలుజరగాలని కామన్వెల్త్ సూచించింది. ఈ రాయబారాలకు అమెరికా అంగీకరించింది. కాని కామన్వెల్త్‌సూచనల్ని చీనాప్రభుత్వం ఎలాగూ నిరాకరించ గలదనే ధైర్యంతో అమెరికా సమ్మతించిందని అమెరికన్ నాయకులు వారి శాసనసభలలో స్పష్టపరిచారు. నిరాకరించగలదనే ధైర్యం అమెరికన్లకి కలగడానికి ఆధారం లేకపోలేదు. కామన్వెల్త్ ప్రధానులు చేసిన సూచనలు సందిగ్ధంగా కూడా ఉన్నాయి. ముఖ్యంగా ఫార్మోజాకు సంబంధించిన అంశం సందిగ్ధంగా ఉండడంవల్లనే భారతప్రభుత్వ ప్రతినిధి ఆవిషయమై తమ అభిప్రాయాన్ని విశదపరచ వలసిన అవసరం కలిగింది. "ఫార్మోజా సమస్యతో సహా, దూరప్రాచ్య సమస్యల్ని పరిష్కరించడానికి ఇంతవరకూ సమ్మతించబడిన అంతర్జాతీయపు టొడంబడికలనుపాటిస్తూ, రాయబారాలు" జరపాలని కామన్వెల్త్ సూచనల్లో అయినో అంశం. ఇందులో అంతర్జాతీయపు టొడంబడికలంటేకైరో, పోట్స్‌డామ్ ఒడంబడికలని తామర్థం చేసుకుంటున్నట్లు భారతప్రతినిధి ప్రత్యేకం చెప్పవలసివచ్చింది. అయితే తరుణం వచ్చినప్పుడు అమెరికన్లు మరొక రీతిగా భావించవచ్చును. అందువల్లనే ఇటువంటి సూచనల్ని నిరాకరించి పెకింగ్ ప్రభుత్వం ప్రతిసూచనలు చేసింది.

వాస్తవానికి కామన్వెల్త్ సూచనల్ని భారతప్రతినిధి ఆంతర్యం ప్రకారం అంగీకరించాలంటే, చీనా ఫార్మోజాలపట్ల నిరసనవిధానాన్ని అమెరికా మార్చుకోక తప్పదు. ఎలాగైనా ఈవిషయాన్ని రాయబారా

(46-వ పేజీ చూడండి)

# కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో

## అలెగ్జాండర్ డ్యూమా

అనువాదం: సీతారామ్

**1815** వ సంవత్సరం, ఫిబ్రవరి 24. 'ఫరావో' నౌక మార్సేల్స్ రేవు ప్రవేశిస్తున్నది. నోటర్ డామ్ గోపుర శిఖరం అనుమతి సంకేతమిచ్చింది. నౌక స్మిర్నా, ట్రియస్ట్, నేపుల్స్ నగరాలు చూసుకుని వస్తున్నది.

రేవునుంచి ఒక పైలట్ వెంటనే బయలుదేరాడు. చిన్న బోటులో ఇఫ్ కోటను చుట్టి, 'మార్గియాన్' అగ్రానికీ 'రయాన్' ద్వీపానికీ మధ్య నౌక నెక్కాడు.

చూడవచ్చిన జనం ఒడ్డుపై కిటకిట లాడుతున్నారు. ఒక నౌక వచ్చిందంటే ఆనాడు మార్సేల్స్ నగరవాసులకు పండుగన్నమాటే. ముఖ్యంగా 'ఫోసీ' లో నిర్మించబడిన దేనా, మార్సేల్స్ ఓడ కంపెనీలకు చెందినదేనా అయితే, మరింత కలకలం. ఫరావో ఫోసీ నౌకా కర్మాగారంలో నిర్మించబడింది. యజమానులు మార్సేల్స్ నగరవాసులు కూడా.

నౌక మెల్లిగా రేవు ప్రవేశిస్తున్నది. 'కెలరీన్' ద్వీపానికీ 'యూరోస్' ద్వీపానికీ మధ్యసింధుశాఖను జాగ్రత్తగా దాటింది. 'పామిగ్' ను చుట్టింది. తెరచాపలెత్తి మెల్లిగా రేవు ప్రవేశిస్తున్నది. నౌక మందగమనాన్ని చూసి, ఓడకేదో ప్రమాదం వాటిల్లిందేమోనని తీరంపై జనం శంకించ నారంభించారు. కాని ఎట్టి ప్రమాదం సంభవించలేదని దూరాన చూసినంతలోనే నౌకాయాన ప్రవీణులు నిర్ధారణ చేశారు. నౌకగమనం నిర్దుష్టంగా ఉంది. లంగరు దించడానికిసిద్ధంగా ఉంది. పైలట్ సమీపంలో ఒకయువకుడు నిలిచి నౌక గమనాన్ని అతిశ్రద్ధతో పరీక్షిస్తున్నాడు. పైలట్ ఆజ్ఞలను పునరుచ్చరిస్తున్నాడు. జాప్యం సహించలేని ప్రేక్షకులలో ఒకడు ఒకచిన్న బోటులోకి దుమికి నౌకదిక్కుగా వెళ్లాడు. 'రిజర్వ్' సింధు శాఖవద్దనౌకను సమీపించాడు.

నౌకపైయువకుడు ముందుకు వచ్చి, బోటులో వ్యక్తిని ఆహ్వానించాడు. యువకుని వయస్సు పద్దెనిమిది ఇరవై ఏళ్లమధ్య ఉండవచ్చు. పొడగరి. బక్కపలచని శరీరం. నల్లని నేత్రాలు. శైశవంనుంచీ భీతిఅంటే తెలియని స్థైర్యభావం అతని ముఖంలో ఉట్టిపడుతోంది.

"ఎవరు? నువ్వా డాంటే?" అన్నాడు బోటులోవ్యక్తి. "ఏం జరిగిందోయ్? ఓడపైన ఈ విషాదసూచన లేమిటి?"

"పెద్దదుర్ఘటన సంభవించింది, మస్యూ మారెల్. ముఖ్యంగా నాకు తీరనిలోటు కలిగింది. 'సివిటా వెఖియా' వద్ద మనకెప్టెన్ లక్లేర్ మృతిచెందాడు."

"మరి ఓడలోసరుకు?"

"క్షేమంగానే చేరింది. ఆవిషయమైమీరు బెంగపడ నక్కర లేదు మస్యూ మారెల్. కాని పాపం మన కెప్టెన్..."

బెంగతీరిన ఓడయజమాని అర్ధోక్తిలోనే ప్రశ్న అందుకున్నాడు. "ఎలాపోయాడోయ్? జబ్బేమిటి?"

"మస్తిష్క జ్వరంతో యాతనపడి మరణించాడు మస్యూ" అని జవాబుచెప్పి, యువకుడు వెనక్కి తిరిగి నావికులను పిలిచాడు; "ఎవరక్కడ? రేవుచేర్చడానికి అంతాసిద్ధపడండి." నావికులు ఆజ్ఞపాలించారు. యువకుడు తిరిగి మారెల్ తో ప్రసంగం అందుకున్నాడు.


యజమాని ప్రశ్నించాడు; "అసలిది ఎలాసంభవించింది?"

"ఏం చెప్పను మస్యూ? అంతా ఆశ్చర్యంగా జరిగిపోయింది. నేపుల్స్ నగరం విడిచిపెట్టేముందు నౌకాశ్రయ సర్వాధికారితో కెప్టెన్ లక్లేర్ చాలసేపుమాట్లాడాడు. తరవాత చాలకలవరపడినట్లు కనిపించాడు. అంతే. ఇరవై నాలుగ్గంటల్లో జ్వరం ముంచుకువచ్చింది. మూడురోజుల్లో చనిపోయాడు. ఆయన భౌతికదేహం తరంగాల అడుగున చిరవిశ్రాంతి పొందింది. శవాన్ని ఒక వలసంచిలో చుట్టి, తలవంకనూ కాళ్లవంకనూ ముప్పైఆరుపౌన్ల రాళ్లుకట్టి, ఎల్ గిగ్లియో వద్దసముద్రంలో విడిచిపెట్టాం. వితంతువుకు ఒప్పగించడానికి పవిత్రమైన సిలువ, కత్తి తేబడినాయి. ఆంగ్లేయులతో పదిసంవత్సరాలు పోరాడిన వీరుడు, ఈ రీతిగా సామాన్యులవలె మృతిచెందడం చూస్తే..." యువకుడు విషాదభరమైన చిరునవ్వు నవ్వాడు.

ఓడ యజమాని అన్నాడు: "అవునవును, మస్యూ ఎడ్మండ్. మనం అంతా మర్త్యులం. యువకులకు తావిచ్చి వృద్ధులు తప్పుకోడం మానవధర్మం. లేకపోతే వృద్ధికి అవకాశమే ఉండదు. ఓడలో సరుకంతా క్షేమంగా చేరిందని నువ్వు హామీ ఇస్తున్నావు కాబట్టి......"

(42-వ పేజీ చూడండి)

# అస్తమించని సూర్యుడు



తిమిరాచ్ఛాదితమైన రాత్రి అది. పగలంతా అల్లరిగా చెలరేగిన గాలి చీకటిపడే వేళకు నిశ్శబ్దమైంది. తుపాకి దెబ్బతిన్న పక్షివలె వృక్షశాఖలనుంచి రివ్వున కిందపడి, నేలను హత్తుకుని రెక్కలు ముడుచుకున్నది గాలి. చుట్టూ గంభీరమైన ప్రశాంతత ఆవరించింది. గ్రామానికి దూరంగా వున్న అడవి దీర్ఘనిశ్వాస మొకటి విడిచి నిద్ర[illegible]ంచింది. ఇప్పుడెక్కడో కొమ్మలమీద కునికిపాట్లు పడుతూ కూర్చున్న పక్షులు సద్దు చెయ్యకుండా నిద్రిస్తున్నాయి.

హఠాత్తుగా అలముకున్న ఈ గంభీర నైశ్శబ్ద్యానికి ఉలిక్కిపడి నిద్రలేచింది వృద్ధురాలు ఇజ్జత్.

కిటికీకుండా బయటికి తొంగిచూసిందామె. పాల[illegible]గా రాత్రి దిగంతాలదాకా వ్యాపించింది. నక్షత్రాలు కనురెప్పలు మూస్తూ తెరుస్తున్నట్లు మినుకు మినుకుమంటున్నాయి. ఒక విశాలమైన ఛత్రంవలె విప్పుకున్న దాకాశం.

ఇజ్జత్ తనపక్కనే నిద్రపోతున్న మనుమరాలు కుమారవంక తేరిపార చూసింది. సుకుమారపు [illegible]. స్వప్నాల బరువుకో మూసుకున్న ఆమె కళ్లు చూసి వృద్ధురాలు ఆమెను లేపటానికి సాహసించలేదు.

ఆ నిశ్శబ్ద ప్రశాంత రాత్రివేళ నిద్రిస్తున్న సుకుమారాంగి హృదయం జీవన వసంతగీతాలను మధుర మధురంగా ధ్వనిస్తున్నది.

కిటికీవద్ద చేరబడి వృద్ధురాలు ఆ సంగీతం వినసాగింది. ఆ సంగీతాన్ని ఆమె ఎంతో నే గుర్తుపట్టింది. యుగయుగాలుగా ఆ సంగీతం ప్రతిమానవహృదయంలోను నిద్రాణమై వున్నది. ఇలాంటి మనోజ్ఞ వసంతరాత్రులలో ఆ గానం మేల్కొని ఏవో విచిత్ర, అస్ఫుట గానాలను వ్యక్తం చేస్తుంది...

ఆ గానాన్ని హృదయపూర్వకంగా ఆస్వాదించటంకోసమన్నట్టుగా వృద్ధురాలు కళ్లు మూసుకున్నది. ఇంతలో తోటలోంచి మరొక సంగీతం గాలికెరటాలమీదుగా తేలుతూ వచ్చింది. ఇజ్జత్ [illegible] ఒళ్లంతా [illegible].

అవును, అది [illegible] గంధర్వగీతం; ఈ [illegible] పక్షి.

[illegible] ప్రవహిస్తున్న ఇంద్రజాలంతో [illegible] కళ్లు తెరుచుకుని [illegible].

"నేనూ వింటున్నాను [illegible] పక్షి గానం?" అన్నది [illegible].

"ఆ, అదే; [illegible]," అన్నది వృద్ధురాలు.

[illegible]

మధ్య అందమైన, అమూల్యమైన ఒక పువ్వు; అది ఈరోజునే, ఈ రాత్రే వికసిస్తుంది. ఆ పువ్వు మొక్కనుండి మాసిపోని రంగులు తీయవచ్చు; ఆ రంగులను అద్దకం రంగులుగా వాడుకోవచ్చు.

ఈ రహస్యం గుమ్రా తన మామ్మ ద్వారా విన్నది. ఈ రోజు కోసం ఎన్నో రోజులనుంచీ ఆమె ఎదురుచూస్తోంది. మామ్మని ఎన్నోసార్లు తొందర చేసింది కూడాను. కాని ఈ అజ్ఞాత విహంగం పాట పాడే రాత్రిగాని ఆ పువ్వు విచ్చుకోదని వృద్ధురాలికి తెలుసు. అందుచేతనే గుమ్రాని ఇంతకాలమూ ఓర్పుతో ఆపివుంచింది.

గుమ్రాకి ఒకటే ఉబలాటం; గబగబ ముందుకు పరుగెత్తుకు వెళ్లేది. ఇజ్జత్ నెమ్మదిగా నడుస్తూ వెనక పడిపోయేది. గుమ్రా ఆమెకోసం చాలాసార్లు ఆగవలసి వచ్చింది.

మొదటికొండ ఎక్కేటప్పటికి వేగుచుక్క పొడిచి వారికి స్వాగత మిచ్చింది. కొంతసేపు విశ్రాంతి తీసుకుందా మనుకున్నారు. ఒక రాతి పలక మీద ఇజ్జత్ కూర్చుంది. పర్వతశిఖరాలమీద క్రమంగా కాంతిల్లుతున్న ఆకాశంకేసి చూస్తూ నిలబడింది గుమ్రా. ఆకాశపు ఎడారిలో ఒంటెల బిడారుల్లాగా నక్షత్రాలు క్రమంగా పైపైకి జరిగి అనంతంలో లీనమౌతున్నాయి.

తన చుట్టూ చూసిన ఆ అద్భుతప్రకృతిని గూర్చి ఇజ్జత్‌తో చెప్పాలని గుమ్రా ఆరాటపడింది, కాని ఆ నిశ్శబ్దాన్ని భంగం చెయ్యటాని కామె సాహసించలేదు. తను చెప్పగోరుతున్నదాన్ని ఆ నిశ్శబ్దమే చెప్తున్నట్టుగా తోచింది.

ఇద్దరూ ఆ పన్నెలదారిలో తిరిగి నడక సాగించారు. గొల్లవాళ్ల గుడారాలు చేరుకునేటప్పటికి ఆకాశంలో అరుణోదయపు తొలిజాడలు గోచరించాయి. అందుచేత అక్కడ ఆగకుండా ముందుకు సాగిపోయారు.

ఒక చిన్న కొండగుట్ట నెక్కారు. ఒక హారాద్వాయువీచిక వారిమీదుగా వీచింది. మత్తెక్కించే గాఢపరిమళ మొకటి వారిని సోకింది. అది ఆ లోయలో పెరిగే పుదీనా మొక్కల వాసన. గుమ్రా నిలబడి ఆ సువాసన పీల్చింది. కాని వృద్ధురాలు ఆ ఘాటుకు ఆగలేక తలతిరిగి నేలపై చదికిలబడింది. చేతికర్రతో కింది లోయకేసి చూపించింది.

“అమ్మయ్య! ఎలాగైతేనేం చేరుకున్నాం. అదే పుదీనాలోయ.”

వింటినుండి విడివడిన బాణంలాగ గుమ్రా లోయలోకి పరిగెత్తింది. కాని అన్ని లక్షల పువ్వుల్లో తనకి కావలసింది ఏ పువ్వో తెలియక తెల్లబోయి చూసింది.

“ఆ పువ్వెక్కడే, మామ్మా!” వృద్ధురాలు సమాధానంగా చిరునవ్వు నవ్వింది. లేచి మెల్లిగా కర్రసాయంతో లోయలోకి దిగింది. లెక్కలేనన్ని పువ్వులు ఆమె కాళ్ల కడ్డం వచ్చాయి. అన్నిటినీ దాటింది. లోయ అవతలివేపుకి వెళ్లి సన్నని ముళ్లుకల ఒక పొదపక్కన కూర్చుంది. ఆమె వెనకనే నడిచి వస్తున్న గుమ్రా ఆ పొద నీడలో పెరిగే ఒక చిన్న మొక్కని, దాని పువ్వుని చూసింది.

“ఇదే ఆ పువ్వు. ఈ మొక్కని వేళ్లతో సహా పెల్లగించు,” అన్నది ఇజ్జత్.

గుమ్రా జాగ్రత్తగా ఆ మొక్కని వేళ్లతోపాటు తవ్వింది. రుమాలనిండా ఆ వేళ్లు నింపుకున్నది.

ఈలోగా లోయంతా పక్షుల కిలకిల ధ్వనులతో మారుమోగుతున్నది. ఇజ్జత్ లేచి ఇంటిదారి పట్టింది. కాని గుమ్రాకు వెళ్లిపోవటానికి మనసొప్పలేదు. అక్కడి పరిమళాలతో మత్తెక్కి మంత్రముగ్ధరాలివలె ఆ పువ్వుల సముద్రాన్నే చూస్తున్నది. ఆ లోయనే తన రుమాలలో కట్టుకు తీసుకుపోవాలనేమో ఆమె ఆశ!

ఇజ్జత్ మనమరాలిచెయ్యి పట్టుకుని, “ఇక పోదాం పద. తుపాను వచ్చేటట్టున్నది,” అన్నది.

కలలోంచి లేచినట్టు ఉలిక్కిపడి గుమ్రా ఆకాశాన్ని కలయచూసింది. ఒక నల్లటి పక్షి విశాలమైన రెక్కలు విప్పినట్టు తుపానుమేఘ మొకటి బరువుగా వేళ్లాడుతోంది. గుమ్రా వృద్ధురాలి చేయి పట్టుకుని త్వరత్వరగా నడక ప్రారంభించింది.

పక్షుల కిలకిలలన్నీ హఠాత్తుగా ఆగిపోయాయి. భయంకరమైన నిశ్శబ్దం వ్యాపించింది.

ఒక కొండకొమ్మ కొద్దిగా వాలిన చోట ఇజ్జత్, గుమ్రాలు తల దాచుకున్నారు. వెంటనే వర్షం ప్రారంభమైంది. పర్వతాలు ఆ తుపానుకు వణికాయి. వర్షపు ముసుగులో ఏది లోయ, ఏది కొండ అనేది తెలియటంలేదు. బంగారు బాణాల్లాగా మెరుపులు కొండలను దూసుకుంటున్నాయి.

ఉరుములు, పిడుగులతో తుపాను అంతమైంది. మబ్బులు చెదిరిపోయాయి. శుభ్ర నీలాకాశం తిరిగి తన స్థానం తాను ఆక్రమించుకుంది. గొల్లల గుడారాలమీద పొగ రావటం చూసింది గుమ్రా. దాన్ని ఇజ్జత్‌కు చూపించింది.

“గొల్లలు మంట చేశారు. అక్కడికి పోయి చలి కాచుకుని, బట్టలు ఆరబెట్టుకుందాం,” అన్నది ఇజ్జత్.

గుడారాలను సమీపించగానే వారికి గొల్లలు ఎదురు వచ్చారు. పొగరానిచోట ఒక బల్ల వేసి కూర్చోమన్నారు.

“ఎక్కడినుంచి వస్తున్నారు ఇజ్జత్ మామ్మా!” అని ఒక వృద్ధు డడిగాడు.

“పుదీనాలోయనుంచి వస్తున్నాము. అద్దకంరంగులకోసం వేళ్లు ఏరటానికి వెళ్లాం.”

వృద్ధుడు పొగాకుగొట్టం వెలిగించాడు. చిరునవ్వు నవ్వుతూ అడిగాడు.

“నీ మనుమరాలికి నీ అద్దకంరంగుల రహస్యం నేర్పుతున్నావన్నమాట. పిల్ల తన పెళ్లిబట్టలు నేయాలని తొందరపడుతున్నదా?”

వృద్ధురాలు గుమ్రాకేసి చూసింది. గుమ్రాముఖం చలిమంటవేడివల్లనో, సిగ్గువల్లనో ఎర్రపడింది. ఇజ్జత్ సగర్వంగా చెప్పింది.

“కాదు. ఈ రంగులతో తండ్రి చిత్తరువును నెయ్యాలని ఆమె కోరిక.”

“ఈ పిల్ల తండ్రా? అతను నాకు బాగా తెలుసునే! కాని అతను చనిపోయేటప్పటికి ఈ పిల్ల పసిగుడ్డు. ఈమె కేం గుర్తుంటాడు అతను? పైగా అతని బొమ్మ కూడా ఎవరిదగ్గిరా లేదు,” అన్నాడు వృద్ధుడు.

ఇజ్జత్ నవ్వింది.

“అది కాదయ్యా! ప్రజల కందరికీ తండ్రి అయిన మన నాయకుని చిత్తరువు వెయ్యాలని ఆమె అనుకుంటోంది.”

మంట చుట్టూ కూర్చున్న గొల్లవాళ్లంతా ఒక్కసారిగా, “లెనిన్!” అన్నారు. అందరు గుమ్రాకేసి గౌరవదృష్టులతో చూశారు. ఆమె తలవంచుకు కూర్చుంది.

వృద్ధుడు ఉత్సాహంతో అన్నాడు:

“గుమ్రా! చాలా గొప్పపని తలపెట్టావు. నీకు విజయం కలగాలని ఆశీర్వదిస్తున్నాను. నువ్వు నేయబోయే బొమ్మ ఎలా వుండాలంటే మంచులో తడిసినా, వానలో నానినా, తుపానులో పడేసినా ఒక్క రంగు కూడా చెడగూడదు. ఈ ఏడాది మే మిక్కడికి మాతోపాటు లెనిన్ బొమ్మని తీసుకువచ్చాము. ఈ తుపానులో మాగుడారా లన్నీ తడిసి ముద్దయిపో

యాయి. ఆ బొమ్మకూడా తడిసీ చిరిగిపోయింది. తండ్రిలేని అనాథులమై పోయాము ఈ కొండల్లో."

వృద్ధుడు మౌనంగా కూర్చున్నాడు. గుల్మూ తలెత్తి గొల్ల లందరినీ చూసింది. వారి విచారదృష్టులను చూసి, ఆమె తిరిగి ఆలోచనలో పడింది.

మంటదగ్గిరగా కూర్చుని బిగుసుకుపోయిన కాళ్లను వెచ్చచేసుకున్న ఇజ్జత్ లేచి బయల్దేరింది. ఒక గొల్ల యువకుడు వారిని కొంతదూరం సాగనంపాడు. గుల్మూ దోవపొడుగునా మౌనంగా ఆలోచిస్తూనే వున్నది. యువకుడు సెలవుతీసుకుని వెళ్లేటప్పుడు ఇలాగన్నది:

"మామ్మా! నేను తివాచీ నెయ్యటం పూర్తయ్యాక ఈ గొల్లలకు దాన్ని బహుమానంగా యిస్తాను. ఈ కొండల్లో వాళ్లకి ఆయనచిత్తరువు తోడుగా వుంటుంది."

గొల్లయువకుడు సంతోషవిభ్రాంతుడై మూగగా నుంచున్నాడు. గుల్మూ కోమల హస్తద్వయాన్ని తన చేతుల్లోకి తీసుకుని కృతజ్ఞత వెలిబుచ్చాడు. ఆమె చేసిన వాగ్దానాన్ని తన మిత్రులకు తెలియజేయటానికి పరిగెత్తాడు.

ఆ వేళ్ళను ఇజ్జత్ ఉడకబెట్టింది నూలును వివిధవర్ణాలలో అద్దింది. గుల్మూ ఒక ప్రాతఃకాలాన లేచి చూడగా నేత మగ్గం నిండా రంగురంగుల నూలుబంతులు కట్టబడి వున్నాయి. వెంటనే ఆమె మగ్గం ముందు కూర్చుంది. లోయలో ఆమె చూసిన లతలాది పుష్పగుచ్ఛాలు ఆమెకళ్ళముందు నాట్యం చేశాయి. వాటి నన్నిటిని చైతన్యయుతమైన కళాఖండాలలోకి మార్చింది.

శీతకాలం వచ్చింది. పర్వతాలు లోయలు ధవళ హిమాచ్ఛన్నములయ్యాయి. కాని పరిపూర్ణయౌవని గుల్మూ కళ్ళలో చిత్రచిత్రమైన చైత్ర వర్ణాలే నిత్యమూ మెరిసేవి. వాటినే ఆమె తన కళలోకి అనువదించింది.

ఆమె వివిధవర్ణాల స్వప్నాలను దర్శించింది. వాటి సహాయంతో ఆమె అపూర్వమైన వింతరంగులను తన తివాచీలో అల్లింది.

తివాచీ పూర్తిఅయింది. అది జనవరి నెల. భూమి అంతా నిర్జీవహిమావృతమై వుంది. ఒకరోజున ఒక చీకటివార్త రెక్కలు కట్టుకుని ఎగిరివచ్చి గుల్మూ తలుపు తట్టింది.

గుల్మూ ఉలిక్కిపడి నుంచుంది. కిటికీగుండా చూసింది. గ్రామవీథుల్లో ఒత్తుగా కురిసిన మంచు, తెల్లటి తివాచీలు పరిచినట్టు వుంది.

ఎర్రజండాలు దింపివేయబడినవి. కిటికీ దగ్గరనుండి కదలి గుల్మూ మగ్గం వద్ద కూర్చుంది. రోజూ అతినిపుణంగా చలించే ఆమెచేతులు కదలటానికి నిరాకరించాయి. కన్నీళ్లు గొంతుకకు అడ్డంపడ్డాయి తను నేసిన చిత్తరువుకేసి చూసింది. తివాచీ మీద తల ఆన్చి బిగ్గరగా వెక్కివెక్కి ఏడ్చింది.

ఆమె ఏడుపు నాపి తలఎత్తి చూసేసరికి సూర్యుడు హిమశిఖరాల చాటుకి వెళ్ళిపోయాడు. తెల్లటి లోయలమీద నల్లటి నీడలు త్రాచుపాముల్లాగా జరజర పాకి వచ్చాయి.

ఆమె కళ్లఎదుట నిరంతర నాట్యం చేసే వసంతవర్ణాలు హఠాత్తుగా నల్లనై కాంతిని కోల్పోయాయి.

జీవితమంతా శ్రామికధర్మంలోనే గడిపినా కుంగిపోని వృద్ధురాలు ఇజ్జత్ ఈ చీకటివార్తతో కుంగిపోయింది. తన మనమరాలు చిత్రించిన చిత్తరవుకేసి చూసింది. దుఃఖనిమగ్నురాలైన గుల్మూని చూసింది. ఇంట్లో మామూలుగా అద్దకానికి ఉపయోగించే ఏదో నల్లరంగు తీసుకొచ్చి కొంత నూలును అందులో ముంచింది. ఆ నల్లటినూలును మనమరాలి కిచ్చింది. గుల్మూ తన హృదయంలోని దుఃఖతిమిరాలను లెనిన్ చిత్తరువుచుట్టూ నల్లటి అంచుగా నేసింది.

మర్నాడు గొల్లలు విషాదభారవినమ్రములైన అరుణపతాకలతో వచ్చి గుల్మూ ఎదుట నిలిచారు. తివాచీని చుట్టి భుజాలపైపెట్టుకుని వెళ్ళిపోయారు.

అంతే దుఃఖహేతువైన శీతకాలంకూడా తిరోగమించింది.

వసంతం తిరిగి తొంగిచూసింది.

గొల్లలు మళ్ళీ గొర్రెలను తోలుకొని కొండల్లోకి వెళ్లారు. కూడా గుల్మూహస్తనిర్మితమైన వర్ణతివాచీనికూడా తీసుకుపోయారు. కాని గుల్మూహృదయాని కింకా వసంతం రాలేదు. తివాచీలోని నీలాంచలం ఆమెకు ఊరట నివ్వటం లేదు.

ఒక రాత్రివేళ గుల్మూ భయపడి లేచింది. ఉరుములు, మెరుపులతో తుపాను మరలివచ్చింది. ఆ రాత్రంతా లోయల్లోనూ, పర్వతాల్లోనూ, తుపాను స్వైరవిహారం చేసింది. ఎప్పుడు తెల్లవారుతుందా అని గుల్మూ రాత్రంతా మేలుకు కూర్చుంది. తెల్లవారుతుండగా ఆమె ఇజ్జత్ ను లేపి,

"మామ్మా! లే. కొండల్లోకి పోదాం. నా తివాచి ఎలావుందో చూడాలి," అన్నది.

నిశ్శబ్దంగా ఇద్దరూ పరిచితమార్గాల నడిచి గొల్లల గుడారాలు చేరుకున్నారు. ఎర్రగా చిగిర్చిన చెట్లమధ్యనుండి కలలో నడుస్తున్నట్టు నడిచారు. గుడారాలు చేరుకునేటప్పటికి సూర్యోదయమైంది. తుపాను వచ్చి డేరాలను ధ్వంసంచేసిపోయింది. కొయ్యమేకులు పాతుతూ, తిరిగి డేరాలు నిర్మించుకుంటున్నారు. వాళ్లు.

గుల్మూను, వృద్ధురాలిని చూడగానే వాళ్లు సంతోషంతో ఎదురువచ్చి తోడ్కొనిపోయారు. తుపాను చేసిన భీభత్సాన్ని గుల్మూ కలయచూసి ఆందోళన చెందింది.

"తన తివాచీని చూసిపోవటానికి వచ్చింది గుల్మూ. తుపాను కేమన్నా పాడైందా అది?" అని అడిగింది ఇజ్జత్.

తివాచీని వేళ్లాడగట్టడానికి ప్రత్యేకంగా నిర్మించిన డేరాలోకి తీసుకువెళ్లారు గొల్లలు వాళ్లిద్దరినీ. డేరా పైభాగమంతా చిరిగి తూట్లు పడింది. డేరా తలుపుకూడా విరిగిపోయింది. ఉదయసూర్యుని గంభీరకిరణాలు సూటిగా తివాచీమీద పడుతున్నాయి.

తుపాను వర్షం రాత్రంతా తివాచీమీదనే కురిసి నాన్చింది. దాని సుందరవర్ణాలిప్పుడు ఇంద్రధనుస్సువలె ప్రకాశిస్తున్నాయి. వేలకొలది వర్ణాల ఛాయలు తివాచీపైన మెదులుతున్నాయి.

ఇన్ని ఉజ్వలవర్ణాలలోను ఒక్కటి మాత్రం ఆనవాలైనా లేకుండా చెరిగిపోయింది - అది గుల్మూ నేసిన విషాదనీలాంచలం. ఆ నల్లటి అంచు వసంతవర్ష ధారలలో తడిసి చెరిగిపోయింది.

"అమ్మాయీ! ఆ నల్లటి రంగులు ఆయన చిత్తరువుకి పనికిరావు. ఆయన మనకి అస్తమించని సూర్యుడు. అవునా?" అన్నాడు ముసలిగొల్లడు గుల్మూకేసి చూస్తూ.

తిరిగి వసంతవర్ణాలు గుల్మూకళ్ల ఎదుట నాట్యం చేయసాగాయి.

(అనువాదం: ఎన్నార్)

★

**పెద్దకథ :**

# గతుకులదారి

టేకుమళ్ల కామేశ్వరరావు

తహసిల్దారయిన రామమూర్తిగారు పని నుంచి విరమించుకొని నాలుగేళ్లయింది. ఆయన రాజమహేంద్రవరంలో దానవాయిపేటలో స్థలం కొనుక్కొని, సంసారపక్షంగా ఇల్లు కట్టుకొని, 'రామ, కృష్ణ' అనుకొంటూ కాలక్షేపం చేస్తున్నాడు. పింఛనీ పుచ్చుకొన్నప్పటికీ సంసారబాధ్యతలు తప్పవు. ఆయన నాలుగో కొడుకు పాపారావు మొన్ననే ఇంటర్‌లో ఉత్తీర్ణుడయి, ఆర్ట్సుకాలేజీలో బి. ఏ. లో చేరాడు. అతని చదువు, అతని వివాహాదికార్యాలు తండ్రి చెయ్యవలసిందే కదా! దీనికి తోడు మరొక పిల్ల ఎదిగి, పెళ్లికి సిద్ధంగా ఉంది. అందుచేత రామమూర్తిగారి బాధ్యతలు ఎప్పటిలాగే ఉన్నాయి. పింఛనీ పుచ్చుకొన్నా, ఖర్చులేమీ తగ్గినట్లు కనబడవు. పెద్దకొడుకులు ముగ్గురూ ఉద్యోగాలలో ఉన్నమాట నిజమే కాని, పెద్దవాడి మాట అటుంచి, తక్కిన ఇద్దరూ,-ఒకడు చెన్నపట్టణంలోను, ఒకడు బొంబాయిలోను పనిచేస్తూ - డబ్బు చాలక ఇంటినుంచి తెప్పించుకొంటూ ఉంటారు. ఆర్థికసమస్య ఎడతెగని సమస్య. అది ఆయన ఉద్యోగం చేస్తూన్నప్పుడూ ఉంది, చాలించినప్పుడూ ఉంది. పెద్ద ఉద్యోగస్తుడన్నమాటే గాని ప్రాణానికి ఆర్థికమైన సుఖ మెప్పుడూ లేదు.

రామమూర్తిగారు కొడుకులకి పెద్ద కట్నాలు పుచ్చుకొని పెళ్లిళ్లు చేశాడు. ముగ్గురు కూతుళ్లకి పెద్ద కట్నాలు ఇచ్చే పెళ్లిళ్లు చేశాడు. దానివల్ల మిగిలింది లేదు, కూతుళ్ల పెళ్లిళ్లకి ఇంకా కాస్త తగిలింది కాని.

పాపారావుపెళ్లికట్నం కలిసి వచ్చేది కాదు. ఎందుచేతంటే, ఆఖరికూతురు పెళ్లికి సిద్ధంగా ఉంది. అక్కడ పుచ్చుకోడం, ఇక్కడ సమర్పించడం కాగా, పైగా చేతిది పడకపోతే, దైవం రక్షించినట్టు. అటు కొడుక్కి, అంటే పాపారావుకి, ఇటు కూతురికి కూడ సంబంధాలు వస్తున్నాయి. రెండు పెళ్లిళ్లు ఒక్కసారి జరిపితే మంచిదని ఎవరో అనగా, ఇల్లాలు మూతి మూరెడు చేసింది. ఆర్థిక కష్టసుఖాలు ఆడదాని కేమి తెలుస్తాయి! రామమూర్తిగారుమట్టుకు మాట్లాడకుండా ఊరుకొన్నాడు. ప్రస్తుతం డబ్బుఎద్దడిరోజులలో ఇద్దరికీ ఒక్కమాటు చెయ్యడం కొంత మంచిదే అని ఆయనికి తోచినమాట నిజమే! కాని ఇంటిలో సంగతి ఏమిటి? ఆవిడ ఒప్పుదల లేంది ఏపనీ అవదు. తాతాచార్ల ముద్ర! ఓ పట్టాన్ని ఆవిడ ఒప్పుకొంటుందా! తహసిల్దారు దర్జా ఆయన కేం తెలుసు, ఆవిడకిగాని!

సంబంధాలు వస్తూన్నప్పటికీ రామమూర్తిగారు పిల్లల పెళ్లిళ్లవిషయంలో అట్టే తొందరపడడంలేదు. పెళ్లిళ్లు కాకపోతాయా, ఎటువచ్చీ ఎక్కడేనా కాస్త కూడబెట్టి ఉంచాలిగాని!

ఆయన పదవినుంచి విరమించినా, మామూలుజనులు ఆయన్ని పింఛనీ పుచ్చుకొన్న మనిషిలాగు గాక వెనుకటి హోదాతోనే చూస్తున్నారు. రాబడి గభీమని ఏటికాలువ తీసినట్టు తగ్గిపోయిందన్న సంగతి వాళ్ల కేమి తెలుసు! తెలిసినా దానిలో ఉండే కష్టసుఖాలు ఏమి అర్థమవుతాయి! డబ్బుకి జాటువల్ల రామమూర్తిగారు ఏడాదికీ రెండేళ్లు ముసలివాడవుతున్నాడన్న విషయం పైవాళ్లకి అక్కరలేదు సరికదా, ఇంటిలోవాళ్లకి కూడా అక్కరలేదు.

ఇంటిల్లిపాదితో పరిచయమున్న పేరయ్య పాపారావుకి ఒక సంబంధం తీసుకువచ్చాడు. అందులో అతనికి ఏమీ లాభం లేదు. సంబంధం కుదిర్చేడన్న పేరుతప్ప అతనికి మిగిలేదేమీ లేదు. వాళ్లకి ఒకర్తే కూతురు. తండ్రిపోయి ఏడాది గడిచిపోయింది. ఆస్తిపాస్తులు బాగా ఉన్నాయి. తన ఏకసంతానం వివాహం తండ్రి కళ్లారా చూసుకోలేదే అన్నలోపం తప్ప మరేమీ లేదు. లోగిలికూడ ఉంది. కాకినాడలో జగన్నాథపురం కాపరస్థలం. పేరయ్యకి ఈ నైనం నాళంవారి సత్రంలో సావిటింలో ఊరికే కాలక్షేపానికి దొర్లుతూండగా, అక్కడికి అదే పనిమీద వచ్చిన మరొక పెద్దమనిషివల్ల తెలిసింది. దాని విషయమై మరికొందరిని వాకబుచేశాడు. మెప్పుపొందాలని చెప్పి తహసిల్దారుగారికి చెప్పకుండానే జగన్నాథపురం బయలుదేరి వెళ్ళాడు. అతను విన్న విషయాలలో ఏమీ తేడా కనబడలేదు. సంబంధం ఇంచుమించుగా సైటుచేసుకొని చక్కా వచ్చాడు. విషయం సవిస్తరంగా తహసిల్దారుగారి ఇంటిలో చెప్పాడు. గృహిణి చాల సంతోషించింది. అలాంటి సంబంధమే, అంటే, ఒకేఒక కొడుకు, ఆడపడుచులేనా లేకుండా, ఉండే సంబంధం-కూతురికి కూడ దొరికితే ఎంతో బాగుండును అనకొంది. సంబంధంవిషయం తహసిల్దారుగారి నోటీసులోకి వెళ్లింది. ఇంటిలో అందరికీ ఒప్పుదల అయితే ఆయనమట్టుకు వద్దంటాడా! ఇంకా తెలియని విషయాలు ఏమేనా ఉంటే కనుక్కొని రావలసింది అని పేరయ్యని మరొకసారి జగన్నాథపురం పంపాడు. నిలుచున్నపాటున పేరయ్య ప్రయాణం కట్టాడు.

పాపారావు ఎర్రగా సన్నగా ఉంటాడు. పంట్లాము, షర్టు వేసుకొంటాడు. మొహం తేటగా ఉంటుంది. ఆ అందం చాలక సోడుకళ్లజోడు ఒకటి తగిలిస్తాడు. అతని

చూపు నేలవైపుకంటె కొంచెం ఆకాశం వైపు ఎత్తి ఉంటుంది. భూమిమీది పదార్థాలు ఏమంత మన్నన పాత్రాలని కాబోలు అతని ఊహ! తెలివితేటలకి లోటులేదు కాబట్టి పట్టీలు కొట్టకుండా చదువులో నెగ్గుకువస్తున్నాడు. అతని సాంఘికాభిప్రాయాలు సంప్రదాయానికి కొంత భిన్నంగా ఉంటాయి. ఇంటిలోవారు అందరూ అజ్ఞానులు, పూర్వాచారపరాయణులు అంటాడు. తరుచుగా సంఘసంస్కరణ సభలకి వెళుతూంటాడు. తోటివాళ్లతో సాంఘిక విషయాలనిగురించి చర్చించి, వాదిస్తూంటాడు. తనతో భేదాభిప్రాయమున్న ప్రతివాడిని పట్టి తెలివితక్కువవాడని నిర్ణయించుకొంటాడు.

ఇంటిలో గడబిడ అంతా పాపారావు చూస్తూనే ఉన్నాడు. కాని అతనికి ప్రత్యేకంగా ఏవిషయమూ చెప్పినవారు లేరు. తన్నుచూసి ముసిముసినవ్వులు నవ్వుకొన్నప్పటికీ అట్టే గమనించక, అది ఎప్పటి తీరే అని సరిపెట్టుకొంటున్నాడు. పెళ్లివిషయం అతనిదగ్గిర ఎవరు కదిపినా 'ఉఁ ఉఁ' అంటాడని అతనితో ఎవరూ అసలు ముచ్చటించలేదు. ఇక అతనికి ఏలాగు తెలుస్తుంది! పీటలమీద కూర్చునేవేళప్పుడే చెప్పవచ్చునని కాబోలు వాళ్ల ఊహ!

పేరయ్య తిరిగి వచ్చాడు. కట్నం కానుకలదగ్గిరకూడ ఏమీ తేడా రాలేదు. ఆడపడుచులాంఛనాలుకూడ అడిగిన ప్రకారమే చెల్లిస్తామన్నారు. తహసిల్దారుగారితో వియ్యమందడం! పైగా ఒక్కర్తే కూతురు! ఎప్పటికైనా ఆ ఆస్తిఅత్తవారికి చెందవలసిందే!

కొంచెం గడ్డుసమయం వస్తూందని ఇంటిలో అందరూ ఊహించుకొన్నారు. భోజనాలవేళప్పుడు వంటమనిషియైన సుందరమ్మ వడ్డిస్తూంది. తల్లి నేతిగిన్నె పట్టుకొంది. అందరికీ నెయ్యి వడ్డించి, గిన్నె కిందపెట్టి, సంభాషణ కొంత అందించింది. తండ్రి దానికి దోహద మిచ్చాడు. పక్కని కూర్చున్న ఒకరిద్దరు చుట్టాలు భళా భళీ అన్నారు. తన పెళ్లిమాటలే అని పాపారావుకిమట్టుకు ఒంటిలో రగులుకుపోతూంది. అంతమందిలో ఏ మనడానికీ ధైర్యం చాలడం లేదు.

భోజనాలయి సావిటిలో కూర్చున్నారు. తల్లి ఇంకా భోజనానికి లేవలేదు. వాళ్ల సంభాషణ విందామనుకొంది. ఆవిడ లేవలేదుకదా అని సుందరమ్మకూడ సావిటిలోకి వచ్చింది. పాపారావు చెయ్యి కడుక్కొన్నతర్వాత తిన్నగా తన గదిలోకి వెళ్లిపోయి, మేజాబల్లమీద లాంతరు పెట్టి, ఏదో పుస్తకం తెరిచాడు. అతని దృష్టి భోజనాలదగ్గిర జరిగిన సంభాషణమీదికి పోతూంది పది నిమిషాలయింది. ఇంతటిలో చెల్లెలు వచ్చి "నిన్ను పిలుస్తున్నారురా!" అంది.

"ఎవరు?" అన్నాడు అన్నగారు, ఏమీ సానుభూతి లేకుండా.

సావిటిలో జరుగుతూన్న సంభాషణలో పిలిపించండి అంటే పిలిపించండి అనే తీర్మానమయింది కాని ఫలానామనిషి తీసుకురమ్మంటున్నాడన్న వైనం తేలలేదు. ఈ తంతు పూర్తికాకుండానే చెల్లెలు చక్కా వచ్చింది. అందుచేత అన్నగారి ప్రశ్నకు జవాబు చెప్పలేక తడుముకొంటూ ఆఖరికి "అందరూ" అంది.

పాపారావుకి చిరాకులోనే నవ్వు వచ్చింది. కాని ఆగిపోయింది. అతను లేచి పైమీద ఖద్దరుతువ్వాలు వేసుకొని వచ్చాడు.

అతను తనంతట తానే వచ్చినట్లుగా తండ్రి ఊహించుకొని సంతోషించాడు. అంత సుళువుగా అతను రావడం అందరూ శుభసూచకంగా భావించారు. జరిగిన విషయమంతా తల్లికిమాత్రం తెలుసు.

రామమూర్తిగారు కొడుకుని కూర్చోమన్నాడు.

తండ్రిదగ్గిరున్న చేతుల కర్ర కుర్చీ ఒకటి దూరంగా లాగుకొని కొడుకు కూర్చున్నాడు.

"అబ్బాయీ! సంబంధంసంగతి వినే ఉంటావు" అన్నాడు ముసలాయన.

"ఎవరికి?" అని ప్రశ్నించాడు కొడుకు వెంకితనంగా.

పక్కనున్న బంధువొకాయన "నీ విషయమేనోయ్!" అని స్పష్టపరిచాడు.

పాపారావు ఒంటిలో చర్రుమంది. కాని తండ్రిభయంవల్ల తమాయించుకొని "ఓహో! నాకు తెలియదులెండి!" అన్నాడు, తీవిగా బుర్ర పెట్టి, కనుబొమ్మలు ఎగర వేస్తూ.

అక్కడే ఉన్న పేరయ్య కథ అందుకొన్నాడు. పెళ్లికూతురిని కళ్లకి కనపరిచినట్లు, చవులూరేటట్లు వర్ణించివేశాడు.

పాపారావుగుండె రాంఢోలులాగు కొడుతూంది. కోపంతో తల తిరిగిపోతూంది.

మధ్యమధ్య రామమూర్తిగారు, ఆయన భార్యకూడ పేరయ్య మాటలకి అనుగుణంగా ఏవేవో ముక్కలు పడవేస్తున్నారు.

పాపారావు తాను చెప్పదలుచుకొన్న మాటలు గొంతుకదాకా వచ్చి వెనక్కి వెళ్లిపోతున్నాయి. అతను కోపం పట్టలేకపోతున్నాడు.

తండ్రి స్పష్టంగా "అబ్బాయీ! ఇది నీకు చాలా అనుకూలమైన సంబంధం. పిల్ల చాలా యోగ్యమైనది. ఇప్పటివరకు వచ్చిన సంబంధాలలో ఇటువంటిది లేనే లేదు. కాబట్టి చక్కగా ఆలోచించు" అన్నాడు.

"ఆమాట నిజమే!" అంది తల్లి.

పాపారావుకి అటువంటి సంభాషణ మీదే కోపంగా ఉంది. ఆ సంబంధం తెచ్చిన పేరయ్యని మింగివేద్దామని చూస్తున్నాడు. అంతేకాని తల్లిదండ్రుల మీద కోపపడడం లేదు.

"ఈసంబంధం చేసుకొంటే నేను కళ్లార చూస్తాను. ఇహ నేను చేసే కార్యకరాదులు ఇంత ముఖ్యమైనవి ఏమి ఉన్నాయని!" అన్నాడు తండ్రి; కూతుళ్లకంటె కొడుకులు ముఖ్యమనే ధోరణిలో.

"కడసారిబిడ్డడు. ఇహ నేమున్నాయి!" అని తల్లి. అతనితర్వాత గతించిన పసిగుడ్ల నిద్దరిని తలుచుకొని కనుకొలుకులు ఒత్తుకొంది.

పాపారావుమనస్సు తిప్పడానికి ఇదే మంచి అదనని పేరయ్య "దాని కేమి అభ్యంతరం. ఏక్షణంలో పడితే ఆక్షణంలోనే చేసెయ్యవచ్చు" అన్నాడు. చిటికెలు వేస్తూ.

పేరయ్యమీదికి, పెద్దపులి ఎద్దుమీదికి దూకినట్టుగా దూకుదామనుకొంటున్నాడు పాపారావు.

పాపారావుస్వభావం పేరయ్యకు బాగా తెలుసు. తలిదండ్రులు దగ్గిర ఉండబట్టి తనమీదికి లేవడంలేదు కాని లేకపోతే మీదపడి తినేసేవాడే అనుకొన్నాడు. వాళ్ళ ఆసరా చూసుకొని అనవలసిన మాటలన్నీ ఏకరువు పెట్టదలుచుకొన్నాడు.

"నాయనా! నువ్వు ఒప్పుకోక తప్పదు" అన్నాడు తండ్రి, మనస్సు కరిగేటట్లు.

తల్లి బలపరచపోతూండగా పాపారావు మొదటిసారి నోరు విప్పాడు. "నాకు అక్కరలేదు" అనే మాటలని బాంబుని దొర్లించినట్టు ఇవతలకి దొర్లించాడు.

అంతా నిశ్శబ్దమయింది.

తండ్రికి నోరాడలేదు.

తల్లి "అలాగు అనకూడదు నాయనా" పెద్దవాళ్లమాటకి ఎదురు చెప్పకూడదురా!! అంది.

పేరయ్య అందుకొని "ఇహ తప్పదు చేసెయ్యడం! ఇప్పటికే అప్పుడే ఆలస్య

మయి పోయింది! ఇంకా ఎంత కాలమని ఊరుకోడం!" అన్నాడు.

"నాకక్కరలేదంటే!" అని పాపారావు పేరయ్యవైపు ఉరిమిచూశాడు.

"ఎందుచేతరా? ఎప్పటికైనా చేసుకోవలసిందే కాదుట్రా! నేనుకూడా చూస్తానురా! ఇహ ఎంతకాలముంటాను నేను మట్టుకు! నేను రోజులు లెక్కపెట్టుకుంటున్నాను. కడసారిబిడ్డడి పెళ్లి కళ్ళతో చూసి మరీ చాలించడమవుతుంది. నాకు శాగ్యతలా ఇంక ఉండవు!" అన్నాడు తండ్రి దీనంగా.

కాని పాపారావు తండ్రిమాటలకి ఎదురు చెప్పుతున్నానని అనుకోడం లేదు. తన మనస్సు చెప్పేమాటలని విశదపరుస్తున్నాననుకొంటున్నాడు.

"నాకు అక్కరలేదు. చదువు పూర్తి అయేకగాని చేసుకోను" అన్నాడు. అది ఎప్పటివాదమే!

"పెళ్లిఅయితేమట్టుకు చదువుకోకూడదా ఏమిటి. అయిననంటనే కాపరానికి వచ్చి కూర్చుంటుందా ఏమిటి!" అన్నాడు పేరయ్య. ఆశ ఇంకా బాధించగా.

అతికోపంచేత పాపారావునోట మాట రాలేదు.

జవాబు చెప్పకపోగా, వ్యర్థమైన ఆశలనుకొంటూ తండ్రికూడా ప్రశ్నించాడు.

"నేను చేసుకోను, నన్ను అడిగవద్దు" అని కోపంచేత వణుకుతూన్న కంఠస్వరంతో పాపారావు అని, చివాలున లేచి వెళ్లిపోయాడు.

"ఈకాలపువాళ్లతో వచ్చిన అల్లరే ఇది! వాళ్లకి తెలియదు, పెద్దవాళ్లు చెప్పే వినరు! ఇది తెలిసిన వయస్సూ కాదు, తెలియని వయస్సూ కాదు!" అని తహసిల్దారు తనని నాలుగు తిట్టుకొన్నాడు.

తల్లి విచారించింది. "ఈకాలపు కుర్రవాళ్లకి లేనిపోని స్వతంత్రం "పెద్దలయెడ ధిక్కారం అన్నాడు పేరయ్య ఉండబట్టలేక.

"వట్టి మోటమనిషి. పెద్దవాళ్లని మదలకించకూడదని ఎరగడు" అంది తల్లి కోపంతో

"ఈతరంవాళ్లు, తమ మేలూ ఎరగరు. ఒకళ్ల మేలూ ఎరగరు" అని విచారించాడు తహసిల్దారు.

"అనుభవిస్తాడులెండి!" అని పేరయ్య గొణుక్కొని ఇంకా ఆశ వదలక కూర్చున్నాడు. తాను ఎంతో ఆశపడ్డపేరు పోయినందుకు ఒకవైపు విచారిస్తున్నాడు. లాభం లేదని మిగతావాళ్లకి బోధపడి అవస్థపడుతున్నారు.

తహసిల్దారుగారింటిలో పనిచేస్తూన్న సుందరమ్మకి ఇద్దరు కొడుకులు, ఒక కూతురున్నూ. కూతురిపేరు పార్వతమ్మ. ఆ అమ్మాయికి చిన్నతనంలోనే, అనగా తొమ్మిదోయేటే, పెళ్లి చెయ్యగా మరుచటి సంవత్సరమే ఆ కుర్ర భర్త కాస్తా గతించాడు. పాపం ఆపిల్ల ఇల్లుపట్టింది! ఆ అమ్మాయికి ఇప్పుడు పదహారోఏడు. నవీనసంప్రదాయంప్రకారం ఆమెకి నుదుట ఒక్క కుంకుమ తక్కువకాని మరేమీ లోటులేదు. భర్త గతించేక, బతుక్కి రెక్కలే ఆధారం కదా అని ఆమెతల్లి కొంత చదువు చెప్పించింది. హైస్కూలులో నాలుగోఫారం పూర్తి కాగానే ముఖ్యంగా వ్యక్తురాలయిందన్న కారణంచేత, చదువుకొని ఉద్యోగం చెయ్యాలా ఊళ్లేలాలా అని చదువుమానిపించింది తల్లి. సుందరమ్మ తన అనుభవంలో ఉద్యోగంవల్ల చాలా బాధలున్నాయని చెప్పి ఆపిల్లకి ఉద్యోగచదువుపొంతకీ, ఉద్యోగాలపొంతకీ పోనియ్య లేదు. ఎప్పటికేనా ఇప్పటికు తల్లి చేతులో ఉన్న నౌఖరీయే గతి. ప్రస్తుతం ఆపిల్లకి ఇంటి పనులతోనే తీరిక ఉండదు. ఎప్పుడేనా కాలక్షేపానికి ఆ అమ్మాయి తన తల్లితో కూడ తహసిల్దారు గారింటికి వస్తూంటుంది. పైగా వాళ్ల ఇల్లు దగ్గర కాదు. తహసిల్దారు గారిల్లు దానవాయిపేటలో ఉండగా, ఆమె ఇల్లుమార్కండేశ్వరస్వామిగుడిదగ్గిర ఉంది. ఎప్పుడేనా జరూరుపని చెయ్యవలసి వచ్చినా, లేక భారమైనపనులు తటస్థించినా, సుందరమ్మే తన బిడ్డని సాయం తీసుకొని వస్తూంటుంది. ఆ పిల్ల పసితనంలో వస్తూన్నంత చొరవగా ఇప్పుడు రావడంలేదు వాళ్లది సత్సంప్రదాయం. భాగ్య భోగ్యాల మాట ఎట్లా ఉన్నా, మర్యాదగల కుటుంబం. అందుచేత తహసిల్దారుగారుకూడా చాలా గౌరవంతో చూస్తుంటాడు. పార్వతమ్మని చిన్నతనంనుంచీ పాపారావు ఎరుగును.

ఒకరోజున సుందరమ్మ పార్వతమ్మని పనికి సాయంకోసమని తహసిల్దారుగారింటికి తీసుకొనివచ్చింది. పాపారావు గదిలో వున్న కాగితపుబుట్టతో అవసరం వచ్చింది. తహసిల్దారుగారి భార్య, పాపారావు ఇంటిలో లేడనే ఉద్దేశంతో, పార్వతమ్మని ఆగదిలోకి వెళ్లి బుట్టతీసుకరమ్మని పంపించింది. పార్వతమ్మ వెళ్లింది.

పాపారావు కుర్చీమీద కూర్చుని దీక్షగా చదువుకొంటున్నాడు. ఎవరూ లేరనే ఉద్దేశంతో పార్వతమ్మ చొరవగా గదిలోకి వెళ్లింది. లోపలికి వెళ్లి అటుఇటు చూడగా పాపారావు కనబడ్డాడు. ఆ అమ్మాయి తిరిగి వెళ్లిపోబోయింది. కాని అతను "ఏమిటి పని?" అని అడిగాడు.

వున్న సంగతి స్పష్టంగా చెప్పితే మంచిది. లేకపోతే ఏమి అనుమానపడతాడోఅని ఆఅమ్మాయి "ఇక్కడ కాగితపు బుట్ట ఉందిట! మీ అమ్మగారు తెమ్మన్నారు" అంది.

ఆవస్తువు మంచంకింద ఉంది, అందుచేత అతను మంచంకిందికి దూరి తీసుకువచ్చి, పార్వతమ్మ చేతికి ఇయ్యబోతూ, ఆమె మొహంవైపు ఉట్టినే జంకుతూ చూశాడు. బేడిసాలలాంటి మెకళ్లు అతనిదృష్టినినిలబెట్టేశాయి. పాపారావు తన్ను మరిచి చూశాడు. పార్వతమ్మసిగ్గుపడి మొహంవంచుకొని,పమిటకొంగు దగ్గిరికి లాగుకొని,నిలబడింది.అతను జ్ఞానం తెచ్చుకొని, చటాలున కాగితపుబుట్ట ఆమెచేతికి అందిచ్చాడు. ఆమె ముంజేతిని చూస్తూ నిలబడిపోయాడు. కాని తన చూపుకి ఆమె ఏమనుకొంటుందో, ఎవరితో చెప్పుతుందో ఏమిటో అని భయపడిపోయాడు.ఆ అమ్మాయివెళిపోయింది. అతనుగదిలో ఉన్నాడన్న సంగతి ఆమెఎవరికీ చెప్ప లేదు.

పాపారావుధ్యానం ఆ అమ్మాయి మీదే ఉంది. అతను మనస్సంతా చదువుమీద కేంద్రీకరించాలని ఎంతో ప్రయత్నం చేస్తున్నాడు. కాని ఒక్కక్షణం పుస్తకంమీద ఉంటూ, అతనికి తెలియకుండానే జారిపోతూంది. మళ్లీ తెలివి తెచ్చుకొని మళ్లీ పుస్తకంవైపు చూస్తూన్నాడు. మళ్లీ మనస్సు జారిపోతూంది. ఇట్లా మనస్సుతో గుంపిసెంపీలు బడుతున్నాడు. చివరికి పుస్తకం కింద పెట్టివేసి 'ఇదేమిటా!' అని ఆలోచించడం మొదలుపెట్టాడు. పార్వతమ్మ అతని మనస్సులో పీఠం వేసుకు కూర్చుంది. "ఇంత కాలంనుంచీ ఆ అమ్మాయి ఇంటికి వచ్చి

పోతున్నా నేను అంత జాగ్రత్తగా చూడలేదు. ఇంత అందకత్తె! ఏమిటో అనుకొన్నాను. ఈ సినీమాస్టారులు వట్టి వేషధారులు. సహజమైన అందం లేనిదీ వేషం వట్టి డాంబికం. అబ్బా!" అనుకొన్నాడు. ఆమెయొక్క అందమైన నేత్రాలు, చక్కని తలకట్టు, కోమలమైన కంఠం, తామరతూడులాంటి ముంజేయి అతని మనస్సులో పదేపదే కనబడుతున్నాయి. అతను చదువు చాలించి పరుపు విప్పుకొని ముసుగుతన్ని నిద్రపోయాడు.' తీయని కలలు కన్నాడు.

పార్వతమ్మ మళ్లీ తహసిల్దారుగారింటికి రాలేదు. ఆ అమ్మాయి వస్తుందని పాపారావు ఎంతో ఉత్కంఠంతో ఎదురుచూస్తున్నాడు. కాని ఆ పిల్లదర్శనం అవటం లేదు. అందుచేత అతను ఒకమాటు ఆమె ఇంటివైపు వెళదామనుకొన్నాడు. కాని తాను గొప్ప ఉద్యోగస్థుడి బిడ్డడై ఉండి వంటమనిషి ఇంటివైపు వెళతాడా! అందుచేత ఆ అమ్మాయి తన ఇంటికి రావడం కోసమే కనిపెట్టుకొని చూస్తున్నాడు.

తల్లి ఏదో పనిమీద పంపించగా పార్వతమ్మ తహసిల్దారుగారింటి గుమ్మందగ్గిరికి వచ్చింది. ఆమె డైమానుసిల్కు సగ్గుబియ్యం చీర కట్టుకొంది. తలదువ్వుకొని బర్మాముడి వేసుకొంది. తలకట్టు నిగనిగలాడుతూంది. క్రీగంటిచూపులూ, బెదరులేడిచూపులూ చూస్తూ ఆమె వస్తూంది. ఇంటికి రావడం పాపారావుకంటబడింది. అతను చెదరిపోతూన్న మనస్సును నిలబెట్టుకోడానికి ప్రయత్నిస్తున్నాడు. ఊరికే తరంగాలలాగు వస్తూన్న ఉత్సాహంతో కుస్తీ పట్టుపడుతున్నాడు.

పార్వతమ్మ కిందటిమాటు ఘటన తలపోసి తడబడుతూ మెట్లెక్కింది. పాపారావు ఎదురవగా ఆమె పెదిమెలని చిరునవ్వు చుట్టివేసింది. ఎంత ఆపుకొందామన్నా ఆగకపోగా సిగ్గుపడి తల వంచుకొంది. గుండె తిరగబడి కొట్టింది. రవ్వంత భయం వేసి పాపారావు మొహంవైపు కొత్తపరీక్షగా చూసింది. పాపారావు చూపులతో ఆమెశరీరాన్ని గిలిగింతలు పెడుతున్నాడు. ఆమెకి ఎంతో సిగ్గనిపించింది. తల ఎత్తుకోలేకపోయింది. నడవడానికి కాళ్లు కదలలేదు. చిట్టచివరకి మనస్సుని సమాళించుకొని ఇంటిలోకి వెళ్లింది. ఆమెకి ఈ విపరీత మేమీ అర్థం కాలేదు. "ఏమిటిది? దీని పేరేమిటి?" అనుకొంది. తల్లి చెప్పమన్న విషయం తహసిల్దారుగారి భార్యకి చెప్పి ఆమె తిరిగి ఇంటికి చరచరా వెళ్లిపోయింది.

ఇంటికి వెళ్లినతర్వాత పార్వతమ్మ జరిగిన ఘటనంతా పర్యాలోకించుకొంది. "ఇదంతా ఏమిటి? నావైపు ఆ యువకుడు ఆమోస్తరుగా ఆవేశంతో చూడడమెందుకు? నే నేమి సమాధాన మిచ్చానని? నాకెంతో సిగ్గువేసింది అతను అలాగు చూస్తుంటే. ప్రేమ అంటారు, ఇదే కాబోలు! నాకు లేని ప్రేమ తన కెందుకు? నేను అడ్డువచ్చి గట్టిగా కేకలు వేశానంటే అతని పని ఏమవుతుంది! ఇది పెద్దవాళ్ల దాకా తీసుకుపోతేనో?...మన కెందుకు పోనీ అని ఊరుకొంటేనో?..... దానిలో ఏమి సుఖానుభవా లున్నాయో, ఏమిటో!" ఈ ఆలోచన తలపుకి రాగానే ఆమె మనస్సు ఉత్తేజం పొందింది. "నేను చూసీ చూడనట్టుగా ఊరుకోనా?" ఇంతటిలో మనస్సు "ఏమి పని చేస్తున్నావే పార్వతీ?" అని ప్రశ్నించినట్లయింది. "నేను తలచగూడని విషయాలు తలపోస్తున్నాను కాబోలు! దీనిలో ఎంత ప్రమాదముందో ఏమిటో! నా కంటికే కనపడుతున్నాయి కొన్నికొన్ని! ఇదివరకు ఇటువంటి పనులు చేసినవాళ్లని బట్టేనా కొంత ఊహించుకోవచ్చు. మా కుటుంబగౌరవం! ఎదుటివాళ్ల కుటుంబ గౌరవం! ఇటువంటి పనులు కొంపలోవాళ్లు హర్షిస్తారా? పెద్దవాళ్లకి చెప్పి చేద్దామంటే వాళ్లు ఒప్పుకొంటారా? చాటుగుండా అభివృద్ధిపొంది చావవలసిందే కదా? పైగా, వాడికి తెలియకపోతే ఇన్నేళ్లు వీపుమీదికి వచ్చి నీకు తెలియదా అని దుయ్యబట్టుకొంటారు నలుగురూను! ఎవళ్లు పెద్ద ఎవళ్లుచిన్న అన్నదికూడా గమనించరు. ఒకమారు పెళ్లి అయిందనిపించుకొన్న కర్మఫలమా ఇది? కనుక ఈ విషయాలలో ఎంతో జాగ్రత్తగా ఉండాలి పొరపాటున కాలు జారిందంటే ఘోరప్రమాదాలు జరుగవచ్చు!" అని అనుకొన్నది. "అయినా కంటికి కనబడుతూన్న విస్తృత సౌఖ్యలోకాన్ని వదులుకోగలనా?" అని మళ్లా తలపోసింది. ఆమె మథన పడుతూంది కాని స్థిరాభిప్రాయానికి రాలేకపోయింది. కొత్తగా వచ్చిన పరిస్థితులకి, గ్రహపాటుకి విచారించింది. ఆమెకి ఏమీ పాలుపోలేదు.

పార్వతమ్మ ఈమధ్య తహసిల్దారుగారింటికి పోనేలేదు. ఆమె రాకపోగా పాపారావుమనస్సు తహతహలాడిపోతోంది. అతని దృష్టి ఏ పనిమీదా నిలకడగా ఉండడం లేదు. ఏదో ఒక పని మొదలు పెడతాడు. అది కాదు ఇదంటాడు; ఇది కాదు అదంటాడు! పార్వతమ్మ ఇంటివైపు వెళదామని కోరిక పుట్టగా అతని బుద్ధి అడ్డు తగిలింది. కాని అతను గోదావరిగట్టుమీద ఉన్న ఆమె ఇంటివైపు వెళ్లి ఎక్కడో దూరాన్ని నిలుచుని చూడదలచాడు. అతను బయలుదేరివెళ్లి గోదావరిగట్టు మీద దూరంగా నిలుచుని, పార్వతమ్మ ఇంటిలోంచి ఇవతలకి వచ్చివెళ్లడం చూసి చాలా ఆనందపడ్డాడు. తనని చూసే ఆ అమ్మాయి బయటికి వచ్చిందని నిర్ణయించుకొన్నాడు. ఆమెమనస్సంతా తనమీదే ఉందని భావించుకొన్నాడు.

మధ్యమధ్య చిన్నచిన్న అవసరాలు కలిగినప్పుడు సుందరమ్మ తన కుమార్తెని తహసిల్దారుగారింటికి వెళ్లి రమ్మంటూంది. కాని ఆపిల్ల మొండితనంచేసి ఊరుకొంటూంది. ఈమోస్తరుగా ఆ అమ్మాయిదర్శనం అరుదు కాగా పాపారావుమనస్సువికలమైపోయింది. అతనే ఆమె ఇంటివైపు అప్పుడప్పుడు వెళుతూండేవాడు. ఆమె దారిలో ఒకటి రెండుసార్లు తారసిల్లగా, ఎంతో ఆప్యాయంగా సంభాషించడం మొదలుపెట్టాడు. కాని అతను ఊహించినంత ఉత్సాహంగా ఆమె బిడ్డమాట్లాడేది కాదు.

[ఇంకావుంది[

---

ఖగోళశాస్త్రజ్ఞు డొకాయన ఉపన్యాసం దంచేస్తున్నాడు.

"మరొక పదమూడుకోట్ల ఏళ్ళలో భూగోళంయావత్తూ నామరూపాలు లేకుండాపోతుందని నేను జోస్యం చెబుతున్నాను."

"ఎన్నేళ్లు ?" అని సభలోనుండి ఒక భయపడిన గొంతుక.

"పదమూడు కోట్ల ఏళ్ళలో."

ప్రశ్నవేసిన మనిషికి భయం తగ్గింది. "ఓ! పదమూడు కోట్లఏళ్ళా? మూడు కోట్ల ఏళ్ళేమోననుకున్నా!"

# దీపావళి



ల్యాణి కాపురానికొచ్చాక సత్యనారాయణరావు, విడిగా కాపురం పెట్టాక సరిగ్గా ఒక దీపావళే వచ్చింది.

సత్యనారాయణరావుకు దీపావళిపండుగంటే- అన్నిపండుగల్లోకి గొప్పది. చేతి జల్బు వదలించే పండగల్లో యిదో పండగన్న ఉద్దేశం అతనికసలు లేనేలేదు. తమ అన్నదమ్ములంతా కలసిఉన్నంతకాలం, దీపావళి పండుగలకు కావలసిన సామానంతా వాళ్ళే అంతా కలసి కట్టేశేవారు. ఇప్పుడు ఆస్తిపాస్తులు పంచుకొనటంతో అభిప్రాయభేదాలు యేర్పరుచుకొని, ఒకళ్ళముఖం ఒకళ్ళు చూసుకోనివాళ్ళకు దీపావళి పండుక్కి సామానంతా కలసికట్టేద్దామనే ఉద్దేశం ఉంటే మాత్రం ఉపయోగం ఏమిటి ?

అన్నదమ్ములందర్లోకి సత్యనారాయణరావే చిన్నవాడు. తల్లి ఒడిలో బిడ్డలాగ అన్నదమ్ములంతా కలిసిఉన్నంతకాలం బ్రతికాడు. ఎప్పుడయితే తల్లి మరణించిందో, మరి దాంతో వాటాలుపంచటం జరిగింది; సత్యనారాయణరావు తండ్రి జొత్తిగా, అతడి చిన్నతనంలోనే మరణించాడు

చిన్నవాడయిన సత్యనారాయణరావు, అన్నదమ్ము లందరికంటే కొద్దో గొప్పో చదువుకొన్నవాడవటంవల్ల నాగరికతాభిప్రాయాల్లో మున్గి తేలుతూ... జీవితంలోకి కళ్యాణిని కాపురానికి తీసుకొని వచ్చి నూతనాధ్యాయం ప్రారంభం చేశాడు.

కళ్యాణి కాపురానికొచ్చాక, అంటే- భర్తగారింటికివచ్చాక అదే ప్రథమదీపావళి. దీపావళిపండుగఅంతా సక్రమంగా జరుపుకొంటూంటే, అందరికంటే వైభవంగా (ప్రత్యేకంగా సామానువిషయంలోమాత్రం) జరుపుకొందామని సత్యనారాయణరావు ప్రయత్నిస్తూంటే... అడ్డంకుగా పండుగపేరుతో కూతుర్నీ, అల్లుణ్నీ తీసుకొని వెడదామని వారంరోజులు ముందుగా కళ్యాణితండ్రి వచ్చాడు. కళ్యాణి ప్రథమంలో పుట్టింటికి వెళ్ళవచ్చుగదా అని ఉత్సాహపడిందికాని సత్యనారాయణరావు ఉద్దేశం ఆమెకు,అతడు తన తండ్రితో చెప్పేదాకా తెలియదు.

'మామగారూ...మీరు వెయ్యిచెప్పండి. లక్ష చెప్పండి. దీపావళికి ప్రత్యేకంగా... మీరు తీసుకొనివెళ్ళటం బాగుండలేదు. మరేపండుగపేరయినా చెప్పండి. తీసుకొని వెళ్ళండి నే వద్దన్ను, ఇద్దరం కలసి పదిరోజులు ముందుగానే వస్తాం. ఈవిషయంలో మాత్రం మరి చెప్పకండి'

సత్యనారాయణరావుమామ వెలవెలపోయాడు. 'ఏమిటో నువ్వనేది నాకేమీ అర్థంకావటం లేదు. ఇతరపండుగల్లో రావచ్చునంటున్నావ్. ఈ పండుగ విషయంలోఅలాచేయటానికి వీల్లేదంటున్నావ్, ఏమిటో నాకు కాస్త విడమర్చి చెబుదూ' అని ప్రశ్నించాడు ఆయన.

'ఏంలేదండి, అది దీపావళిప్రత్యేకత. అంతకన్నా మరేంలేదు-' అన్నాడు సత్యనారాయణరావు.

'ఏమిటో ఆ ప్రత్యేకత... అన్నిపండుగల్లాంటిదేగా'- అన్నాడాయన.

'మీకయితే అయిఉండొచ్చు, నాకు మాత్రంకాదు. దీపావళి పండుగ అన్నిపండుగల్లోకి వైభవంగా ఉండవల్సిన పండుగని నాఉద్దేశం.'

'అయితే అయ్యుండవచ్చు. దానికీ నువ్వుఅనేదానికీ సంబంధం యేమిటో నాకర్థమవటంలేదు' అన్నాడు సత్యనారాయణరావు మామ.

సత్యనారాయణరావు ఓపికతో మాట్లాడలేకపోయాడు. "దీపావళి పండుగ యిక్కడే వైభవంగా జరుపుకొందామని ఉద్దేశపడుతున్నానండి' అన్నాడతను.


వైభవంగాఅంటే?'ఇక్కడ చేసుకొనేంతటి వైభవంగాగా అక్కడా జరుపుకో

వచ్చు. ఇక్కడకూ, అక్కడకూ వ్యత్యాసం యేమిటీ. అది మీయిల్లుగానే భావించు... నీ కేవిధంగా యేర్పాటుచేయాలంటే ఆ విధంగా యేర్పాటుచేస్తా. నా మాటవిని వచ్చినన్ను సంతోషపరచండి' అన్నాడాయన.

'మామగారూ మీరు చెప్పేమాటలేమీ నా కర్థమవటంలేదు. కావలసినంత వైభవంగా యెక్కడయినా చేసుకోవచ్చు. ఆవిషయంలో మీరు దూరంగా మాట్లాడుతున్నారు. నే చేసుకోగూడదన్నానా?' అన్నాడు వెగటుగా సత్యనారాయణరావు.

'అయితే నువ్వు చెప్పేమాటల ధోరణి నా కర్థంగాకుండా ఉంది. అసలు నీఉద్దేశం యేమిటో తేల్చిచెప్పనాయనా,' అని ప్రశ్నించాడు మామగారు ప్రాధేయపూర్వకంగా.

ఇంతవరకు తన ఉద్దేశాన్ని వెడల్రగక్కకుండా పైపై కబుర్లతో కాలక్షేపం చేశాడు సత్యనారాయణరావు. మరి అలాగా మాట్లాడితే పండుగసంగతి అటుంచి, తనకూ, మామగారికీ, మహా వైభవంగా యుద్ధంజరిగేటట్లు కన్పిస్తూంది. అందువల్ల సత్యనారాయణరావు తన వుద్దేశాన్ని మామయెదుట వెడల్రగక్క శిద్ధపడ్డాడు: దీపావళిపండుగవిషయంలో తాను, పత్నీసమేతంగా అత్తవారింటికి వెళ్ళకపోవటానికి కారణం, ఇక్కడ తాను బాణంసంచా తయారుచేసుకొన్న విధంగా, అక్కడ తయారుచేసుకొనటానికిగాని, కాల్చటానికి గాని వీలుండదు. ఎంత డబ్బు వెచ్చించినా అత్తవారింట చిన్నపిల్లలవిధంగా, తానూ బాణాసంచామీద మోజుచూపిసే తనంతా అవహేళనచేసాగు. తన డబ్బుతో సరుకుకొన్న సంతృప్తి అప్పుడుండదు అప్పుడు భాగస్వాములు హెచ్చవుతారు ఏదోవిధంగా సరిపెట్టుకొందామనుకొంటే కుదరదు. అన్నింటికంటె ముఖ్యంగా, వీలయినంత సామానూ, తానే స్వయంగా, తయారుచేదామనే ఉద్దేశంలో ఉన్నాడు. మరి అత్తవారింటికి వెళ్ళేపక్షంలో సామాను తయారుచేయటం కష్టం. ఒకవేళ తయారు చేసినా, తాను తయారుచేసేసరుకుతో వాళ్ళను సంతృప్తిపరచటం కష్టం... సరుకు బాగున్నా, బాగులేకపోయినా, యేదో విధంగా యేవోపేర్లు పెడతారు: ఇదీ కేవలం దీపావళిపండుగకు అత్తవారింటికి సత్యనారాయణరావు బయలుదేరకపోవటంలోని ఆంతర్యం.



సత్యనారాయణరావు ఆ ఉద్దేశాన్నే మామయెదుట బహిర్గతపర్చాలని ఉద్దేశపడ్డాడు. కాని అయితే చదువుకొన్నవాడవటంవల్ల, ఆవిధంగా చెప్పటం చిన్నతనంగా ఉండటమే గాకుండా, మర్యాదహీనం అని వూహించి, మరోవిధంగా తన అభిప్రాయాన్ని బలపర్చాడు.

'కొత్తకాపురం. ఏమయినాసరే ఈయేటికి యిక్కడె పండుగ చక్కగా జరుపుకోవాలని నా ఉద్దేశం. అందుకోసం మమ్మల్ని యీ మారుకి యిబ్బంది పెట్టకండి.'

'సరే నీ యిష్టం- అయితే అమ్మాయి సంగతి'- సత్యనారాయణరావు మామ ప్రశ్నించాడు. 'నేనేం చెప్పను. కొత్తగా కాపురానికి రావటం- విడిపోయిన తర్వాత దీపావళిరావటం కొత్త. నట్టింట పండుగపూటా దీపం వెలిగించేవాళ్ళయినా లేకుండాచేస్తారా? నా ఉద్దేశంమాత్రం మీరామెను తీసుకొనివెళ్ళటం యిష్టంలేదు. తర్వాత ఆమెయిష్టమూ, మీ యిష్టమూ' అన్నాడు సత్యనారాయణరావు.

భర్తయిష్టప్రకారం నడుచుకొనటం, తన కర్తవ్యమన్న సంగతికళ్యాణికి తెలుసు. తన వుద్దేశ్రప్రకారం ఒకమారు పండుగపేరుతో వెళ్ళి, పుట్టిల్లు, అక్కల్ని చూసి రావాలనిఉంది. కానయితే సత్యనారాయణరావు వీలులేదని మాచాయగా తేల్చినప్పుడు, తాను మొత్తపడటం అంత మంచిదికాదని ఆమె తలపోసింది. అందువల్లనే సత్యనారాయణరావు ఏంతేల్చకండా 'మీ యిష్టం' అని వదలివేయటంతోటే ఆమె తండ్రి 'ఏమంటావమ్మా' అని ప్రశ్నించాడు.

'అవునులే... ఈ పండుగకు యీలాగే కానియ్యండి, పోనీ నాన్నా' అంది.

'సరే అలాగయితే' అంటూ ఊరుకొన్నాడు సత్యనారాయణ మామ.

ఆయన వచ్చినపనిఅంతటితో పూర్తవటం వల్ల, మరి ఉండకుండా అంతటితో నిష్క్రమించాడాయన.

కళ్యాణి చిరుకోపం సత్యనారాయణ రావుమీద ఒలకపోసింది. సత్యనారాయణ రావు మనస్సులోమాత్రం కళ్యాణికి తన ఉద్దేశప్రకారం నడుచుకోటం యెంతో యిష్టం' అనుకొన్నాడు.

కానయితే తండ్రి వెళ్ళిపోవటంతోటే, కళ్యాణి కోపం ఒలకపోస్తూ 'మంచి పనిచేశారు- వచ్చినవాళ్ళను వచ్చినట్లుగా పంపిస్తారు. కొంత మంచి చెడ్డా యెప్పుడయినా యోచిస్తేగా అనింది.

సత్యనారాయణరావు తెల్లబోతూ అన్నాడు. 'పోనీ వెళ్ళకపోయావా' అని.

లేకపోతే యేమిటి చెప్పండి. ఇక్కడ చేసుకొనే పండగ అక్కడ చేసుకోకూడదూ. కొత్తగా మన్ని తీసుకొని వెల్తున్నప్పుడు, వాళ్ళకు వాళ్ళే యెంతో ఆర్భాటంతో చెయ్యకుండావుంటారా?' అని అంది కళ్యాణి.

'ఓస్. చెయ్యరని నేనన్నానా?... ఇక్కడ మనం పొందే ఆనందం, అక్కడ మనం ప్రయత్నించితేమాత్రం లభ్యమౌతుందేమిటి' అన్నాడు సత్యనారాయణరావు.

'ఏం ఎందుకు లభ్యంకాదూ? డబ్బు చేతినిండా ఉంటేసరి కొండమీద కోతినయినా దింపచ్చు. ఏం?' అంది కళ్యాణి.

'నే యెంత చెప్పినా నీకేం, అర్థంగాదు. నువ్వే చెప్పు... మనం అక్కడకెళ్ళినట్లయితే యీ బాణసంచా తయారుచేయటం ఎలా కుదురుతుంది' అన్నాడు సత్యనారాయణరావు.

'సరయితే బాగుంది. ఇంతకీ బాణసంచా తయారుచేసుకోటానికి వీలుండదని పంపటం మానారన్నమాట. బాగుందిలెండి ఎవరయినా వింటే నవ్విపోతారు' అంది కళ్యాణి పకపక నవ్వుతూ.

'చాల్లేమరి ఊర్కో'- అన్నాడు సత్యనారాయణ... కళ్యాణి అంతటితో ఊరుకొనక తప్పిందికాదు.

ఆమర్నాడే బజారుకుపోయి సత్యనారాయణరావు అన్ని సరుకులూ తెచ్చాడు. కళ్యాణికి సత్యనారాయణరావుచేద స్తం చూసేసరికి ఎంతో కోపంవచ్చింది. కూర్చున్నవాడు కూర్చున్నట్టుగా ఉండక, యేమిటీ కుట్టువాడివిధంగా, చిలిపి తనంపనులు చేయటం ఆమె కిష్టంలేదు.

సత్యనారాయణరావు భార్యచేత.. వస్తువులన్నీ విడదీయించి యెండబెట్టించాడు. కాచిన వేడినీళ్ళల్లో చన్నీళ్ళు పోసుకొనటానికి బద్ధకించే అతను, యెంతో శ్రద్ధగా సాయంకాలందాకా వాటిని కాపలాకాసి (కేవలం పనిలేనిమనిషి!) తిరిగి యెంతో జాగ్రత్తతో పొట్లాలుకట్టాడు.

కళ్యాణి కిదంతా చూస్తే... ఒకవైపునుంచి కోపం మరోవైపునుంచి అతని అమాయకత్వానికి జాలి, అతడు పడుతున్న శ్రమకు ఆనందం పొందసాగింది.

మర్నాడు... తెచ్చిన మంగులు దంచవలసివచ్చింది. కళ్యాణిని ప్రాధేయపూర్వకంగా కోరాడు సత్యనారాయణరావు 'కాస్త యివి నూరిపెట్టవ్' అని.

'ఆఁ నూరిపెడతా... మీరు చేసినపనికి- అంది కళ్యాణి.

కళ్యాణి కాపురానికొచ్చిందిమొదలు యిప్పటివరకూ ఒక్కగా ఒక్క దెబ్బలాట వచ్చింది. ఆసమయంలో ఒకళ్ళతరపు ఒకళ్ళు తెలుసుకుందామని యిరువురూ చాలాకాలంవరకూ మాట్లాడుకోకుండానే ఉండిపోయారు. చివరకు అబలఅవటం వల్ల కళ్యాణే నోరుజారింది. మరి అలాంటి పరిస్థితి తర్వాత కల్గలేదు. నేటికి మళ్ళీ.

సత్యనారాయణరావు తిరిగి వెనకటి విధంగానే నడుచుకు పోదామనుకొన్నాడు కానయితే కాళ్ళుపట్టుకొన్నంత పని చేశాడు యీసమయంలో. ఆమెను బుజ్జ

గించి, లాలించి... పైగా 'చక్కని చీర దీపావళి పండుగపేరుతో కొనిపెడతానని' వాగ్దానం చేసి.

కళ్యాణి యీమారు లొంగిపోయింది.. సత్యనారాయణరావు కోరినదల్లా చేసి పెట్టింది. సత్యనారాయణరావు కథమలుపు తిరిగినందుకు సంతోషించాడు. చకచక... మందులు నూరటం జరిగిపోయింది...

'ఏమేమి కట్టారు?'— ప్రశ్నించింది కళ్యాణి పెద్దఊహల్తో. ఆమె ఉద్దేశ ప్రకారం సత్యనారాయణరావు దీపావళి పండుగంటే చెవికోసుకొంటున్నాడు కాబట్టి యే తారాజువ్వలో యే చెక్రాలో కట్టాడని.

కానయితే సత్యనారాయణరావు తేల్చాడు 'ముత్యాల మతాబాలూ, చిచ్చుబుడ్లూ' అంతకంటె మరేంకావాలి నువ్వే చెప్పు—, అని.

కళ్యాణి ఫక్కున నవ్వింది. 'ఇంతా చేసి యీమాత్రమేనా మీరు చేసేది. ఒక ముత్యాల మతాబాలకోసం యింత హడావిడి..నిక్షేపంలాంటి పండుగ పాడుచేసుకొమన్నారు-' అని అంది తిరిగి.

'చాల్లెద్దూ...మళ్ళా గొడవ చెయ్యకు'- అన్నాడు ప్రార్థనాపూర్వకంగా సత్యనారాయణరావు-

'ఊఁ' అంది కళ్యాణి అప్పటికి...

అప్పటికప్పుడే, పాళ్ళప్రకారం మచ్చు మతాబా తయారు చేశాడు సత్యనారాయణరావు. 'చాలా చక్కగా వెలిగింది' అని సంతృప్తిపడి, కళ్యాణి నడిగాడు 'ఏలాగుందని' 'బాగానే ఉంది' అంది సాగదీస్తూ, కళ్యాణి.

'ఇప్పుడు కలిపినది. కొట్టువాడిచ్చిన పాళ్ళప్రకారం కలిపాను. వాళ్ళు పాళ్ళప్రకారం యీ సరుకు పొట్లాలు కట్టారు- మరి... యీపాళ్ళ కడ్డులేదు' అంటూ రుఉషాగా మాట్లాడాడు సత్యనారాయణరావు.

మరి అంతటితో తనపని పూర్తయిందని తెలుసుకొని 'మరిచీర'— అంటూ జ్ఞప్తి చేసింది కళ్యాణి.

'ఓ- దానికేం- రేపు తెస్తాగా' అన్నాడు సత్యనారాయణరావు.

'రేపే'— అంటే నరకచతుర్దశి రోజన్న మాట.' అన్నమాటప్రకారం కళ్యాణికి చీరకొన్నాడు ఏభైరూపాయలు ఖర్చుపెట్టి సత్యనారాయణరావు.

'పుట్టింటిదగ్గర పడే పాటే యిక్కడా పడ్డానుకదా' అని సంతృప్తి వెలిబుచ్చింది కళ్యాణి.

అప్పటి కప్పుడు కట్టినసరుకు చాలా పసందుగా ఉంటుందని సత్యనారాయణరావు ఉద్దేశం. అందువల్లనే అంతవరకూ గొట్టాలుసహితం, తయారు చేసినా, మందు కలిపి, కూరటం జరపలేదు.

'మరి మందులు కలిపి గొట్టాల్లో కూరెయ్యండి. మరి ఆలస్యం యెందుకూ?' అని ప్రశ్నించింది కళ్యాణి. ఆమె దృష్టి యిటువైపు మరల్చగలిగినందుకు- సత్యనారాయణరావు ఆనందాన్ని వెలిబుచ్చాడు. 'ఆ అలాగే యిప్పుడే ప్రారంభించుతున్నా...' అన్నాడు సత్యనారాయణరావు సామాగ్రి సిద్ధపరచుకొని.

తిరిగి పాళ్ళు వేసుకొని మాదిరిచూసుకోవలసిందని కళ్యాణి సత్యనారాయణరావును హెచ్చరించింది. 'మరెందుకూ.. మొన్న.. మతాబా కాల్చిన పాళ్ళప్రకారం యీ రుకు, సరిపోయేలా కొట్టువాడు కట్టి యిచ్చాడు- మరి చూసుకొనవలసిన అవసరం ఉండదు'- అంటూ కలిపేశాడు సత్యనారాయణరావు.

ఎంతో జాగ్రత్తగా మందు కలిపి, దట్టంగా గొట్టాల్లో, చిచ్చుబుడ్లలో నూకూరాడు. 'రేపురాత్రిదాకా ఒక్కటీ ముట్టుకొనటానికి వీల్లేదు - మనతడాఖా... ఒక్కగా ఒక్కసారే గుప్పున అందరూ తెలుసుకొవాలి, ఏమంటావ్?' అన్నాడు సత్యనారాయణరావు-

సరి... కళ్యాణికి వాటిమీద అసలు అభిరుచి లేనేలేదు. ముట్టుకొనటానికి వీల్లేదన్నప్పుడు, వాటిజోలికెళ్ళటం ఎందుకని మాట్లాడక ఊరుకొంది.

సత్యనారాయణరావు పిల్లవాడిలా బజారులోనికి పోయి మరో పదిరూపాయలు ఖర్చుపెట్టిముత్యాలమతాబాలు,చిచ్చుబుడ్లు మినహా వస్తువులు తీసుకొనివచ్చాడు.

'బాగుంది, మరీ పిల్లలయిపోతున్నారే' అంది కళ్యాణి-

'నీకేం తెల్సు- వీటి మజా.. రేపురాత్రి మతాబాముత్యాల్లో, ఈ రకరకాల సరులకు తళతళల్లో... నీ కొత్తచీర అందం కన్పిస్తుంది' అంటూ నవ్వాడు సత్యనారాయణ.

రోజు గడిచింది... రాత్రి వచ్చింది... పట్టణమంతటా తళతళలు, కన్పిస్తూంటే, టపటప వినిపిస్తూంటే, సత్యనారాయణరావు వీధిఅరుగుమీదకు సామగ్రితోవచ్చి కూర్చున్నాడు. కళ్యాణి కొత్తచీర కట్టుకొని భర్తగారి మతాబులు చూద్దామని వచ్చి కూర్చుంది.

సత్యనారాయణరావు వీధి అన్నివైపులా కలయచూశాడు ... అంతా కాల్చేస్తున్నారు- మనం ఉపక్రమించుదాం అంటూ మతాబాతీశాడు కాలుద్దామని ... ఎంత తీసినా అది కాలదే... మరోటి తీశాడు. అదీ అంతే...'మతాబాలకు దిష్టితగిలింది-' అన్నాడు విచారంతో సత్యనారాయణరావు- 'మీ దిష్టే దానికి తగిలింది...' అంది కళ్యాణి నవ్వుతూ.

'నీమూలంగానే యీలాగయింది' అంటూ కోపంవెడలగ్రక్కాడు సత్యనారాయణరావు.

'ఏం లేదు బాబూ.గంధకంపాలు యెక్కువైనట్లుంది. గుప్పున వాసన వేస్తూంది. మరి పనికిరావు... అలా పాడు చేశారేం-' అన్నాడు ప్రక్కింటి తాతయ్యగారు... అనుభవజ్ఞుడిలాగ చెబుతూ.

కళ్యాణి తిరిగి పకపక నవ్వింది. సత్యనారాయణరావు విచారం, ఉక్రోషం ఒకదానితర్వాత ఒకటిగా మిళితమయ్యాయి. కాని స్వహస్తాలతో చేసినవవటంవల్ల, వదల్లేక... తయారుచేసినవి మధ్య మధ్య అంటిస్తూ సంతృప్తిపడసాగాడు-

కళ్యాణి హేళనగా 'మతాబా..తళ.. తళలు ఒహో....' అనసాగింది.

సత్యనారాయణరావు గింజుకొనబోయే సరికి కళ్యాణినోరు మూతపడింది. కాని ప్రక్కింటి తాతయ్యగారు పెట్టిన రేడియో నోరుమాత్రం తెరవబడింది... అందులోంచి వినపడుతోంది 'దీపావళీ.. దీపావళీ.. ఇంటింట ఆనందదీపావళీ.. మాయింట శోకాంధతిమిరావళీ' అన్నపాట.

కళ్యాణి నవ్వుతూంటే, సత్యనారాయణరావు మరికాల్చటం మాని... వీధుల్లో మతాబాల తళతళల్లో కలుగుతున్న కాంతితో... వెఱ్ఱివానిలాగ ఆమెకేసి చూడసాగాడు.

---

నాటిక:




(రాజు, నీలమ్మా భార్యాభర్తలు – నీలమ్మ పల్లెటూరి పిల్ల; ముద్దరాలు; అమాయకపుది. బావ దగ్గిర నేర్చుకున్న సంగీతమే ఆమెవిద్య; తల్లిదగ్గర నేర్చుకున్న అణకువే ఆమె గుణసంపత్తి.—రాజు కోపిష్ఠి; సహనంలేనివాడు; సంసారబాధ్యత గుర్తించనివాడు.—పరస్పరవిరుద్ధగుణాల ఈసంసారనౌక ఒడిదుడుకుల జీవిత సాగంంలో ప్రయాణిస్తున్నదశలో...ఒకనాడు—)

రచన:

## శ్రీ కర్రా ప్రభాకరరావు

### 1-వ రంగము

రాజు: (సాధింపుగా) ఏమిటే, ఆ ఊరు తగలవేట్లా మంట?

నీలమ్మ: (వినయంగా) ఏముందండీ; కాస్త వేన్నీళ్లు పెట్టుకుంటున్నాను.

రాజు: ఏం మంచుకొండవిరిగి పడుతోందనీ, వేన్నీళ్లకి?

నీ: (భయంగా) మంగళారప్పూట తలంటుకుందామనీ, మరేముందీ?

రా: ఎన్నిమార్లేమిటి ఆ తలంట్లు? ఏం పెంట తగలేస్తున్నావని తలమీద?

నీ: పోనీలెండి...మళ్లీ మీరే తల ముతక వాసన వేస్తుందంటారేమో అని....

రా: ఆఁహాఁ! తలంటితే మరేం సంపెంగ వాసనెయ్యటంలేదులే...ఆఫీసుకు టైమౌతూంది. త్వరగా తెమిలి ఏడవచ్చు.

నీ: సరే అయితే...

*   *   *

రా: ఎందుకూ ఆ కుళాయిదగ్గర కూరాడుతావు?

నీ: నీళ్లుపోసుకుందామనండీ!

రా: నూతిదగ్గర తగలడకూడదూ? కుళాయిపన్ను తడిసి ముప్పన్నం అవడానికేమిటి? లేకపోతే డబ్బు ఇంట్లో మూలిగి పోతూందనా?

నీ: సరే అయితే...

*   *   *

రా: ఏమిటే ఇల్లెగిరి పోయేట్లా చప్పుడు?

నీ: అబ్బే! చేద నూతివరకి తగులుతున్నట్టుంది.

రా: స్వాహరిపోయింది! ఇక నీస్నానానికి రోజుకి ముప్ఫయిమూడు చేదలు కావాలనుకుంటాను. చాలు నీ విస్నానం; కాస్త కిందా మీదా చూసుకు ఏడు.

నీ: సరే అయితే.

* * *

రా: ఏమిటా పెట్టెచప్పుడు నూతిదగ్గిర?

నీ: ఏముందండీ; సబ్బుపెట్టె.

రా: ఇంట్లో ఉండే ముండలకి సబ్బు కూడా కావాలేం? కాస్త సున్నిపిండితో అఘోరించు.

నీ: వర్తిమొఖానికి సున్నిపిండి రాసుకోరుకదా అనీ...

రా: ఆఁ...మహా చంద్రబింబంలాంటి మొహం! అందం ఏం ఒలికిపోక్కర్లేదులే.

నీ: సరే అయితే!

* * *

రా: ఏమిటా మడత?

నీ: ఏముందండీ; పట్టుచీర మడత.

రా: ఇంట్లో కూడా పట్టుచీరె కావాలేమిటే?

నీ: చీర తడిముద్దగా వుంటేనూ...

రా: అయితే? కాస్సేపు ఆ తడిచీరతో నిలబడితే నేం? పెళ్లో మడతలు విప్పక పోతేనూ?

నీ: (సణుగ్గా) మరి పట్టుచీరెందుకో?

రా: (దెప్పుతూ) ఓ..హో...! తర్కం నేర్చుకున్నావేం! పట్టు చీరెందుకట? ఎందుకా...ఈ దరిద్రమొహం ఎవరింటికయినా భోజనానికి తగలడవలసొస్తే, అందం లేకపోతే నిండయినా వుంటుందనీ—

నీ: సరే అయితే!

* * *

రా: పప్పులోకి నెయ్యెయ్యక అలా కూర్చుంటావేం? ఆఫీసూ ఏమీ లేక నీలా దోమలు చంపుకుంటూ కూర్చోగల ననుకుంటున్నావా?

నీ: అబ్బే! సావకాశంగా తింటారని, అన్నీ ప్రక్కనే పెట్టుకుని కూర్చున్నా.

రా: ఊఁ. అఘోరించావు. ఓ నిమిషం కాలు నిలవదు...కుర్చీ ఏమైనా కావాలా?

నీ: సరే అయితే.

* * *

రా: ఎలా చెయ్యి కడుక్కోడం. నీ నెత్తిని తుడవమంటావేమిటి?

నీ: అదిగోనండీ నూతిదగ్గర పెట్టాను చెంబూ నీళ్లూను.

రా: ......ఉస్స్‌బ్బ! చేతులు కొంకర్లుపోతున్నాయి. చేతులు కడుక్కోడానికి కాసిన్ని వేన్నీళ్లు పెట్టి ఏడవకూడదూ? ఏం పాపం వస్తుందా, మొగుడికి ఆమాత్రం చేసి పెడితేనూ?

నీ: సరే అయితే.

* * *

రా: (ఉరుముతూ) ఏమే?

నీ: (వణుకుతూ) ఏమండీ?

రా: (చురచుర చూస్తూ) నా గొడుగేమైంది?

నీ: స్స్.. అన్నట్టు...పొద్దున్న దొడ్డిదగ్గర మరిచిపోయాను.

రా: ఆసి, నీ మొహం మండా? పాకీదొడ్డికి కూడా కొత్త గొడుగు కావాలటే? పైగా మరిచిపోయావూ? పదిహేను రూపాయ లిచ్చి బ్లాకుమార్కెట్టులో కొన్నాను. పోతే నీయబ్బ తెచ్చి ఇవ్వగలస్తే?

నీ: (సణుగ్గా) ఊఁ...ఈ ఇచ్చినవన్నీ చాలక..

రా: ఏమిటే సణుగు.. తిడుతున్నావేమిటి?

నీ: రామరామా! ఇప్పుడు తిట్టానుటండీ నేనూ?

రా: హుఁ.... ఇంకా తెలీదేమో నాసంగతి ఫెళ్లుమని లెంపకాయ కొట్టానంటే ముప్ఫైరెండు పళ్లూ గలగలా రాలి వళ్లోపడతాయి తెలుసునా?.... కదలవేం నిట్రాటలాగ... తీసుకురా వెళ్లిగొడుగూ!

నీ: సరే అయితే.

* * * *

రా: ఊఁ సరే నే వెడుతున్నాను. వీధితలుపు ఘడియేసుకుని ఇంట్లోనే అఘోరించు, ఎక్కడా పెత్తనాలు చిత్తగించక. సామా నెవడేనా చేరాశాడంటే నిన్నమ్మినారావు. ఆ అంట్లునాలుగూ నువ్వే తోలి చెయ్యకూడదూ, సాయంత్రంపూట ఊరికే కూర్చోపోతేనూ! ఆఁదొంగముండ..., ఏమీ తెలీదు. వర్తిమట్టిబుర్ర; అన్నీ చెప్పాలి! ఆఁ తలుపేసుకో..

నీ: సరే అయితే. (భర్త వెళ్లడంతోటే తలుపు గడియేసి అలాగే నేలమీద చతికిలబడి కూర్చుండిపోయి, ఆలోచిస్తూంటుంది).

హుమ్మయ్య (దీర్ఘనిట్టూర్పు తీసి) సాయంత్రందాకా మళ్లీ నరకం తప్పింది. అబ్బబ్బ! ఎన్నాళ్లు దేముడా ఈనరకం నాకు. ఇంక విముక్తి లేదేమిటి? ఓనాడా, రెన్నాళ్లా ఓర్చుకోడానికి! తప్పైనా లేదు! ఒప్పైనా లేదు! కట్టుకున్న పెళ్లామని పిసరంత కనికరమైనా ఉండదేం? చచ్చేట్లా చేసే చాకిరీఅయినా చూడరు కదా! రామ రామ! ఓనాడైనా పెదిమల మీద నవ్వు చూశానూ? ఇన్నాళ్లైంది కాపురానికి వచ్చి ఓనాడైనా చురచురలేని చూపు చూశానూ?... ఏమిటి ఆయన ఉద్దేశం? కట్టుకున్న పెళ్లాం, చచ్చినట్లు పడి ఉండక, ఏంచేస్తుందనా? కట్టుకున్న మొగుడన్న గౌరవం వదిలి నేనూ ఎదిరిస్తే? జబ్బదాకా వచ్చినా బక్కమనిషిగా అని ఈసడిస్తే? తమవుతుందీ ...? మెత్తగావున్న కొద్దీ మరీ మొత్తుతున్నారు!.... ఊ..హుం (దీర్ఘనిశ్వాసం తీసి) ఇక లాభం లేదు; దీనికి విరుగుడువెయ్యాలి. పిల్లల్ని కని, పెంచి, సంసారాన్ని వృద్ధిచేసే స్త్రీకి ఆ సంసారాన్ని సుఖవంతంగా చేసుకునే అధికారం లేదా ఏమిటి?... ఎందుకు లేదూ? సాహసిస్తే అన్నీ వుంటాయి. సరే! ఈనాటితో సరి, ఈ అఘాయిత్యాలకి... చూస్తాగా ఎందుకు లొంగరోనూ! హుఁ (తృప్తిగా దీర్ఘనిశ్వాసం తీస్తుంది)

## 2 వ రంగం

(మరి ఆరునెలలు గడిచినతరువాత. రాజు చేసే ప్రతి సాధింపుకీ నీలమ్మ నిర్భయంగా, తడుముకోకుండా ఎదురు చెప్తోంది. రాజులో ఏ చిన్నతప్పున్నా వెలికి దీసి దెప్పుతూంది. ఏమాత్రం మెత్తగా ఊరుకుంటున్నట్లు తోచినా ఉక్రోషం వచ్చేవరకూ ఎత్తిపొడుస్తుండేది. రాజుకు ఉక్రోషం వస్తే దబదబా ఇంటిసామాన్లు పెరట్లోకి గిరవాటేసేది. అప్పుడప్పుడు వంట వండడంకూడా మానేస్తుండేది. దీనికీ దానికీ అని పేరు చెప్పి చిల్లర పోగుచేస్తూ, ఆయనకు ఇష్టంలేని వస్తువులు కొని, ఆయనకు కనిపిస్తుండేట్లా అమర్చేది. ఆయనకు చీకాకు కలిగించే పనులకై అన్వేషణ సాగిస్తుండేది. పగతీరుతున్నకొద్దీ తీర్చుకుంటూండేది. రాజుకి తనశక్తి, బుద్ధినంతా ఆమెనుండితప్పించుకోడానికే వినియోగించ

వలసివచ్చేది. సంసారం ఈమార్గం పట్టిన దశలో - ఒకరోజున...)

రా: (అప్పుడే ఆఫీసునుంచి వచ్చి వీధి తలుపు తట్టుతూ)

ఏయ్... ఏయ్...

నీ: ... .... ...

రా: (మరీ గట్టిగా గొంతుక చించు కుంటూ)

ఏమేవ్... ఏయ్. ఒసేవ్...

నీ: (అంతకంటె పదిరెట్లు గొంతుక చించుకుంటూ) ఓయ్!

(తలుపు తీస్తుంది)

రా: ఏమిటల్లా గొంతుక చించు కరుస్తున్నావ్?

నీ: మీగొంతుక్కంటె చించుకో లేదుగా!

రా: గొప్పే! ఎన్నిసార్లు పిలిచినా తలుపు తియ్యలేదేం?

నీ: ఎన్నిసార్లు పిలిచారేమిటి?

రా: (ఉక్రోషంతో) ముప్పైసార్లు పిలిచాను!

నీ: (ఈసడింపుగా) హుఁ! ముప్పై సార్లూ తొంభైసార్లూను, ఎందుకో? ఓసారిపిలిస్తే చాలదేం?

రా: మరి మొదటిసారికి పలకలేదేం?

నీ: పిలవడం గొల్లెంబాదడం ఓసారే చేస్తే ఎల్లా వినిపిస్తుందీ?

రా: గొళ్లెంచప్పుడు వినిపించింది కదా!

నీ: వెధవ గొళ్ళెం, ఎప్పుడూ చప్పుడౌతూ నేవుంటుంది!

రా: పోనీ తలుపు కొట్టానుగా!

నీ: వెధవకుంకలు ఎవళ్లో అల్లరికి తలుపు బాదుతూ నేవుంటారాయె!

రా: మాటమాటకీ వెధవ వెధవ అంటూంటావేం?

నీ: మిమ్మల్నన్నానేమిటి?

రా: వన్నూ అంటావు.

నీ: ఏం నేను చచ్చిపోవాలని వుందా?

రా: నీకు చావుకూడానూ?

నీ: పోనీలెండి, మీకేవుంట!

రా: ఏం? మితిమీరి పేలుతున్నావు?

నీ: మనింట మితం ఎక్కడేడిసింది?

రా: కట్టుకున్న మొగుడితో నేనా ఈ మాటలు?

నీ: కట్టబెట్టిన పెళ్లాన్నికాబట్టేగా ఈ తిట్లు పడడం!

రా: మొగుడిమీదగౌరవమైనా లేదే నీకు?

నీ: ఊఁ...ఊఁ! పెళ్లాంమీద ప్రేమ ఒలికిపోతూందని మీకు!

రా: ఎంతంటే అంతే?

నీ: మీరన్నంతేగా!

రా: అయితే నువ్వూ నేనూ ఒకటే?

నీ: ఒకటవందే ఈసంసారం ఎట్లా పెరిగింది?

రా: ఆసి! నీ యమ్మకడుపు బంగారం గానూ!

నీ: "అదేదో నాకడుపునే పారెయ్యకూడదూ!

రా: సరె! ఇక నీతో మాటాడనులే? బుద్ధి వచ్చింది.

నీ: ఆ బుద్ధి నాకు వస్తే బాగుండును!

* * *

రా: సరే కాస్త అన్నం తగలేస్తావా?

నీ: ఈ తడికట్టెలు కాస్త తగలెయ్యండి తమరు!

రా: అయితే అన్నం వండలేదన్నట్టేనా అర్థం?

నీ: ఏం, నిఘంటువేమైనా తెమ్మంటారా!

రా: మరయితే, కాస్త ఎదుటి హోటలునుంచి తెప్పించకపోయావూ భోజనం.

నీ: తెప్పించకుండా ఇంకా కూర్చున్నాననుకున్నారు; మీరొచ్చి ఈ గొప్ప సలహా యిచ్చేదాకాను!

రా: అఁహాఁ! అయితే డబ్బు ఎక్కణ్ణుంచొచ్చింది?

నీ: మీ ఉప్మాలకీ, కాఫీలకి ఎక్కణ్ణుంచొచ్చిందేం డబ్బు?

రా: అయితే నువ్వూ కొత్తా ప్రారంభించావన్నమాట!

నీ: మీదోటి వెలుగుతోందిగా!

రా: కడతేరినట్టే సంసారం!

నీ: ఊఁ...హుఁ...!

* * *

రా: ఏమిటే గ్లాసులోవి మంచినీళ్లేనా!

నీ: తినేదానికి రుచెందుకూ?

రా: (కొంచెం నీళ్లు నోట్లోపోసుకుని) థు...థూ...ఏమిటే నీళ్లు?

నీ: నూతినీళ్లు ఉప్పగా లేకపోతే పరబత్తులా గుంటుందేం?

రా: ఏం మరి; పైపునీళ్లు తీసుకురాలేకపోయావా?

నీ: పైపు తగలబడింది!

రా: వీధిలో పైపుదగ్గిర్నుంచి తేలేక పోయావా?

నీ: వాన వొచ్చిందీ; గొడుగుకొట్టిస్తా మీరు ధరింతారుగా!

రా: (అనునయంగా) పోనీ పక్కింట్లోంచి పట్రాకపోయావుటే.

నీ: (ఉడుకుతూ) పక్కింటివాళ్లకేం పట్టిందండీ మనగోల?

రా: అయ్యో! అరవకే ఆవిడ వింటుంది.

నీ: (మరీ అరుస్తూ) వింటే విన్నివ్వండీ, నాకేం?

రా: ఇదేం ఘోరమే (నోరు నొక్కుకుంటారు).

(ఇంతలోకే పక్కింటి రాజేశ్వరమ్మగారు వస్తుంది. ఆవిడది పంచావంటి సంసారం. మంచి చదువుకున్నది. భర్త మంచి ఉద్యోగస్థుడు. అన్యోన్యమైన దాంపత్యం. ఆడపిల్లలు ముగ్గురికి చక్కగా చదువులు చెప్పించి మంచి చదువుకున్నవాళ్లకిచ్చి పెళ్లిచేసింది. ఎప్పుడూ ఏదో ఒక అల్లుడూ - కూతురూ జంట ఇంట్లో చిలకా గోరింకల్లా వుంటారు. చీకూ చింతలూ లేక, సొంపూ సంపదలు కలిగిన సంసారం! ఓగూ పోర్పూ లేక, వలపూ పొందూ కూడిన సంసారం - రాజేశ్వరమ్మగారు వచ్చి....)

రా: చూడు రాజూ! అమ్మాయ్ నీలం! ఎప్పుడూ మీరీ గుసగుసలాడుకోడం. సంసారంలో సుఖం, సంతోషం లేకపోతే ఎందుకూ? చిన్నపిల్లలకనుకనా చెప్పించుకోడానికి? ఏమోయ్ రాజూ! నీలం పాపం ముగ్ధరాలు. కల్లాకపటాలు ఎరుగనిది. వెన్నలాంటి మనసుకదా! ఆమెని ఎల్లా పెరగదీసుకోవాలి! చక్కగా చదువు చెప్తే కోకిలలా గానంచేస్తుంది. మెత్తని మాటలనడంలో పురుషత్వం ఏముంది చెప్పు? నువ్వు ఆదరిస్తే నిన్ను పూజిస్తుంది! నువ్వు తిరస్కరిస్తే మూలపడేడుస్తుంది. నువ్వు ప్రేమిస్తే నిన్ను గౌరవిస్తుంది; నువ్వు కసిరికొడితే ఇంట్లో దుఃఖం రేపుతుంది. ఇల్లాలును చక్కపెట్టుకోడంలోనే వుంది ఇంటిగొప్ప.... అమ్మాయి నీలం! మొగుడిమనస్సు అనుకూలంగా లేకపోతే నేర్పుతో త్రిప్పుకోవాలిగాని, మొగాడితో సమానంగా సాధిస్తే ఆడదానికి సాగదమ్మా! రాజూ! ఆమె నీ పంజరంలోని చిలుక! నీలం! ఇతను నీహృదయానికి కవచం! భార్యాభర్తలు అయేది సూత్రబంధంతో కాదు; ప్రేమబంధంతోటి! మీరు ఆనందంగా వుంటే పైవారికి ముచ్చట! మీరు కొట్లాడుకుంటూ వుంటే పైవారికి లోకువ అసహ్యమూను. నలుగురూ ఈర్ష్యపడొద్దూ మీసంసారం చూసి? చాల్లెండి. ఇక పైనుంచి అన్యోన్యంగా వుండండి... పైవాళ్లు ఎంతదూరం చెపుతారు! (వెళ్లిపోతుంది)

## 3 వ రం గం

(మరి ఆరునెలలు పోయినతరువాత. రాజూ, నీలం దెబ్బలాటలూ సాధింపులూ వదిలిపెట్టి ఎంతో అన్యోన్యంగా వుంటూంటారు. రాజు తన తీరికసమయాల్లో ఆమెకి తెలుగు చక్కగా నేర్పాడు. నీలమ్మ తన పుట్టింట నేర్చుకున్న త్యాగరాజకృతులు రాజుకు నేర్పింది. వడిదుడుకుల్లోంచి సుగమమార్గం పట్టిన సంసారదశలో... ఒకరోజున.)

రా: (అబ్బురంగా) నీలా!

నీ: (ప్రేమ ఉట్టిపడుతూ కోయిలలా) ఓ... యి!

రా: ఓసారి దర్శనం ఇస్తావూ?

నీ: ఇంకొక్క రెండు నిమిషాలు తపస్సు చెయ్యండి అయిపోయింది వేషం ధరించడం...

(బైటకి వచ్చి) కోరుకోండి ఏం వరం కావాలో?

రా: నీదయను మించిన వరం ఏముంది కానీ... మీచెల్లిలికార్యంట. మన్నిరమ్మని వుత్తరం వ్రాశాడు మీనాన్న... (గొణుగుతూ) నాకేమిటో అక్కడ తోచదు సుమా వెడితే, నువ్వు కావా...

నీ: నాకూ వెళ్లడానికి ఇష్టంలేదండి. పాపం మీరిక్కడ ఒంటరిగా, హోటల్లో భోంచేస్తుంటే నే చూడగలనా?

రా: (ధైర్యంగా) నాకూ అంతే సుమా! నీ కక్కడ పూలూ అవీ తెచ్చేవారూ... ఊ...ఇవీ అవీ చేసేవారూ ఉండరేమో అని నా దిగులు......

నీ: అబ్బ! ఎందుకండి ఆ దొంగమాటలు? విడిచిపెట్టి ఉండలేనని చెప్పకూడదూ!

రా: ఓహో! నువ్వు మహా సత్యవ్రతురాలవు! హోటల్లో భోజనం బాగుంటుందన్నావు కాదు నువ్వూ...

నీ: ఆఁ సరేలెండి (ఇద్దరూ నవ్వుతారు) అన్నట్లు మరిచిపోయాను సందట్లో; ఇవాళ ఇంటికి రావడం అంత ఆలస్యం చేశారేం?

రా: ఎంత ఆలస్యం, అయిదు నిమిషాలేగా!

నీ: మరే! ఆ అయిదునిమిషాలూ అయిదు గంటల్లా తోచాయి నాకు!

రా: నిజమే సుమా! ఆఫీసులో కూర్చున్న అయిదుగంటలూ అయిదు రోజుల్లా తోచాయి నాకు!

నీ: (కోపం నటిస్తూ) హుఁ. మిమ్మల్ని నమ్మకూడదండీ...

రా: ఇంతలోకే ఏం వొచ్చింది?

నీ: నేను లేకుండా అయిదురోజులు గడిచినట్లు తోచిందేం మీకు!

రా: ఓస్, అదా (ఇద్దరూ విరగబడి నవ్వుతారు).

* * * *

నీ: ఊఁ! రండి భోజనం చేద్దాం.

రా: నీలం! నిన్ను చూస్తుంటే నాకు ఆకలిమాట జ్ఞాపకం రావటం లేదే!

నీ: బాగానే వుంది. మిమ్మల్ని చూస్తుంటే నాకు వంటమాటా జ్ఞాపకం రావటంలేదు!

రా: అమ్మయ్యో! అయితే నడూ (పకపకా నవ్వులు) కాని భోజనందగ్గర కొన్ని షరతులు.

నీ: ఏమిటండోయి అవి?

రా: ఎవరి ఆకుల్లో వారే కూర్చోవాలి; ఎవరి వడ్డన వారే చేసుకోవాలి; ఎవరి ఆకులు వారే తీసేసుకోవాలి.

నీ: చాలా బాగుందండీ! ఏమిటి విశేషం ఇవాళ?

రా: ఇవి స్త్రీసమానహక్కులు.

నీ: చివరికి వచ్చినవి వీటిల్లోనా? (విరగబడి నవ్వుతుంది)

రా: (నీలాన్ని దగ్గిరికి తీసుకుని ఆమె ముఖాన్ని తన చేతుల్లో నిమురుకొని) నీలం! నువ్వు మాట్లాడుతూంటే నా హృదయంలోని నరాలను మీటుతున్నా వనిపిస్తుంది! నువ్వు హంసలా నడుస్తూంటే నా గుండెమీద పొడరుపువ్వు అద్దినట్లుంటుంది. నువ్వు చిలిపిగా నవ్వుతూంటే నా కళ్లల్లో గిలిగింతలు పెట్టినట్లుంటుంది! నీలం...

నీ: ఏమిటే స్తోత్రంఅంతాను; ఈ రాత్రినుంచి ఎవరి మంచాలు వారే వేసుకోవాలాయేనూ!

రా: అమ్మయ్యాయి; వద్దు!.. వద్దు!! కావలిస్తే నీ ఆకులు కూడా నేనే తీసేస్తానులే!

నీ: ఏం మగవాళ్లండీ! (పగలబడి నవ్వుతారు)

24-1-51

# "మంగళ"

(తెలుగుచిత్రం)

కథ : జెమినీవారి కథా బృందం, పాటలు-మాటలు : తాపీ ధర్మారావు, సంగీతం : ఎ. డి. పార్థసారథి, డైరెక్షన్ : చంద్రూ, నటీనటులు : భానుమతి, రంజన్, సూర్యప్రభ, టి. ఆర్. రామచంద్రన్, దొరస్వామి మొదలైనవారు.

మినీస్టూడియోస్ వారు, తాము యుద్ధ కాలంలో తయారుచేసిన "మంగమ్మశపథం" అనే చిత్రాన్ని కొత్తగా హిందీ, తెలుగుభాషలలో పునర్నిర్మించి సంక్రాంతినాడు విడుదలచేశారు. జనవరి 12న తెలుగు "మంగళ" జెమినీస్టూడియోలో పత్రికలవారికోరకు ప్రదర్శించబడింది.

"మంగళ" జానపదచిత్రం. ఆబాలగోపాలాన్నీ ఆకర్షించగల ఇతివృత్తంఆధారంతో ఈచిత్రం నిర్మించబడింది. నీతి నియమాలు లెక్కచెయ్యని ఒక రాజకుమారుడు అందగత్తెఅయిన సంసారిపిల్ల నొకదాన్ని చూసి మోహించి దానిచేత తిరస్కరించబడతాడు. వాడికి ఆపిల్లపై ఆగ్రహం వచ్చి ఆమెను బలవంతంగా వివాహంచేసు

(26 వ పేజీ చూడండి)



జెమినీ వారి "మంగళ" చిత్రంలో సూర్యప్రభ, టి. ఆర్. రామచంద్రన్,



# "మంగళ"

(24 వ పేజీ తరువాయి)

కుని కారాగృహంలో ఉంచి ఆమెకు సంసారసుఖం లేకుండాచేస్తాడు. ఆ రాజకుమారుడికే ఒక పిల్లవాణ్ణి కని వాడిచేత తండ్రిని కొట్టిస్తానని ఆమె ప్రతిజ్ఞ చేసి నెరవేర్చుకొంటుంది.

జెమినీస్టూడియో వారు తీసే జానపద చిత్రాలలో రెండు సుగుణాలు కనిపిస్తాయి: ఒకటి, కథ చాలా సాఫీగా చెప్పటం; రెండు, అమానుషశక్తులకు తావులేకుండా చూడటం. ఈ రెండు విషయాలూ ఇతర జానపదచిత్రాలలో తరుచు చూపిస్తూనే ఉంటాయి. ఈ సుగుణాలు "మంగళ"లో కూడా ఉన్నాయి.

కాని అమానుషశక్తులూ రానివ్వకుండా కేవలం యుక్తిపైనే ఆధారపడి జానపద కథను నడపటంలో కొన్ని చిక్కులు లేకపోలేదు. మంగళ ఖైదునుంచి తప్పించుకుని బయటకి వెళ్లి దొమ్మరవిద్యలు నేర్చి రాజకుమారుణ్ణి మెప్పించి అతనిద్వారా గర్భం ధరించి పిల్లవాణ్ణి కని, వాణ్ణి తన పుట్టింట పెంచాలంటే యుక్తిచెయ్యటం తప్పనిసరి. ఈయుక్తి ఏమిటంటే తన తండ్రిచేత సారంగం తవ్వించటం. మంగళతండ్రి ఈపనిని రెండోకంటివాడికి తెలియకుండా ఎట్లా చేశాడో ప్రేక్షకులు ఊహించుకోలేరు. చిత్రంలో మనం చూసే సారంగం ప్రభుత్వాలు తలుచుకుంటేగాని సాధ్యపడేది కాదు. సారంగంతోపాటు ఖైదుకు మరతలుపుకూడాఏర్పాటు చేయబడింది. ఈవిషయం రాజకుమారుడికిగాని, మంగళను నిత్యమూ అనుసరించిఉండే రతికిగాని, కింద కాపలాఉండే రక్షకభటులకుగాని ఏమాత్రమూ తెలియదు. ఆవిధంగానే రాజకుమారుణ్ణిపోలిన కుర్రవాడు మంగళతండ్రి ఇంట్లో ఎదిగివస్తుంటే వాడి ఆచోకీ ఏవిధంగానూ రాజకుమారుడికి తెలియదు. మంగళ చేసిన శపథం నెరవేరటానికి ఈరెండూ అతిముఖ్యమైనవిషయాలైనప్పటికీ ఇవి నమ్మదగినట్టుగా చిత్రించబడలేదు. ఇది కథకు చాలా పెద్ద లోపం.

కథలో మరొక పెద్దలోం ఏమిటంటే మంగళ దొమ్మరినాయకుడి కూతురని వంక పెట్టుకుని పాశ్చాత్యనృత్యం చెయ్యటం. మంగళ దొమ్మర్లకు బోలెడంత డబ్బిచ్చి వాళ్లదగ్గర ఏవేవో నేర్చుకున్నట్టు చూపబడింది. కాని చివరకు ఆమె రాజకుమారుడి దగ్గరచేసే నృత్యానికి దొమ్మర్లుచేసే ఆటలకూ, పాడే పాటలకూ ఎటువంటి సంబంధమూ లేదు. ఈఒక్క నృత్యంకోసం దొమ్మర్లకథను చాలా లెక్కన ఘూపించారంటే, ఈ దొమ్మర్లు లేకపోతే కథకేమి నష్టమని ప్రేక్షకులకు అనిపించటం సహజం. అదీకాక రాజకుమారుడు చేరదీసిన ఇతరస్త్రీ నమూనాలు చూస్తే మంగళ ఏ మారు వేషంలోవచ్చి కన్నుగీటినా వలలోపడేవాడే నన్న భావం ప్రేక్షకులకు కలుగుతుంది. అటువంటప్పుడు మంగళ పెద్ద పన్నాగం వెయ్యవలిసిన అవసరం లేదు. చాకబారు నిర్మాతలవలె జెమినీస్టూడియోవారు హాలీవుడ్ పాటలను అనుకరించటం బాగా లేదు.

కథలో ఇటువంటి లోపాలున్నప్పటికీ మంగళచిత్రంలో కావలసినంత వినోదం ఉన్నది. దొమ్మరివాళ్ల మొగ్గలూ, టి. ఆర్. రామచంద్రన్ హాస్యమూ, సూర్యప్రభ పాటలూ, నృత్యాలూ ప్రేక్షకులను ఆకర్షించదగిఉన్నాయి.

మంగళగా భానుమతి సమర్థతతో నటించింది. సర్వతోముఖమైన ఆవిడప్రజ్ఞను బయటపెట్టటానికి మంగళపాత్ర బాగా వినియోగపడింది. మూడుతరాలకు చెందిన పాత్రలను రంజన్ బాగానే పోషించాడు. మొద్దబ్బాయిగా రామచంద్రన్ చిత్రానికి మంచి హాస్యం చేకూర్చాడు. మంగళ తండ్రిగా దొరస్వామి, దొమ్మరినాయకుడి కుమార్తెగా సూర్యప్రభాకూడా తమ పాత్రలను బాగా పోషించారు.

తాపీ ధర్మారావు నాయుడుగారి పాటలు అంతగా భాగాలేవుగాని మాటలు చక్కగా అమరాయి. కాని ముందుగా ఏర్పాటైన మట్లకు పాటలు రాయటం ఎవరికైనా చిక్కే.

సెటింగులూ, ఫొటోగ్రఫీ, సౌండురికార్డింగూ పాటల మట్లూ బాగానే ఉన్నాయి. బాక్‌గ్రౌండ్ సంగీతం ప్రత్యేకించి బాగున్నది.

ఈ చిత్రాన్ని తెలుగుప్రేక్షకులు ఆదరించటంలో ఆశ్చర్యమేమీ లేదు.



"ఏమిటోయ్, నువ్వు ఒకసారి ఆడదాని లాగా ఒకోసారి మొగాడిలాగా ప్రవర్తిస్తావ్?" అని ఒకడు మిత్రుడి నడిగాడు.

"నా పూర్వీకుల్లో సగం మందిఆడవాళ్లు, సగంమంది మగవాళ్లుకావటమే దానికి కారణం." అన్నాడు ఆ మిత్రుడు.



# బొమ్మరిల్లు

బాలగేయం:

## బిచ్చగాడిపదం

శ్రీ అనిశెట్టి సుబ్బారావు

గుండె తడబడినదీ
గొంతు తడుపమ్మా!
తులసికోటకు నీరు
తోడి నంతమ్మా!
కాలిపోయే యిల్లు
చల్లార్చి నంత— గుండె...

పనికిరానీ చిరుగు
పడవేయి తల్లీ
స్వామివారికి వలువ
చదివించినంత— గుండె...

బిడ్డ కో పిడికిలీ
విడువమ్మ తల్లీ!
నట్టింట దీపమ్మ
నిలిపినంతమ్మా!— గుండె...

పడి నడిచి వచ్చాము
ప్రాణాలు నిలుపమ్మ!
అంగిట్లో ప్రాణాలు
అణిగిపోతున్నాయి— గుండె...

మంచుపొగగా చలికి
మారిపోతున్నాము
పనికిరానీ చిరుగు
పడవేయి తల్లీ!— గుండె...

పేలికై చేతిలో
వాలిపోతున్నాడు
బిడ్డ కో పిడికిలీ
విడువమ్మ తల్లీ!— గుండె...



# టామ్‌సాయర్... మార్క్‌ట్వేన్

టామ్ మళ్లీ ఘనత కెక్కాడు తన గ్రామంలో. పెద్ద వాళ్ల కతనిమీద ఇష్టం, చిన్న వాళ్లకి అసూయ ఏర్పడ్డాయి. ఆ ఊళ్లో వార్తా పత్రిక కూడా టామ్ పేరు పెద్దపెద్ద అక్షరాలతో ప్రకటించింది. కొందరు పిల్లలు టామ్ త్వరలో అమెరికా అధ్యక్షుడై పోతాడనికూడా అనుకున్నారు.

మఫ్‌పాటర్ నిర్దోషి అని తెలియగానే ప్రజలు అతన్ని ఇదివరకు ఎంత తిట్టిపోశారో, ఇప్పుడంత గౌరవించటం ప్రారంభించారు. అందుకే లోకులు పలుగాకు లంటారు.

టామ్ పగటిపూట ఉత్సాహంగానే తిరిగేవాడు. ఎక్కడకి వెళ్లినా అతన్ని అందరూ గౌరవించేవాళ్లు. తను ఒక మహానాయకుడై పోయినట్టుగా ఊహించుకునేవాడు. కాని చీకటి పడేటప్పటికల్లా టామ్ అవస్థ ప్రారంభమయ్యేది. చీకట్లో ఒంటరిగా వెళ్లటానికి భయపడి పోయేవాడు. ఏ మూలో ఇంజన్‌జో దాక్కునివుండి మీదపడి చంపేస్తాడని ఒకటే భయం. ఇక కళ్లుమూసి నిద్రపోతే చాలు, ఇంజన్‌జో కలల్లో ప్రత్యక్షమయ్యేవాడు. వాడి కళ్లు భయంకరంగా ఉరిమేవి.

విచారణ రేపు జరుగుతుందనగా ఆ కిందటిరాత్రే టామ్ వెళ్లి లాయరుతో హత్యసంగతి యావత్తూ పూసగుచ్చినట్టు చెప్పేశాడు. హాక్ కూడా తనతో వున్నట్టు చెప్పాడు. కాని హాక్ సంగతి లాయరు కోర్టులో బయట పెట్టలేదు. తనని కోర్టులోకి లాక్కు రావద్దని హాక్ లాయరువద్ద వాగ్దానం తీసుకున్నాడు. అయినా హాక్‌కి భయం తీరలేదు. అంత భయంకరమైన మంత్రాలతో ప్రమాణంచేసిన టామ్ తమ రహస్యం బయటపెట్టగా లేంది, లాయరుమాత్రం తన పేరు బయట పెట్టడని నమ్మకమేముంది? అందుచేత హాక్ కూడా ఇంజన్‌జో ఎప్పుడో తనపని పట్టేస్తాడని భయపడిపోతున్నాడు.

మఫ్‌పాటర్ టామ్ తన్ను రక్షించినందుకు ఎంతో కృతజ్ఞత చూపిస్తున్నాడు. అందుచేత పగలు తను చేసిన పని మంచిదే నని టామ్ నమ్మినా, రాత్రిళ్లుమాత్రం తను నోరుమూసుకుని ఉంటే బాగుండిపోనని అనుకునేవాడు.

ఇంజన్‌జో పోలీసులకి దొరకడని కొంతసేపు, దొరుకుతాడని కొంతసేపు టామ్ భయపడేవాడు.

ఇంజన్‌జో శవాన్ని కళ్లారా చూస్తే గాని సరిగ్గా నిద్రపట్టేటట్లు లేదు టామ్‌కి.

ఇంజన్‌జోని పట్టుకున్న వాళ్లకి బహుమతి యిస్తామని అధికారులు ప్రకటించారు. చుట్టుపట్ల వెదికారు; కాని హంతకు డెక్కడా కనిపించలేదు.

సెంట్‌లూయీనుండి డిటెక్టివ్ ఒకాయన వచ్చాడు. డిటెక్టివ్ అనేవాడు దేవుడితో సమానమనీ, అతనికి తెలియని విషయం ఉండ వనీ టామ్ నమ్మకం. ఆ డిటెక్టివ్ కొన్ని ప్రదేశాలు పరిశీలించాడు; తలకాయ ఆడించాడు; ఏదో కని పెట్టినట్టు చూశాడు; చివరికి "రహస్యం" కనిపెట్టా నన్నాడు. కాని "రహస్యము" అనేదాన్ని ఉరితియ్యట మెల్లా? కనక కొన్నాళ్ల తరవాత డిటెక్టివ్ వచ్చినదారినే తిరిగి పోయాడు.

రోజులు గడుస్తున్నకొద్దీ టామ్ ఇంజన్‌జోసంగతిని కొద్దికొద్దిగా మర్చిపోతున్నాడు.

* * *

ఒక పిల్లవాడు ఆరోగ్యంగా ఉన్నాడో లేదో కనుక్కోవా లంటే ఒకటే మార్గ మున్నది. ఎప్పుడో ఒకప్పుడు ఆ పిల్లవాడు 'గుప్తధనం' కోసం ప్రయత్నిం చాలి. గుప్తధనమంటే ఎక్కడో నేల తవ్వుతుంటే హఠాత్తుగా, ఎవరు పాతిపెట్టారో తెలియకుండా బైటపడే డబ్బు.

టామ్‌కికూడా ఇలాంటి కోరికే పుట్టింది. జోహార్పర్ కోసం వెదికాడు; కనిపించలేదు. బెన్‌రోజర్సు కోసం వెదికాడు; అతడూ ఊళ్లో లేడు. చివరికి చోరాగ్రేసరచక్రవర్తి హక్‌ఫిన్ కనిపించాడు. టామ్ అతన్ని చాటుకి తీసుకుపోయి యీ వ్యవహారం చర్చించాడు. హక్ తక్షణం అంగీకరించాడు. పెట్టుబడి అక్కర్లేకుండా, సరదా పుట్టించే ఎటువంటిపనికైనా హాకల్‌బెరీఫిన్ సిద్ధమే.

"ఎక్కడ తవ్వుదాం?" అని అడిగాడు హక్.

"ఎక్కడైనా సరే."

"ఎక్కడ తవ్వినా డబ్బు వస్తుందా?" అని హక్ ప్రశ్నించాడు.

"అహ ఎక్కడపడితే అక్కడ దొరకదు. ముఖ్యంగా ద్వీపాల్లో దొరకచ్చు; చచ్చిపోయిన చెట్లుంటాయే, వాటి నీడ అర్ధరాత్రిపూట ఎక్కడ పడుతుందో అక్కడ తవ్వితే దొరకచ్చు. కాని దెయ్యాలు తిరిగే ఇళ్లల్లో నేల మాళిగ లుంటాయి. వాటిల్లో ఎక్కువగా దొరుకుతుంది," అని టామ్ వివరించాడు.

"అక్కడ దాచేది ఎవరు?"

"ఎవ రేమిటి, దొంగ లే. డాబిన్స్‌మేష్టారి లాంటివాళ్లను కున్నావా?"

"ఏమో నాకు తెలియదు. నేనే కనక అయితే ఆ డబ్బంతా జల్సాగా ఖర్చుపెడతానుగాని దాచను."

"నేనూ అంతే చేస్తాను. కాని దొంగలు అల్లా చెయ్యరు."

"దాచిపెట్టిన దొంగలు మళ్లీ రారా?"

"రారు. వద్దామనుకుంటారు కాని గుర్తులు మర్చిపోతారు. లేక ఎక్కడో అకస్మాత్తుగా చచ్చిపోతారు. ఆ దాచిన డబ్బు అక్కడే చాలాకాలం వుండి తుప్పు పడుతుంది. చివరికి, ఎవడికో ఒక పచ్చకాగితం దొరుకుతుంది. అందులో డబ్బు ఎక్కడుందీ తెలిపే గుర్తు లుంటాయి. ఆ గుర్తులు పిచ్చిగీతల్లాగా కనిపిస్తాయి. వాటి అర్థం కనుక్కోటానికే వారం రోజులు పడుతుంది."

"నీ దగ్గిర అల్లాంటి కాగిత మేమన్నా వుందా?"

"లేదు."

"మరి మనకి గుర్తులెల్లా తెలుస్తాయి?"

"నాకు గుర్తు లక్కర్లేదు. సాధారణంగా దెయ్యాలున్న ఇళ్లలోనూ, లంకల్లోనూ, చచ్చిపోయిన చెట్లకిందా పాతిపెడతారు, మనం జాక్సన్‌ద్వీపాన్ని కొంత

వరకు చూశాం. దాన్ని మళ్లీ ఎప్పుడన్నా వెదకచ్చు. ఈ లోగా ఊరికి దూరంగా కాలవ పక్కన పాడుపడిన ఇల్లుందే, అక్కడ వెదుకుదాం. అక్కడ చచ్చిపోయిన చెట్లు చచ్చేన్ని ఉన్నాయి."

"అన్నిటికిందా డబ్బు వుంటుందా?"

"ఎందు కుంటుంది? నీకేమన్నా పిచ్చా?"

"మరి దేనికింద వెదుకుదాం?"

"అన్నిటికిందాను."

"ఇక అయినట్టే. ఈ వేసాకాల మంతా మనం కష్టపడవల్సి వుంటుంది."

"అయితే ఏం? కష్టపడతాం. వంద డాలర్లు కల ఇత్తడిబిందె దొరుకుతుందనుకో అప్పు డెల్లా వుంటుంది?"

హాక్ కళ్లు జిగేలు మన్నాయి ఈమాట తలుచుకునేటప్పటికి.

"బలే, యమాగా వుంటుంది. ఇదిగో టాం! నాకు ఆ వంద డాలర్లు ఇచ్చెయ్యి. నాకు రత్నాలు అక్కర్లేదు."

"సరే, అలాగే. కాని నీకొక్క రత్నంకూడా ఇవ్వను. అందులో ఒక్కొక్క రత్నం ఇరవైడాలర్లకి తక్కువ ఖరీదు చెయ్యదు."

"నిజంగానా టామ్?"

"ఆ. ఎవర్నన్నా అడుగు కావలిస్తే. నువ్వెప్పుడూ రత్నాలు చూడలేదా, హాక్?"

"ఉహూ."

"రాజులదగ్గిర తట్టలు తట్టలుంటాయి రత్నాలు."

"నే నెప్పుడూ రాజుల్ని చూడలేదు."

"యూరప్ వెళ్లి చూడు. ఈగల్లా ముసురుతారు."

"రాజులు ఈగల్లాగా వుంటారా?"

"ఒరేయ్, అమ్మమ్మ లాగా మాట్లాడకు. రాజులు ఈగల్లా ఎందు కుంటారు.? దర్జాగా రాజ రీవిగా ఉంటారు."

"సరేగాని, టామ్! ముందు ఎక్కడ తవ్వుదామంటావ్?"

"కాలవ కవతలవేపున కొండ మీద ఒక చచ్చిన చెట్టుంది. దానికిందచూద్దాం."

"ఆల్ రైట్. నేను తయార్."

ఒక గునపం, పార సంపాదించి ఇద్దరూ బయల్దేరారు. కాలవ మూడుమైళ్ల దూరం వుంది. చెమటతో తడిసి, వగరుస్తూ అక్కడికి చేరుకుని ఒక చెట్టునీడలో విశ్రాంతి కోసం కూలబడ్డారు.

టామ్ అన్నాడు: "నాకు చాలా బావుంది యీ పని."

"నాకూ అంతే," అన్నాడు హాక్.

"హాక్! మన కిక్కడ ధనం దొరికితే, నీ వాటాతో ను వ్వేం చేస్తావు?"

"రోజూ సోడాకొనుక్కు తాగుతాను. వచ్చిన ప్రతి సర్కసూ వదలిపెట్టకుండా చూస్తాను. ఓ, బలే దర్జాగా గడుపుతానులే."

"కాస్తన్నా దాచుకోవా?"

"ఎందుకూ?"

"ముసలి తనంలో పనికొస్తుంది."

"ప్చ్. లాభం లేదు. మా నాన్న ఎప్పుడో అమాంతంగా వస్తాడు. చెవులు మెలేసి ఉన్నదంతా లాక్కుని తాగేస్తాడు. ఈ లోగానే అంతా ఖర్చుపెట్టేసుకుంటాను. నీ డబ్బుతో ఏం చేస్తావు టామ్!" "ఒక కొత్త డప్పు, పెద్ద ఖడ్గం, ఎర్రటి నెక్-టై, కొనుక్కుంటాను పెళ్లిచేసుకుంటాను."

"పెళ్లా?"

"ఆహా"

"టామ్! నీకేమన్నా మతి పోయిందా?"

"ఆగు. చూస్తూ వుండు."

"మా అమ్మా, నాన్నా చూడు. ఎప్పుడూ ఘోర యుద్ధం చేసేవాళ్లు. నాకు బాగా జ్ఞాపకం."

"నేను పెళ్ళి చేసుకునే అమ్మాయి యుద్ధం చెయ్యదు."

"ఈ ఆడాళ్లంతా ఒకటే. ఒళ్లంతా పట్టుకుని రక్కేస్తారు. నీ పిల్లపేరేమిటి?"

"పిల్ల కాదు ఆమె అమ్మాయి."

"ఏదైనా ఒకటే. కొందరు పిల్ల అంటారు. కొందరు అమ్మాయి అంటారు. ఇంతకీ ఆమె పేరు?"

"ఇప్పుడు కాదు. తరవాత చెబుతాలే."

"నీ ఇష్టం. కాని నువ్వు పెళ్లి చేసుకుంటే నే నిక ఒంటి గాణ్ణి అయిపోతా."

"అబ్బే నువ్వు మాయింట్లోనే వుందువుగాని. సరే, ఇక లే. తవ్వుదాం."

అరగంటసేపు ఇద్దరూ కష్టపడి తవ్వారు. ఫలితం లేదు. మరో అరగంట కష్టపడ్డారు. లాభం లేదు. హాక్ అన్నాడు:

"ఇంత లోతుగా పాతిపెడ తారా ?"

"ఒక్కొక్కసారి చాలా లోతుగా పాతిపెట్టారు. అసలు చోటు ఇది కాదనుకుంటా."

మరోచోటు ఎంచుకుని తవ్వటం మొదలెట్టారు నిశ్శబ్దంగా. హక్ అలిసిపోయాడు. గునపాన్ని నేలకు గుచ్చి దానిమీద ఆనుకొని చొక్కాతో చెమట తుడుచుకున్నాడు.

"తరవాత ఎక్కడ తవ్వుదాం టామ్ ?"

"కార్డిఫ్ మెట్టమీద, అమ్మగారి యింటి వెనకాల, పెద్ద చెట్టకింద తవ్వుదాం."

"అవును, అది మంచి చోటే. కాని అది అమ్మగారి భూమికదా! డబ్బు ఆవిడ లాగేసుకుంటుం దేమో ?"

"ఎవరిభూమిలోనన్నా ఉండనీ. ఆ డబ్బు ఎవరికి దొరికితే వాళ్ళదే"

మళ్లీ తవ్వటం సాగించారు. హక్ మళ్లీ అలిసిపోయి,

"వెధవది; ఇక్కడకూడా డబ్బున్నట్టు లేదురా- ఏమంటావ్ ?" అని అడిగాడు.

"చాలా ఆశ్చర్యంగా వుందే. ఎంత తవ్వినా డబ్బు కనిపించటం లేదు. ఒక్కొక్కప్పుడు దెయ్యాలు వచ్చి డబ్బును మాయంచేస్తాయట. ఇప్పుడు అలాంటిదే జరిగివుంటుంది"

"దెయ్యాలకి పగటిపూట బలం వుండదుగా ?"

"అవును. ఆవిషయం నేను మర్చేపోయాను. ఓ. అసలు మనం తప్పుచేశాం. మనంత దద్దమ్మలెక్కడా వుండరు. చెట్టునీడ అర్థరాత్రివేళ ఎక్కడ పడుతుందో అక్కడ తవ్వాలి."

"ఏమిట్రా టామ్! ఇంతసేపూ అనవసరంగా తవ్వించావు. మళ్ళీ అర్థరాత్రి రావాలి. జో లెడు దూరం. నువ్వు రాగలవా ?"

"ఓ. వస్తాను. ఇవ్వాళ రాత్రే మనం తవ్వాలి. ఈ గోతులు ఎవరన్నా చూస్తే ఇట్టే తెలిసిపోతుంది మన రహస్యం. వాళ్లుకూడా తయారవుతారు, మన కడ్డంగా."

"సరే. నేను రొండు తిరిగి మీ యింటికి కొస్తాను. నేను 'మ్యావ్' మనగానే లేవాలి."

"అచ్చా. ఈ గునపం, పార పొదల్లో దాచిపోదాం."

ఆరాత్రి అనుకున్న వేళకి ఇద్దరూ అక్కడ చేరారు. చుట్టూ నిశ్శబ్దంగా, ఒంటరిగా వుంది. ఆకుల మధ్య దెయ్యాలు గుసగుసలాడుతున్నాయి. ఎక్కడో దూరాన కుక్క ఏడుస్తున్నట్టు మొరిగింది. ఒక గుడ్లగూబ దానికి సమాధానమిచ్చింది. గుండెలు బిక్కుబిక్కుమంటున్నాయి. కొంతసేపటికి పన్నెండుగంట లయిందని నిశ్చయించారు. చెట్టునీడ ఎక్కడ పడుతోందో గుర్తుపెట్టారు. అక్కడ తవ్వటం మొదలెట్టారు. గునపం దేనికో తగిలి 'ఖంగ్' మన్నప్పుడల్లా వాళ్లు అది ఇత్తడి బిందెననుకునేవారు. చివరికి అది ఏ రాయో అయ్యేది.

"హక్! మళ్లీ మనం తప్పు చోట తవ్వుతున్నా మనుకుంటా."

"తప్పుచోటు కాదు. నీడ పడే చోటు ఖచ్చితంగా గుర్తుపెట్టాంగా."

"అది కాదు. మనం గుర్తుపెట్టినప్పుడు సరిగ్గా పన్నెండు అయిందో లేదో?"

హక్ గునపం కింద పారేశాడు.

"అదీ, అసలు సంగతి. ఇక్కడ మానేద్దాం పోనీ. మన కెల్లా తెలుస్తుంది పన్నెండు ఎప్పు డయిందో? పైగా మనచుట్టూ దెయ్యాలు, భూతాలు నాట్యంచేస్తున్నట్టు చప్పు డవుతోంది. చాలా అపాయకరం యీ పని. నిమిషనిమిషానికి నావెనక ఎవరో నుంచున్నట్టే అనిపిస్తోంది."

"నాకూ అలాగే వుంది హక్! చెట్టుకింద డబ్బు పాతిపెట్టేటప్పుడు సాధారణంగా 'చచ్చిన శవాన్ని' కూడా పాతిపెట్టారు కాపలా కోసం."

"బాబోయ్."

"అవును. నా కావిషయం చాలామంది చెప్పారు."

"ఇప్పుడు 'చచ్చిన శవాలను' మనం కదిలించట మెందుకు టామ్! ఇంకో చోటికి పోదాం"

"దెయ్యాల ఇంటికి పోదామా?"

"దెయ్యా లుండే ఇళ్లు నాకు నచ్చవు టామ్! మనం చూడ

(39 వ పేజీ చూడుడు)




అనగా అనగా ఒక రాజు. ఆ రాజుకు ముగ్గురు కొడుకులు. ఆ రాజుకు జబ్బు చేసెను. ఎంత వైద్యము చేసినను ఆ జబ్బు తగ్గలేదు. రాజ వైద్యుడు చూచి ఈ జబ్బు తగ్గవలెనంటే సంజీవి, తీసుకు రావలెనన్నాడు. 'సంజీవి, అడవులలో కొండలమధ్య ఉండును. దాని చుట్టూ రాక్షసులు, పాములు కాపలా ఉండును.'

ఆ రాజు తన ముగ్గురు కొడుకులను పిలిచి వైద్యుని మాటలు చెప్పెను. సంజీవి తెచ్చినవానికి రాజ్యము ఇచ్చెదననెను.

పెద్దకొడుకు పెద్దసేన తీసుకొని బయలుదేరెను. పాములు వానిని ఎదిరించెను. యుద్ధమైనది. కొన్ని పాములు చచ్చినవి. పాముల కాటుకు పెద్దకుమారుడు చచ్చిపోయెను.

ఈ సంగతి రెండవ కొడుకుకు తెలిసినది. అతడు పాముమంత్రగాళ్లను వెంటపెట్టుకొని వెళ్ళెను. పాములు వీరిమీదికి లేచెను. మంత్రగాళ్లు మంత్రము పెట్టగా పాములన్నియు నిద్రపోయెను.

ముందుకు పోగా వారిమీద రాక్షసులు పడి చంపివేసిరి. రెండవ రాజకుమారుడు చనిపోయినాడు.

ఇది మూడవ కుమారునికి తెలిసినది. అతడు స్వయముగా పాము మంత్రము నేర్చుకొని రాక్షస వేషముతో బయలుదేరినాడు.


పాములు మీదికి లేచినవి. మంత్రము పెట్టగా నిద్రపోయినవి.

రాక్షసవేషముతో ఉన్నందున ముందుకు నిర్భయముగా వెళ్ళెను. వారితో నతడును కలసిపోయెను. ఉండిఉండి సమయము కనిపెట్టి సంజీవి సంగ్రహించి బయలుదేరెను.

సంజీవితో దారిలో ఇద్దరు అన్నలను బ్రతికించెను.

సంజీవి రాజవైద్యునికిచ్చెను. దానితో అతడు రాజుజబ్బు నయము చేసెను.

రాజు సంతోషించి మూడవ కొడుకుకు రాజ్యమిచ్చెను.



అనగా అనగా ఒక ఊళ్లో ఒక గొల్లసంసారం ఉండేది. వాళ్లకి లేక లేక ఒక కూతురు పుట్టింది. ఆ కూతురు అచ్చంగా బంగారపుబొమ్మ లాగుండేది. తండ్రి పొలానికి పోయే వాడు. తల్లి కూతుర్ని ఒక గంపలో పెట్టుకుని, రోజూ పట్నానికి తీసికెళ్లి పాలు అమ్ముకుని తిరిగి యింటికి వస్తూండేది.

ఇలాగ జరుగుతూఉండగా, ఒక రోజు పాలు అమ్ముకుని తిరిగి వస్తూంటే చాలా ఎండ ఎక్కి పోయింది. అంచేత గబగబా యింటికి చేరదామని వేగంగానడుస్తోంది. ఇంతలో ఆకాశంలో రెండుగద్దలు ఈ పిల్లని గంపలో చూశాయి. అప్పుడు ఆడ గ్రద్ద అందిగదా "మనం ఈ పాపని పెంచుకుంటే ఎంతో బాగుంటుంది. చక్కగా బంగారబ్బొమ్మలాగుంది." అంది. మొగగ్రద్ద సరేనని చెప్పి, పాపం ఆ తట్టని కాస్తా తన్నుకుపోయింది. ఇంక గొల్లది ఏం చేస్తుంది? అరిచింది; మొత్తుకుంది; ఏడ్చింది. కాని అప్పటికే గ్రద్దలు కనుచూపుమేర దాటిపోయాయి. అంచేత చేసేది లేక పాపం గొల్లది యింట్లోకి వచ్చి కూలబడి, భర్తతో సంగతి యావత్తూ చెప్పింది. వాళ్లిద్దరూ ఊరంతా చెట్లూ, పుట్టలూ, గాలించారు. కాని ఏమాత్రం ప్రయోజనం లేక పోయింది.

అక్కడ ఈ గ్రద్దలు రెండూ ఆ అమ్మాయిని అల్లారుముద్దుగా పెంచుతూ ఉండేవి. ఆ అమ్మాయికి ఒక బంగారపు యిల్లు కట్టి, అడవి జంతువులూ అవీ దూరకుండా దిట్టమైన బంగారపు తలుపు అమర్చాయి. ప్రపంచంలో ఎక్కడెక్కడ ఏమేమి వింత సామాను వచ్చినా అవి వెంటనే ఆ అమ్మాయికి తెచ్చి యిచ్చేవి. అమూల్యమైన ఒక వజ్రాలహారం ఒకటి ఆ అమ్మాయికి బహుమతిగా యిచ్చాయి. ఇలాగ చిన్నప్పటి నించీ గ్రద్దల సంరక్షణలో పెరగటంచేత, ఆ అమ్మాయికూడా తన తల్లిదండ్రులు ఈ గ్రద్దలేనని భావించింది.

ఒకసారి ఈ గ్రద్దలకి ప్రపంచం అంతా చుట్టిరావాలని బుద్ధిపుట్టింది. అందుకు అధమం వారమేనా పట్టుతుంది. అంచేత ఈ అమ్మాయిని ఒంటరిగా వదలివెళ్ళడం ప్రమాదకరమని, "అమ్మాయీ, నువ్వు తలుపు తీసుకొని ఎక్కడికీ బయటికి వెళ్లకు. ఎవరైనా వస్తే లోపలినించే మాట్లాడు. నిప్పూ, వంటసామగ్రీ అంతా వారానికి సరిపడేట్లా తెచ్చిపెట్టాం. నిప్పు ఆర్పకుండా ఈ వారం రోజులూ గడుపుకో," అని చెప్పి, సంచారానికి బయలుదేరాయి.

ఆ అమ్మాయికూడా జాగ్రత్తగానే మసులుకుంటూ వచ్చింది. ఇలాగ నాలుగురోజులు బాగానే గడిచాయి. ఐదవరోజున ఆ అమ్మాయి బియ్యం ఎసట పెడ్తూంటే

పొయ్యి ఒకప్రక్క విరిగిపోయి నీళ్లన్నీ నిప్పులో పడిపోయి, నిప్పు ఆరిపోయింది. పాపం, ఆఅమ్మాయి ఇంక వంట ఎలాగ చేసుకుంటుంది? అందుచేత విధిలేక తలుపుతీసుకుని బయటికి వచ్చింది. ఇంతలో ఆమెకి దూరంగా పొగకనిపించింది. వెంటనే ఆ అమ్మాయి అక్కడికెడితే నిప్పు దొరుకుతుందనే ఉద్దేశ్యంతో గరిటె చేతపట్టుకుని, దారి తెలియడంకోసం దారిపొడుగూగుతా వడ్లు పోసుకుంటూ ఆ పొగవచ్చే యిల్లు చేరుకుంది. తలుపు తట్టగానే ఒక ముసలిఅవ్వ వచ్చి తలుపు తీసింది

"అవ్వా! నా కొస్త నిప్పిస్తావా?" అని అడిగింది ఆ అమ్మాయి అమాయకంగా.

ఆ అవ్వ ఒక రాక్షసి. దానికి ఒకకొడుకున్నాడు. ఆ అవ్వ ముసలిదైపోవటం చేత దానికి ఆహారం సంపాదించు కోటానికి శక్తి లేదు. అంచేత తన కొడుకు తెచ్చ్యాక తింటూఉండేది. తనకి ఈ వాళ మంచి మాంసం దొరికిందని ఆఅవ్వ చాల సంతోషించింది. కాని తనకి చంపడానికి శక్తి లేకపోవడం చేత ఆ అమ్మాయిని తన కొడుకు వచ్చే వరకూ కూర్చోబెడదామనే ఉద్దేశంతో, 'ఉండమ్మాయీ, ఇప్పుడే వస్తాను.' అని చెప్పి లోపలికి వెళ్లిపోయింది. అరగంటయినా యింకా రాలేదు. ఆ అమ్మాయి ఏమీ తోచక ఆచుట్టూతా పచారుచెయ్యటం ఆరంభించింది. ఇంతలో ఆమెకి అక్కడ ఎముకలు, మాంసమూ కనిపించగానే, హడలిపోయి, ఒక పరుగు పరిగెట్టి, ఆ వడ్లచారికం వెంబడే తనయిల్లు చేరుకుని తలుపు బిడాయించుకుంది.

కాస్సేపటికి ఆ రాక్షసికొడుకు వచ్చాడు. అప్పుడు ఆ అవ్వ బయటికి వచ్చింది. చూసేసరికి ఆపిల్ల ఎక్కడా కనిపించలేదు. దాంతో "అయ్యో, నా తెలివి కూలా— చేతులారా చిక్కిన ఆహారాన్ని పోగొట్టుకున్నానే" అని ఏడ్చి సంగతంతా వాడికి చెప్పింది వాడు వెంటనే, "ఇదుగో ఇప్పుడే వెళ్లి ఆ అమ్మాయి ఎక్కడున్నా తీసుకు వస్తాను." అని చెప్పి, ఆ వడ్లచారికల వెంటే బయలుదేరాడు. ఆ బంగారపు యిల్లుని సమీపించి, ఆ అమ్మాయిని పిలిచాడు; బుజ్జగించాడు; తిట్టాడు— ఏమైనా కాని ఆ అమ్మాయి తలుపు తియ్యలేదు. రాక్షసుడు కోపంతో తలుపు గుంజాడు. కాని తలుపు రాలేదు. కాక పోగా, తన గోరొకటి తలుపులో చిక్కుకుపోయింది. లాక్కోగా అందులోంచి వేలు బయటికి వచ్చిందిగాని గోరుమాత్రం తలుపులోనే ఉండిపోయింది. ఇంక చేసేదిలేక రాక్షసుడు తిరుగు ప్రయాణం పట్టాడు.

తనకి గొప్ప గండం తప్పిందిగదా అని సంతోషిస్తూ ఆ పిల్ల రాత్రి సుఖంగా నిద్రపోయింది. మర్నాడు యిల్లంతా వూడుస్తూఉండగా తలుపులో చిక్కుకున్న గోరు చేతికి గుచ్చుకుని అది విషం కావటంచేత వెంటనే మూర్ఛపోయింది.

అదేసమయంలో జయసింహుడు అనే యువరాజు వేటకని వచ్చి ఆ రాక్షసినీ, రాక్షసికొడుకునీ బాణాలతో చంపివేసి, వస్తున్నాడు. ఇంతలో అక్కడ ఉన్న బంగారపు ఇల్లు చూసి, ఆశ్చర్యంగా దగ్గిరకి వచ్చి చూసేసరికి ఆతలుపుదగ్గిర పదహారేళ్ళ అమ్మాయి మూర్ఛపోయి కనిపించింది. వెంటనే అతను తలుపులు బ్రదలుకొట్టి, లోపల



ప్రవేశించాడు. ఆ అమ్మాయి చేతికి గ్రుచ్చుకున్న ముల్లు తీసేసి, కాసిని నీళ్లు ముఖాన జల్లిన అనంతరం ఆ అమ్మాయి నిద్రనించి లేచినట్లు లేచి, కూర్చుంది. తన కెదురుగా అందమైన ఆ రాజకొడుకుని చూసి, సిగ్గుతో తల వంచుకుంది. జయసింహుడు, "నీ తలి దండ్రు లెక్కడ ఉన్నారు?" అని అడిగాడు. ఆ అమ్మాయి, "మా అమ్మా, నాన్నా గ్రద్దలు. దేశ సంచారానికి వెళ్లారు." అని చెప్పింది. జయసింహుడు వెంటనే ఆ అమ్మాయి చిన్నప్పుడే గ్రద్దలచేత తేబడి పెంచబడిఉంటుందని ఊహించుకుని, "నీ కిక్కడ ఏం సుఖం ఉంటుంది? మనిద్దరం పెళ్లి, చేసుకుని హాయిగా మనరాజ్యంలో కాలక్షేపం చేద్దాం." అని చెప్పి, తన గుఱ్ఱంమీద కూర్చోబెట్టకుని తన రాజ్యానికి పయనమయ్యాడు. ఆ అమ్మాయికి 'సుగుణ' అనే పేరు పెట్టాడు.

రాజుకి ఇంతకుముందే 'లీలావతి' అని ఒక భార్య ఉండేది, దానిది చాలా కుటిలస్వభావం. రాజు మరో భార్యతో వస్తున్నాడనగానే కళ్ళల్లో నిప్పులు పోసుకుంది. రాజూ, సుగుణా యింటికి చేరగానే సుగుణ లీలావతికి నమస్కరించింది. కాని లీలావతిమాత్రం తనకంటె వెయ్యిరెట్లు అందంగా ఉన్న సుగుణని చూసి, దాన్ని చంపించెయ్యకపోతే తనమీద రాజుకి ప్రేమ ఉండదని దాన్ని చంపించడానికి నిశ్చయించుకుంది.


ఇలాగ వారం రోజులు గడిచాయి. ఒకరోజు లీలావతి సుగుణని షికారుకని తీసికెళ్ళింది. అక్కడ ఒక బావి ఉంటే అందులోకి తొంగిచూసి, "చూడు ఇందులో తామరపువ్వు ఎంత అందంగా ఉందో," అని చెప్పింది. సుగుణ పాపం అమాయకురాలు కావడంచేత, అందులోకి తొంగి చూసింది. వెంటనే లీలావతి సుగుణ కాళ్లెత్తి నూతులోకి పడేసింది.

ఇంటికి రాగానే లీలావతి రాజు దగ్గిరకెళ్లి కల్లబొల్లి ఏడ్పులు ఏడ్చి, "రాజా, సుగుణ ఎక్కడా కనిపించటంలేదు. నాకు మనస్సులో ఏదో దిగులుగా ఉంది." అని చెప్పింది. రాజు చాలా కలతపడి ఊరంతా వెదికించాడు. కాని సుగుణ ఎక్కడా కనిపించలేదు. సుగుణ కనిపించకపోవటంతో రాజుకి పిచ్చెత్తినట్లయిపోయింది.

అక్కడ ఆ నూతులో సుగుణ ఒక తామరపువ్వుగా మారింది. రాత్రిళ్లప్పుడు, "రాజా, నాకు జరిగిన అన్యాయం చూడవూ?" అని జాలిగా ఏడుస్తూండేది. ఈ సంగతి ఒక రాత్రివేళ రాణి విని, మర్నాడే ఆ తామరపువ్వుని కోయించి కాల్పించి, ఆ బూడిదని లోతుగా పాతిపెట్టించేసింది.

ఆ చోట ఒక మామిడిమొక్క పుట్టి క్రమంగా పెద్దదికాసాగింది. ఇలాగ ఒక సంవత్సరం కాగానే అది ఒక పెద్ద వృక్షమై పళ్లు కాయడం మొదలెట్టింది. ఆ చెట్టుకి ఒక పెద్ద పండు పండింది. ఒకరోజు మొదట్లో కూతుర్ని పోగొట్టుకున్న గొల్లది ఆ దారమ్మటే వెడుతోంది. ఇంతలో ఆ పెద్దపండు ఆ తట్టలో పడింది. ఇదికూడా తన భాగ్యమే కాబోలు ననుకుని ఆ గొల్లది యింటికి తీసికెళ్లి భర్తకి చూపించింది. వాళ్లు కత్తిపీట తీసుకుని పండు కోయడానికి సిద్ధంగా ఉండగా ఆ పండు బ్రద్దలై అందులోంచి ఒక చిన్న పిల్ల బయటికి వచ్చింది. ఆ పిల్ల చూస్తూండగానే పెరిగిపోయి, పదహారేళ్ల అమ్మాయికింద మారిపోయింది. ఆ గొల్ల దంపతులు ఆశ్చర్యపోయి ఆమెకథని అడిగారు. అప్పుడామె, "నేను చిన్నతనంనుంచీ గ్రద్దల సంరక్షణలో నే పెరిగాను. తర్వాత రాజుని పెళ్లాడాను. ఆ రాజుభార్య నన్ను నూతిలోకి తోసేసింది. తర్వాత ఎలాగోలాగ తిరిగి నా స్వరూపంలోకి వచ్చాను," అని చెప్పింది. గొల్ల దంపతులు తమ కూతురే తిరిగి వచ్చిందని ఎంతో సంతోషించి ఆమెని గ్రద్ద లెలాగ ఎత్తుకుపోయినదీ సంగతంతా చెప్పారు. ఆమె కూడా తలిదండ్రుల్ని కలుసుకున్నందుకు చాలా సంతోషించింది.

అక్కడ జయసింహుడు సుగుణ కనిపించకపోవటంతో దిగులుపడి ఎలాగైనా ఆమెని వెతకాలని బయలుదేరాడు. దైవవశాత్తూ వీళ్ళ గుడిసెదగ్గిరకి వచ్చాడు. అక్కడ సుగుణ నీళ్లు తోడుకుంటోంది. రాజు సంతోషంగా, "సుగుణా!" అని పిలిచాడు. సుగుణ రాజుని చూడగానే అతని కాళ్ళమీద వాలి ఏడుస్తూ తనకి




రచన:

శ్రీ వి వి. సూర్యనారాయణ

చాలా సంవత్సరాల క్రితం కళింగరాజ్యాన్ని శంభుడనే రాజు పరిపాలిస్తూ ఉండేవాడు. అతనికి భార్గవుడు, సౌమ్యుడు అనే యిద్దరు కొడుకు లుండేవారు. వేటాడ్డంలో వాళ్లిద్దరూ ఆరితేరి అత్యంత నైపుణ్యం సంపాదించారు. రాజు వాళ్లిద్దర్నీ చూచి చాలా గర్వపడుతూ ఉండేవాడు.

ఒకసారి భార్గవుడూ, సౌమ్యుడూ వింధ్యపర్వతారణ్యాలలోకి వేటకు బయలుదేరారు. వాళ్లు తమతో కావలసిన భోజనసామ్రగి కూడా తీసికొనిపోయారు. పర్వతాల్లోకి వెళ్లినతరువాత, అక్కడ అరణ్యాలలో ఒకచదునయిన ప్రదేశం చూసుకుని, డేరావేసికొని, భోజనం వండుకుని తింటూ తీరికగా ఉన్న సమయాల్లో వేటాడుతూ కాలం గడుపుతున్నారు. అన్నదమ్ము లిద్దరిలోనూ సౌమ్యుడు వంట చెయ్యడంలో మాంచి నేర్పరి. అందుచేత ప్రతిరోజూ సౌమ్యుడే వంట చేస్తూండేవాడు. వంటచెయ్యడంలోనే కాక తక్కిన విషయాల్లో కూడా సౌమ్యుడిదే పైచెయ్యి అని చెప్పాలి. కాని వేటాడ్డము వచ్చినప్పుడు మాత్రం అన్నదమ్ములిద్దరూ సరిసమానులే! ఎత్తిన విల్లు దించడమనేది యిద్దరికీ చాతకాదు. ఎంత జిత్తులమారి జంతువైనా వీళ్ళబాణం దెబ్బకు చావవలసినదే.

ఒకరోజు మధ్యాహ్నం సౌమ్యుడు ఒక అడవిపందిని చంపి యింటికి తీసికొని వస్తున్నాడు. కొంత దూరంనుండే, డేరావైపు చూశాడు. డేరాలోంచి పొగ వస్తూండడం కనిపించింది. డేరాకు నిప్పంటుకుందేమోనని, నిదానించి చూశాడు; కానీ అటువంటి జాడలేమీ కనబడలేదు. అతనికి ఆశ్చర్యం వేసింది. నిర్మానుష్యమయిన ఈ ప్రదేశంలో తన డేరాలోకి ఎవరు వచ్చారు? మెల్లగా గుడారంవద్దకు వెళ్లాడు. లోపలికి ఎవరో వెళ్ళినట్లు అడుగులజాడ కనపడింది. లోపలికి వెళ్లాడు. అక్కడ పొయ్యి దగ్గరగా కూర్చుని ఒకపదహారేళ్ల అమ్మాయి వంట చేస్తోంది. ఆ పిల్లను సౌమ్యుడెరుగడు. అయితే ఆమె అక్కడకు ఎందుకు వచ్చింది? ఆ గుడారంలో ఎందుకు వంటచేస్తున్నది? ఆపిల్లతో మాట్లాడాలని అతనికి కుతూహలం కలిగినా

---

జరిగిన మోసం అంతా చెప్పింది. తన తల్లిదండ్రుల్ని చూపించి, "వీళ్లే నాకు తలిదండ్రులు. చిన్నతనంలో గ్రద్దలు వీళ్ళదగ్గిర్నించే ఎత్తుకుపోయాయి. మళ్ళీ నాకు పునర్జన్మ ప్రసాదించింది వీరే." అని తలిదండ్రులనిగురించి చెప్పింది. రాజు సుగుణని గుఱ్ఱంమీద కూర్చోబెట్టుకుని గొల్లదంపతులదగ్గిర శలవు తీసుకుని తిరిగి రాజ్యానికి బయలుదేరాడు.

కోట చేరుకోగానే లీలావతిని ఉప్పుపాతరేయించి, సుగుణతో రాజ్యాన్ని పరిపాలిస్తూ సుఖంగా ఉన్నాడు.

మొదట్లో సాహసించలేకపోయాడు. చివరకు తెగించి అడిగాడు. "అమ్మాయీ! ఎవరు నువ్వు?"

ఆమాటతో ఆ అమ్మాయి లేచి నిల్చుని సౌమ్యునివైపు తిరిగి చిరునవ్వు నవ్వింది. సౌమ్యునికి ఆ అమ్మాయిలో అమరకన్యలోని అందం కనుపించింది. మళ్లా ఆమె వైపుతిరిగి అడిగాడు. "నీవు ఎవరవో యిక్కడకువచ్చి ఎందుకు వంటచేస్తున్నావో నేను తెలిసికోవచ్చునా?"

ఆ అమ్మాయి ముసిముసినవ్వులు నవ్వుతూ సమాధాన మిచ్చింది. "నా పేరు కౌముది. మీరు ప్రతిరోజూ వంట చేసుకోలేక బాధపడుతున్నారని, నేను వండిపెట్టడానికి నిశ్చయించుకున్నాను."

"కౌముదీ! నీ కెందుకా శ్రమ? మేమే వండుకుంటాముగా."

'మీ వంటకూ నా వంటకూ భేదం చూడండి యివ్వాళ' అంటూ కౌముది తుర్రున పారిపోయింది. సౌమ్యుడు పిలచినా, మళ్ళా వస్తానులెమ్మని దూరంనుండే సైగచేసి వెళ్లిపోయింది.

మామూలువేళకు భార్గవుడు వచ్చాడు. భోజనం చేస్తూ యథాలాపంగా అన్నాడు. "తమ్ముడూ యీ రోజు వంటలో కొత్తరుచులు కనిపిస్తున్నాయే?"

"ఏం? బాగుందా?"

"ఓ. అద్భుతంగా ఉంది, ఈ రోజు నువ్వు చేసినవంట"

"నేను వండలేదన్నయ్యా!" అన్నాడు సౌమ్యుడు నవ్వుతూ. 'మరి?' మన మిద్దరమూ తప్ప మరెవ్వరూలేని యీ విజనప్రదేశంలో నువ్వూ వండక, నేనూ వండక మరెవ్వరు వండారంటావు?" అని ఆశ్చర్యంతో చూస్తూ ప్రశ్నించాడు భార్గవుడు.

"కౌముది వండింది అన్నయ్యా" అని సంతోషంతో అన్నాడు సౌమ్యుడు. కౌముది ఎవరో అన్నయ్యకు తెలుసునో తెలియదో అనే విషయమైనా ఆలోచించకుండా.

"కౌముదా! ఎవరది?"

జరిగిన సంగతంతా అన్నతో చెప్పాడు సౌమ్యుడు. తరువాత సావకాశంగా అడిగాడు. "అన్నయ్యా ఆ పిల్ల మనకు చాలా సహాయం చేస్తుంది. వచ్చి మనతో కలిసి ఉండమందామా?"

"సరేకాని, నిర్మానుష్యమయిన యీ స్థలంలో ఎవరో పిల్లవచ్చి మనకుసహాయం చేస్తాననడం చాలా వింతగా ఉంది. ఆమె ఏ దేవతో, దయ్యమో అని నా అనుమానం. ఆ అమ్మాయిని తీసుకునిరావడానికి నాకేమీ అభ్యంతరంలేదు తరవాత నీ యిష్టం."

మర్నాడు కౌముదితో తనకూ, అన్నకూ జరిగిన సంభాషణ అంతా చెప్పి, ఆమెను తమతో ఉండమని కోరాడు. ఆమె మొదట్లో, భార్గవుడికి జడిసి వారితో ఉండడానికి అంగీకరించకపోయినా సౌమ్యుని పట్టుదలవల్ల ఒప్పుకొనకతప్పింది కాదు. ఆమెను అంగీకరింపజేయగల్గినందుకు సౌమ్యుడు చాలా సంతోషించాడు. ఆ రోజునుండి కౌముదికూడా వాళ్లలో కలిసిఉండటం మొదలుపెట్టింది. గుడారంలో చిందరవందరగా విసిరేసిన వస్తువులన్నిటిని ఆమె చక్కగా అమర్చిపెట్టేది. వాళ్ళకు వేళకి చక్కటి భోజనం పెట్టేది. ఆమె వచ్చిన దగ్గరనుండీ సౌమ్యునికి సగం శ్రమ తగ్గింది.

అన్నదమ్ము లిద్దరూ యిల్లువదలి వచ్చి ఆరుమాసాలు అయింది. ఇద్దరికీ యింటిమీద దృష్టిపోయింది. తల్లిదండ్రుల్ని చూద్దామని వాంఛ కలిగింది. ఇంటికి వెళ్లడానికి ముహూర్తం నిశ్చయం చేసుకున్నారు. సౌమ్యునికి, కౌముదిని కూడా తమతో తీసికునివెళ్లాలని ఉంది. దానికి భార్గవు డేమంటాడో నని భయపడుతూనే అడిగాడు. "అన్నయ్యా! కౌముదినికూడా మనతో తీసుకొనివెళ్దామా?"

"నాన్నగారీమెను చూస్తే, మన మీద కోపగించుకుంటారు. ఈమె మనతో రావడం నాకేమీ యిష్టం లేదు. ఏదో, యిక్కడున్నాళ్లూ మనతో ఉండనిచ్చాం. ఇంటికి కూడా ఎందుకు తీసుకొనివెళ్లడం?"

"కాదన్నయ్యా; నాకు కౌముదిని వివాహం చేసుకోవాలని ఉంది. మనకు వండిపెట్టడం అయిపోగానే ఆమెను మరచిపోవటమేనా.?"

"ఇంక నన్నేమీ అడగకు. నా ఉద్దేశ్యమేదో నేను చెప్పాను. నేను చెప్పింది నీకు నచ్చకపోతే నీయిష్టం వచ్చినట్లు చెయ్యి."

సౌమ్యుడు అన్నను మరేమీ అడగదలుచుకోలేదు. సరాసరి కౌముదిదగ్గరకు వెళ్ళి ఆమెను తనతో రమ్మని అడిగాడు. కాని ఆమెమాత్రం అందు కంగీకరించలేదు. తానా అడవి వదలి వెళ్ళడానికి వీలులేదనీ, అట్లావెళ్తే తనకు ప్రమాదం సంభవిస్తుందనీ, తనకా అడవే వాసయోగ్యముగా ఉందనీ చెప్పింది "కాదు.కౌముదీ!నీవునాతో వస్తే నిన్ను పెళ్లిచేసుకుంటాను. మనిద్దరం కలసి హాయిగా కాలం గడపవచ్చును." అని బ్రతిమాలాడు సౌమ్యుడు.

"అయ్యో! నన్ను పెళ్ళిచేసుకుంటానని ఎందు కన్నారు?" కౌముది ముఖంలో యేదో రాబోయే ప్రమాదాన్ని సూచించే చిహ్నాలు కనుపించాయి.

"అందులో తప్పేముందీ?"

"నన్ను వివాహం చేసుకుంటానని చెప్పి, ఏకారణం చేతనయినా మరొకరిని వివాహము చేసికొనవలసివస్తే అతడు చచ్చిపోతాడు. మీ కా సంగతి తెలియక అమాయకంగా నన్ను పెళ్ళిచేసుకుంటా నన్నారు."

"నిన్నువిడచి మరొకర్ని వివాహం చేసుకునేకన్న చావే నయంలే,కౌముదీ! అయితే, నాతో కలిసి మా వూరు రావన్నమాటేనా?"

"రాలేను. క్షమించండి."

"పోనీ, నీవెవరవైనదీ కూడా నాతో చెప్పకూడదా?" ఇంతలో భార్గవుడటు వస్తూండడం చూసింది కౌముది.

"ఇప్పుడు చెప్పడానికి వేళకాదు. మీ అన్నగారిటు వస్తున్నారు. మీకు నన్నుచూడాలని వుంటే యిక్కడకు కనిపించే ఆ నది ఒడ్డునే ఉంటాను. వచ్చి కలుసుకోండి. చైత్రమాసంలో తప్ప మరొకప్పుడు మీరు నన్నిక్కడ చూడలేరు. అప్పుడు మీకోసం యెదురుచూస్తూ ఉంటాను. శలవు."అంటూ కౌముది మాయమైపోయింది.

* * *

వెనుకనుండి వచ్చిన భార్గవుడు, "నేను చెప్పలేదూ, తమ్ముడూ! ఆమె ఏ దయ్యమో అయిఉంటుంది. అందుకే చూస్తూండగా మాయమైపోగలిగింది."అని తమ్ముణ్ణి వెనక్కు తీసుకొని వచ్చేశాడు.

ఆరోజే అన్నదమ్ములిద్దరూ స్వస్థలానికి బయలుదేరి వెళ్లిపోయారు. కుమారు లిద్దరూ సుఖంగా తిరిగి రావడంచూసి తండ్రి చాలా సంతోషించాడు. అడవిలో వారిద్దరూ వన్యమృగాల్ని చంపి తీసుకొని వచ్చిన చర్మాల్ని చూసి, తన కొడుకులకు వేటాడడములో గల పాటవాన్ని చూసి చాలా గర్వపడ్డాడు.

కౌముదిని గురించి జరిగినదంతా పూసగుచ్చినట్లు భార్గవుడు తండ్రితో చెప్పాడు. అది విన్న రాజు సౌమ్యుణ్ణి పిలిపించి యిలా చెప్పేడు. "అబ్బాయీ నువ్వా అడవిలో యెవరో అమ్మాయిని ప్రేమించినావని అన్నయ్య చెబుతున్నాడు. అక్కడ దయ్యాలు మనుష్యరూపంతో తిరుగుతాయి. మనుష్యులతో కలసి మెలసి వుండి వాళ్ల రక్తమాంసాల్ని పీల్చేస్తూంటాయి.గొప్ప గండంగడిచింది. నీకు పిల్లను నిశ్చయంచేసి. చైత్రమాసంలో వివాహం చేద్దామని చూస్తూన్నాను."

"నేను కౌముదిని తప్ప మరెవ్వరినీ వివాహం చేసుకోను, నాన్నగారూ!" అన్నాడు సౌమ్యుడు.

"నీ కేమీ తెలియదు. నువ్వింకా చిన్న కుర్రవాడివి. నీ బాగోగులను తెలిసిన మేమెట్లా చెబితే అట్లా వినాలి నువ్వు." అంటూ అక్కడనుండి లేచి వెళ్లిపోయాడు రాజు.

చైత్రమాసం వచ్చింది. సౌమ్యుని వివాహానికి ముహూర్తం నిశ్చయంచేశారు. ఒకనాటిరాత్రి భార్గవుడు తండ్రితో యిలా చెప్తూండడము సౌమ్యుడు విన్నాడు.

"నాన్నగారూ అది నిజంగా దయ్యమే. మా యెదురుగానే మాయమై పోయింది. అది ఉన్నన్నాళ్లూ తమ్ముడు మరొకర్ని వివాహం చేసికోడు. ఈచైత్రమాసంలో అది అక్కడే నదిఒడ్డున ఉంటానని చెప్పింది. నేను వెళ్లి దాన్ని హతమార్చి వస్తాను."

"మంచిది. వెళ్లిరా" అన్నాడు తండ్రి. ఈ సంభాషణ విన్న సౌమ్యుడు నిలువునా కూలిపోయాడు.అతనికి ఏం చెయ్యడానికీ తోచలేదు. భార్గవు డప్పుడే గుర్రాన్నెక్కి బయలుదేరాడు. ఆ వెనుకనే సౌమ్యుడు కూడా మరొక గుర్రాన్నెక్కి బయలుదేరాడు. ఇద్దరూ గుర్రాల్ని వాయువేగంతో

ష్టరుగెత్తిస్తున్నారు. భార్గవుడు, ముందూ ఆ వెనుక సౌమ్యుడు. అల్లంత దూరంలో నది కనిపిస్తున్నది. అతన్ని కలుసుకోవాలని సౌమ్యుడు సాధ్యమైనంత వేగంగా గుర్రాన్ని పరుగెత్తిస్తున్నాడు. కాని భార్గవుడే ముందు నదిని చేరుకొని పడవ యెక్కి అవతలిఒడ్డుకు బయలు దేరాడు. కౌముది అవతల ఒడ్డున నుండి యెవరికోసంకో ఎదురు చూస్తున్నది. బహుశః సౌమ్యుని కొఱకే అయివుంటుంది. ఆలస్యం చేస్తే ఆమె మాయమై పోవచ్చని, భార్గవుడు పడవలోనుంచే గురి చూసి బాణంవదిలాడు. వెంటనే గుండె కరిగించే ఆర్తనాదం వినిపించింది. అది చనిపోతున్న కౌముది గొంతుక. సంతోషంతో భార్గవుడు తిరిగి వచ్చేశాడు. ఆ కేకవిని స్పృహ తప్పి పడిపోతున్న తమ్ముణ్ణి తనతో పాటు గుర్రంమీద కూర్చోపెట్టుకుని యింటికి తీసుకువచ్చేశాడు.

''దయ్యం వదిలింది. పీడా వదిలింది. నాన్నా! దాన్ని చంపేశాను" అన్నాడు తండ్రితో. తండ్రి సంతోషించాడు.

సౌమ్యుని వివాహానికి ప్రయత్నాలు చురుకుగాజరుగుతున్నాయి. తిరిగివచ్చిన దగ్గరనుండీ సౌమ్యుడు ఎప్పుడూ విచారంగా ఏదో ఆలోచిస్తూ కుమిలి కుమిలి దుఃఖిస్తూ కాలం గడుపుతున్నాడు. అతని కిష్టం లేకపోయినా, మొదట కుదిర్చిన ముహూర్తానికే సౌమ్యుని వివాహం జరిగిపోయింది. పెళ్లయిననాటి రాత్రే సౌమ్యుడు చచ్చిపోయాడు!!

ఏ జబ్బూ లేకుండా సౌమ్యు డంత హఠాత్తుగా ఎందుకు చచ్చిపోయాడో ఎవరికీ తెలియలేదు. అతన్ని నిజరూపంలో కాకపోయినా మరొకరూపంలో కౌముది తనవద్దకు చేర్చుకుందని ఎవరికి తెలుసు?

---

## టామ్ సాయర్

(31-వ పేజీ తరువాయి)

నప్పుడు, నల్లటి ముసుగు వేసుకుని, వెనకాలగా వచ్చి, బుజంమీదగా వంగి దెయ్యం 'ఇహీ' మని ఇకిలిస్తుం దనుకో అప్పుడు నా ప్రాణాలు పైనే ఎగిరిపోతాయి."

"పోని పగటిపూట వెళ్లి తవ్వుదాం."

"దెయ్యాలుండే యిళ్లకి పగటిపూటకూడా ఎవరూ పోరు తెలుసా?"

"ఎందుకంటే ఆ యిళ్లలో ఏదో హత్య జరిగివుంటుందని భయం. అసలు ఆ కిటికీల్లోంచి నీలపు దీపాలు కనిపిస్తాయి తప్ప దెయ్యాలు కనిపించవు."

వెలుగుతూ, "ఆరుతూ నీలపు దీపం కనిపిస్తుం దనుకో దానివెనక దెయ్యం తప్పకుండా ఉండి తీరుతుంది. నీలపు దీపాలు దెయ్యాల దగ్గిరే వుంటాయి?"

"అయినా, అవి పగటిపూట రావుగా. మనకి భయమేముంది?"

ఇల్లా మాట్లాడుకుంటూ ఇద్దరూ కొండ దిగుతున్నారు. హాక్ మర్నాడు దెయ్యాల ఇంటిలో ప్రయత్నించటానికి ఒప్పుకున్నాడు.

వెన్నెల్లో కొంచం దూరంలో దెయ్యాల ఇల్లు కనిపించింది. కొన్ని చోట్ల గోడలు పడిపోయి, కప్పు విరిగిపోయి, కిటికీరెక్కలు ఊడిపోయి, శిథిలమై వుంది. లోపల్నుంచి నీలపుదీపం కనిపిస్తుందేమోనని ఇద్దరూ దూరంగా నుంచుని చాలాసేపు చూచారు. చివరికి విసుగుపుట్టి ఇల్లదారి పట్టారు.

---

ఒకడు—ట్రిప్లికేన్ ఎలా వెళ్ళాలో చెబుతారా?

రెండవవాడు— కాస్త గట్టిగా చెప్పండి. నాకు చెముడు.

మొదటి—ఏమిటీ అంటారు?

రెండో— అహా. నాకు కాస్త చెముడుంది. గట్టిగా చెప్పమంటున్నా.

మొదటి—నిజంగానే? నాకూ చెముడే.

రెండవ—ఆ, ఏమిటన్నారు?

మొదటి—ట్రిప్లికేనుకి ఎటువెళ్లాలి?

రెండవ—ఓ, అదా. ఈ సరాసరి వెళ్లి ఎడమకి తిరిగి కుడివేపుకి మళ్లండి; ట్రిప్లికేన్ వస్తుంది.


మొదటి—అదే ట్రిప్లికేనా?

రెండవ—క్షమించండి. మీరు ట్రిప్లికేన్ గూర్చి కాదూ అడిగింది?

మొదటి—బలేవాడివే; నే నడిగేది ట్రిప్లికేన్ ఎలా వెళ్ళాలి అని.

మొదటి—అబ్బే. అదేమిటో నాకు తెలియదు. ఎప్పుడూ ఆ పేరన్నా వినలేదు.

# పిల్లి శకునము



ఒక ఊళ్లో హరిదత్తుడనే బీద బ్రాహ్మణుడు ఉండేవాడు. ప్రతి దినము యాచన చేసుకొని తన భార్యతో జీవిస్తుండేవాడు.

ఒకనాడు హరిదత్తుడు తెల్లవారు జాముననే లేచి సంధ్య వార్చి, చెంబు చేతబట్టి బయలుదేరాడు భిక్షాటనానికి. గుమ్మం దిగాడో లేదో వాకిట్లోనే ఒక నల్లపిల్లి అడ్డం వచ్చింది. "పిల్లి అడ్డంవస్తే అశుభము. భిక్షానికి పోవద్దని," అతని భార్య మందలించింది. కాని మన హరిదత్తుడు వింటేగా! అతనికి ఇలాంటి పిచ్చి శకునాలు రుచింపవు. భార్యమాట పెడచెవిని బెట్టి బయలుదేరాడు యాచనకి.

మొట్టమొదట అతను ఒక ఇంటి వద్ద నిలచి, ఏ దేవుని ప్రార్థిస్తూ పాట పాడితే ఫల ముంటుందా అని ఆలోచనలో పడ్డాడు. అప్పుడు మన హరిదత్తుడికి ఆదిశేషుడు జ్ఞప్తి కొచ్చాడు.

ఆదిశేషువు ఈ భూమండలమును తన వెయ్యి పడగలతో మోస్తూ ఎంతో ఓర్పుగల్గి ఉన్నాడు కదా! అతనిని వేడితే మంచిదని,

"పవ్వళించితివా
ఓ! శేషయ్యా,
పవ్వళించితివా"

అని ఏదో పాటను గట్టిగా రాగాలు తీస్తూ పాడుతున్నాడు.

శ్రీ దద్దనాల వీరభద్రరావు

ఆ యింటి యజమాని పేరు రామశేషయ్య. ఆరోజు శివరాత్రి అవడంచేత రాత్రంతా జాగారం చేసి, పాదరక్షలైనా విడువక సుఖ నిద్రలో ఉన్నాడా శేషయ్య.

మన హరిదత్తుని పాట వినేసరికి ఆ శేషయ్యకు మహాకోపంవచ్చింది. ఎందుచేతనంటే, నిద్రాభంగం చేయటం ఒకటి, తన పేరుతో పిలిచి లేపడం మరొకటి. కోపంతో బైటకు వచ్చి అతనికి పాదరక్షతో వీపుపై పూజచేశాడు

ఆ దెబ్బలకు హరిదత్తుడు సణుగుకొంటూ మరో ఇంటికి వెళ్ళాడు. ఆ యింటి పంచనుండి అతడు "ఆదిశేషుడు నాపై దయజూపలేదు. శ్రీరామచంద్రుడు దయామయుడు. అతనిని స్మరిస్తాను," అనుకొని, శ్రీరాముడు అడవికి పోయేటప్పుడు దశరథుడు పుత్రశోకముచే పాడిన

"పోవుచున్నావా!
ఓ! రామయ్యా,
పోవుచున్నావా!"

అనే పాట దుఃఖస్వరంతో గానంచేశాడు.

ఆ యింటాయన కొడుకుపేరు రామయ్యసెట్టి. అతనికి జబ్బు వచ్చి అటో ఇటో అనే స్థితిలో నుండగా బంధువులు అందరూ అతని చుట్టూ గుమిగూడి, అతనికోసం ఏడుస్తున్నారు. మన హరిదత్తుని పాట వినేసరికి వారి కెక్కడలేని కోపం

46 వ పేజీ చూడుడు

## కౌంట్ [illegible] స్టో

(8-వ పేజీ తరువాయి)

"అవును. అంతా యథాస్థితిలో ఉంది మస్యూ మారెల్. బాధ్యత నాది. ప్రయాణంలో వచ్చిన వెయ్యిపౌనుల లాభాన్ని తీసుకోవద్దని మీకు నా సలహా. మీరు ఓడయెక్కి వచ్చినట్లయితే, సరుకు అజమాయిషీ చేసే డాంగ్లర్ మీకు అవసరమైన విషయాలన్నీ చెప్పగలడు. నేను ఈలోగా లంగరు వేయిస్తాను."

డాంటె విసిరిన పగ్గం పట్టుకు సునాయాసంగా ఓడ యెక్కాడు యజమాని. యువకుడు యథాస్థానం చేరాడు. డాంగ్లర్ వచ్చి యజమానిని కలుసుకున్నాడు.

డాంగ్లర్ వయస్సు ఇరవై అయిదు, ఇరవై ఆరేళ్లుండవచ్చు. అంత ఆకర్షణీయమైన రూపం కాదు. పెద్ద ఉద్యోగులపట్ల అతివినయం, క్రిందివారిపట్ల ధూర్తతవల్లనే కాక, ప్రస్తుత కర్తవ్యరీత్యా నావికులలో పరపతి లేనివాడు. డాంటెపట్ల నావికుల కెంత ప్రేమో, డాంగ్లర్ పట్ల వారి కంత అసహ్యం.

"మస్యూ మారెల్, మీరు ఈ విషాదవార్త విన్నారుకదా?" అన్నాడు డాంగ్లర్.

"అవునవును. విన్నాను. పాపం లక్లెర్ వీరుడు. విశుద్ధవర్తనుడు."

"అనుభవజ్ఞుడైన నావికుడుకూడా. 'మారెల్ అండ్ సన్' వంటి కంపెనీలో బాధ్యత వహించడమంటే అటువంటి అనుభవజ్ఞుడే కావాలి."

డాంటెవంక చూపులునిగిడ్చి యజమాని అన్నాడు: "వృద్ధుడైతే గాని నావికునికి కర్తవ్యం తెలియదనడం సరికాదు డాంగ్లర్. చూడు మన ఎడ్మండ్. ఎవరి సహాయం అక్కర్లేకుండా పని చెయ్యగలడనిపిస్తుంది."

డాంగ్లర్ మాత్సర్యంతో డాంటెవంక పక్కచూపులు చూస్తూ అన్నాడు: "అవును. అతను యువకుడు. యువకులకు ఆత్మవిశ్వాసం అధికం. కెప్టెన్ చనిపోయాడో లేదో, బాధ్యతంతా పైన వేసుకున్నాడు. వెంటనే మార్సేల్స్‌కు తిరిగిరావటానికి బదులు 'ఎల్బా' ద్వీపంలో రోజున్నర గడిపాడు."

"బాధ్యతంతా పైనవేసుకున్నాడంటే 'మేట్'గా అది అతని విధి. కాని ఓడమరమ్మతు అవసరమైతే తప్ప, ఎల్బా ద్వీపంలో రోజున్నర జాప్యం చెయ్యటం తప్పే."

"ఓడకేం? నిక్షేపంలా ఉంది—నాలాగే. కేవలం లోభంవల్ల అక్కడ కులాసాగా గడపడానికి, రోజున్నర పాడుచేశాడు."

"డాంటే!" అని పిలిచాడు ఓడయజమాని, "ఒక్క మాటిలారా."

"క్షమించాలి మస్యూ, క్షణంలో వస్తున్నాను" అని జవాబిచ్చి. డాంటే, "లంగరుదించండి" అని నావికులకు కేకపెట్టాడు.

వెంటనే లంగరుదిగింది. ఇనుపగొలుసులు పెద్దరొద చేస్తూ దిగాయి. లంగరుపడిన తరవాత "జండాసగమెత్తు దించండి. రేవుకు నిచ్చెనలు వెయ్యండి" అని కేకపెట్టాడు డాంటే.

"అబ్బో! అప్పుడే కెప్టెన్ అయిపోయాననుకుంటున్నాడు చూడండి," అన్నాడు డాంగ్లర్.

డాంటే సమీపించాడు. "లంగరు వేసేశారు. ఇంక సెలవివ్వండి" డాంగ్లర్ ఒక అడుగు వెనక్కి ఒదిగాడు.

"ఎల్బాదగ్గిర ఆలస్యమెందుకు చేశావో చెప్పనావు?"

"నాకు తెలియదు మస్యూ. అది కెప్టెన్ లక్లెర్ తుదిఆజ్ఞ. గ్రాండ్‌మార్షల్ బెర్ట్రండ్‌కి ఇవ్వాలంటూ ఒకబంగీనాచేతి కిచ్చాడు, చనిపోయేముందు."

"అయితే గ్రాండ్ మార్షల్‌ని చూశావన్నమాట?"

"చూశాను."

మారెల్ కంగారుగా ముందూ వెనకా చూశాడు. డాంటేని పక్కకు తీసుకెళ్లి మెల్లిగా ప్రశ్నించాడు, "చక్రవర్తి ఎలా ఉన్నారు?"

"ఈ కళ్లతోనే చూశానా అనిపిస్తుంది..."

"అయితే నువ్వు చక్రవర్తినే చూశావా!"

"నేను వెళ్లినప్పుడే మార్షల్ వద్దకు ఆయనకూడా వచ్చారు. ఓడనిగురించి నన్ను ప్రశ్నలడిగారు. మార్సేల్స్‌నించి ఎప్పుడు ప్రయాణమైనదీ, ఏమార్గాన ప్రయాణం చేసినదీ, ఏమేమి సరుకు తీసుకువెళ్లినదీ అడిగారు. ఓడలో సరుకు లేకపోయి, నేనే ఓడ యజమానినైతే, తప్పకుండా ఆయన ఓడని కొనేసేవారని నా నమ్మకం. కాని నేను మేట్‌ని మాత్రమేనని ఆయనకి నివేదించాను. ఓడ మారెల్ అండ్ సన్స్‌కు చెందినదని చెప్పాను. 'అల్లాగా' అన్నారాయన. 'నాకు తెలుసు. మారెల్ వంశస్థులు పారంపర్యా ఓడయజమానులు. ఆ వంశంలో ఒకరు వాలెన్స్‌లో నాతోపాటు సైన్యంలో ఉండేవారు కూడా' అన్నారు."

యజమాని ఆనందభరితుడైనాడు. "నిజంగా? ఈశ్వరకృప సుమా! అతని పేరు 'పాలకర్ మారెల్;' మా పినతండ్రి. తరవాత కెప్టెన్ అయినాడు. డాంటే! ఈమాట నువ్వు మా పినతండ్రికి తప్పకుండా చెప్పాలి; చక్రవర్తికి ఇంకా అతను జ్ఞప్తిలో ఉన్నాడని. నువ్వే చూడు. ఇదివింటే ఏడ్చేస్తాడు." స్నేహభావంతో యువకుని జబ్బలు రెండుచేతులా పట్టుకుని మళ్లీ అన్నాడు: "నిజమే. నువ్వు చేసింది మంచిదే డాంటే. లక్లెర్ ఆజ్ఞ పాలించడం మంచిదే అయింది. కాని నువ్వు ఒక బంగీ గ్రాండ్‌మార్షల్‌కి ఇచ్చినట్లుగాని, చక్రవర్తితో మాట్లాడినట్లుగాని పైకి పొక్కిందంటే నీకు క్షేమంకాదు."

"అదెల్లా మస్యూ? నేనిచ్చిన బంగీలో ఏముందో నాకు తెలియదు. ఏ ఇతర అపరిచితవ్యక్తినైనా ప్రశ్నించేవిధంగానే, నన్నూ చక్రవర్తి ప్రశ్నించారు. అంతే. ఇదిగో. తనిఖీ ఆఫీసర్లు వస్తున్నారు. ఒక్కక్షణం మన్నించండి" అంటూ డాంటే వెళ్లిపోయాడు. అతను వెళ్లిందే తడువు డాంగ్లర్ సమీపించాడు.

"ఇంకేం? ఫెరాజో రేవులో లంగరెందుకు వేశాడో మంచికారణాలు చెప్పాడన్నమాట?"

"అవును, మంచికారణాలే డాంగ్లర్. అది కెప్టెన్‌లక్లెర్ ఆజ్ఞ."

"అన్నట్టు, కెప్టెన్‌లక్లెర్ అంటే జ్ఞాపకం వచ్చింది. మీకిమ్మని ఆయన ఇచ్చిన ఉత్తరం ఒప్పగించాడా?"

"నాకు ఉత్తరమా? లేదే? అతనిదగ్గరుందా?"

"బంగీకాక, ఒక ఉత్తరంకూడా కెప్టెన్ లక్లెర్ ఇచ్చాడనుకున్నాను."

"బంగీ ఏమిటి డాంగ్లర్?"

"ఫెరాజో రేవులో ఒప్పగించి ఉండాలి, ఆ బంగీని."

"కాని ఫెరాజో రేవులో ఒప్పగించడానికి బంగీ ఒకటి డాంటేదగ్గరుందని నీ కెలా తెలుసు?"

డాంగ్లర్ ముఖం ఎర్రబడింది. "నేను అప్పుడే కేప్టెన్ గది దాటి వెళుతున్నాను. తలుపు ఓరగా ఉంది. బంగీ ఒకటి, ఉత్తరం ఒకటి డాంటెకి కేప్టెన్ ఇవ్వడం కనపడింది."

"నాకు ఉత్తరంసంగతేమీ డాంటె చెప్పలేదు. ఏదైనా ఉత్తరం ఉంటే నా కిచ్చేవాడే!"

డాంగ్లర్ ఒక్క క్షణం ఆలోచించాడు. "కాని క్షమించాలి మస్యూమారెల్. దానిసంగతేమీ డాంటెని అడక్కండి. నేను పొరబడి ఉండవచ్చు."

అప్పటికి యువకుడు అక్కడికి చేరాడు. డాంగ్లర్ వెళ్లిపోయాడు.

"చూడు డాంటె! నీపనంతా పూర్తిఅయినట్టేనా? ఇంక చెయ్యవలసిందేదీ లేదు కదా?"

"లేదు. అంతా పూర్తి అయింది."

"సరే. అయితే నువ్వీరాత్రి మాయింటికి విందుకి రాగలవా?"

"క్షమించాలి మస్యూ మారెల్. నేను ముందు వెళ్లి నా తండ్రిని చూడాలి. మీరు చూపుతున్న ఆదరానికి చాలా కృతజ్ఞుణ్ని."

"ఫరవాలేదులే. అదీ నిజమే. నీ పితృభక్తి నాకు తెలుసు."

కొంచెం సంకోచిస్తూ డాంటె ప్రశ్నించాడు. "నాతండ్రి ఎలా వున్నాడో మీకేమైనా తెలుసా?"

"ఆ-క్షేమంగానే ఉన్నాడనుకుంటాను. ఆయన్ని నేనంతగా చూడ్డంలేదనుకో."

"అవును. ఆయన గదివిడిచి కదలడు."

"దాన్ని బట్టే అనుకున్నాను, ఆట్టే ఎవరిసహాయం అవసరం లేకపోయిందని. సరే. చూసి త్వరలో తిరిగివస్తావుగా?"

"క్షమించాలి. నా తండ్రిని చూసినతరవాత మరొకచోటికి వెళ్లాలి. ఆలస్యం చెయ్యడానికి మనస్కరించడం లేదు."

"ఓహో! అదా? నేను మరిచిపోయాను డాంటే. కాటలన్స్ నివాసంలో నీకోసం ఒకరు నిరీక్షిస్తూ ఉంటారు కాబోలు. ఎవరు? మర్సిడాయేనా?"

డాంటె మందహాసం చేశాడు.

"ఓహ్హోహ్హో" అంటూ మారెల్ బిగ్గరగా నవ్వాడు. "ఇప్పుడు తెలిసింది. ఆమె నా వద్దకు మూడుసార్లు వచ్చి ఫరావో నాకనిసరించి బెంగతో ఎందుకడిగిందో అనుకున్నాను. అవును ఎడ్మండ్. నిన్నింక నిలవరించకూడదు. నా వ్యవహారాల్ని చక్కగా కనిపెట్టి చూశావు. నీకింక విశ్రాంతి నివ్వడం నాధర్మం. నీకు డబ్బేమైనా కావాలా?"

"ఒద్దు మస్యూ. ప్రయాణంలో తీసుకున్న మూడుమాసాల జీతం డబ్బుంది నాదగ్గర."

"జాగ్రత్త పరుడవే! ఇంక వెళ్లు ఎడ్మండ్. నీతండ్రిని చూడు. నాకూ కుమారుడొకడున్నాడు. మూడుమాసాలు సముద్ర సంచారంచేసి వచ్చినతరవాత, త్వరపడి నావద్దకు రాకపోతే నే విసిగిపోనూ? వెళ్లింక. ఇంక నాకు చెప్పవలసిందేమీ లేదుగా?"

"లేదు మస్యూ."

"కెప్టెన్ లక్లేర్ చనిపోయేముందు నాకోసం ఉత్తరమేదీ ఇవ్వలేదా?"

"అసలాయన అప్పుడు వ్రాయలేని స్థితిలో ఉన్నాడు మస్యూ. అన్నట్టు మరిచాను. పదిహేనురోజులు సెలవు అడగాలనుకున్నాను."

"ఓ! పెళ్లిచేసుకోడానికా?"

"అవును మస్యూ. ఆతరవాత పారిస్ వెళ్లాలి."

"నీకు కావలసినన్ని రోజులు సెలవుతీసుకో డాంటే. మూడుమాసాలవరకూ ఓడ బయలుదేరదు. ఆలోగామాత్రం తిరిగిరా. ఎందుకంటే కెప్టెన్ లేకుండా ఫరావో కదలదుగా!"

"కెప్టెనా!" అన్నాడు డాంటే. ఆనందం, ఆశ్చర్యం అతన్ని ముప్పిరిగొన్నాయి. "నిజంగానే నన్ను ఫరావో కెప్టెన్‌గా నియమిస్తారా?"

"అంతా నాచేతిలోనే ఉంటే, వెంటనే నిశ్చయించి చెప్పేసేవాడిని డాంటె. కాని నాతో వాటాదారుకూడా ఉన్నాడుగా. అయినా వ్యవహారం సగభాగం నిర్ణయమైనట్లే భావించుకోవచ్చు, నా సమ్మతినిబట్టి. నే చేయగలిగినంత నీకోసం చేస్తాను, రెండోపక్షంచేత సమ్మతింపచెయ్యడానికి."

"నిజమా మస్యూ మారెల్?" యువకుని నేత్రాలు బాష్పపూరితాలైనాయి. యజమానిచేతిని తన రెండుచేతులా గ్రహించి అన్నాడు: "మీకు చాలా కృతజ్ఞుణ్ని. ఇదివింటేనా తండ్రీ,మర్సిడా కూడా చాలా ఆనందిస్తారు"

"మంచివాళ్లనెప్పుడూ పైన భగవంతుడు కనిపెడుతూ ఉంటాడు నాయనా. నువ్వింక నీ తండ్రిదగ్గరకూ, మర్సిడాసమక్షానికి వెళ్లి తిరిగిరా. నేనింక ఉంటాను. డాంగ్లర్‌తో వ్యవహారం ఇంక తేల్చుకోవాలి. ప్రయాణంలో అతను నీతోసఖ్యతగా ఉన్నాడా?"

"మస్యూ! జవాబు మీప్రశ్నలోని ఆంతర్యాన్ని బట్టి ఉంటుంది. చెలికాడుగా ఉన్నాడా అనడిగితే, అంతగా చెప్పలేను. ఎందువల్లనంటే, నేనంటే అతని కెప్పుడూ ఇష్టంలేదు. 'మాంట్ క్రిస్టో' ద్వీపంవద్ద పదినిమిషాలు ఆగాలని నేనన్నప్పుడు అతను వద్దన్నాడు. అదనిజంగా చిలిపితగువేనని ఒప్పుకుంటాను. నే ననడం తప్పే. అతనువద్దనడం సవ్యమే. ఇంక మీసరుకు అజమాయిషీ ఎలా చేశాడని ప్రశ్నిస్తే, అతని కర్తవ్యాన్ని తృప్తికరంగా నెరవేర్చాడని చెప్పాలి."

"నువ్వే ఫరావోనౌకకు కెప్టెన్ అయితే, డాంగ్లర్‌తో కలిసిఉండడం నీకు అంగీకారమేనా?"

"నేను కెప్టెన్‌గా ఉన్నాసరే, మేట్‌గానే ఉన్నాసరే, యజమానులు నమ్మిన ఉద్యోగులే ఉండాలని నా అభిప్రాయం. వారిని నేను మన్నిస్తాను."

"శబాష్, డాంటె! నువ్వు ముక్కుకి సూటిగా వెడతావ్. ఇంక వెళ్లు. ఇంక ఆలస్యం చెయ్యడం నాకిష్టంలేదు. నువ్వు తొందరపడుతున్నావ్."

"మస్యూ మారెల్, సెలవివ్వండి. చాలా కృతజ్ఞుణ్ని. మీకు వెయ్యి నమస్కారాలు."

యువకుడు ఉత్సాహంతో బోటులోకి దుమికాడు. 'కానిబయర్' దిక్కుగా నడపాలని నావికునికి ఆజ్ఞఇచ్చాడు. ఓడయజమాని చిరునవ్వుతో బోటులోని యువకుని పరికించాడు. బోటు తీరం చేరింది. యువకుడు ఒక్క ఉదుటున ఒడ్డుపైకిలంఘించాడు. అనతికాలంలో చూపు మేర దాటి జనసమూహంలో కలిసి అదృశ్యమైనాడు. 'కానిబయర్' వద్ద జనం గుంపులు గుంపులుగా చేరి ఉత్సాహంగా కాలం గడుపుతారు. పారిస్ నగరంలో ఇలాటిదే ఉంటే, మార్సెల్స్‌నగరంతో పోటీచెయ్యగలిగేదని కొందరంటారు.

ఓడయజమాని వెనుతిరిగి చూసేసరికి డాంగ్లర్ కనిపించాడు. ఆజ్ఞకోసం నిరీక్షిస్తున్నట్లు నిలిచాడు. కాని వాస్తవానికి యువకుని

అసూయత కనిపెట్టి చూస్తున్నాడు. యువకుని పరికిస్తున్న ఇద్దరువ్యక్తుల ముఖాలలోనూ భిన్నభావాలు వ్యక్తమైనాయి.

## 2

'కానిబయర్' మేరంతా నడిచి, నోవాలీవీధిలో ఒక చిన్న గృహం ప్రవేశించాడు డాంటీ. గబగబా ముందుమెట్లు నాలుగూ ఎక్కి, ద్వారంముందు నిలిచాడు. తలుపులు ఓరగా తెరిచి ఉన్నాయి. అది చిన్నగది. ఆ గదిలోనే డాంటీ తండ్రి నివాసం.

ఫరావోనాక వచ్చినవార్త వృద్ధునికింకా తెలియలేదు. ఎత్తు కుర్చీ ఒకటెక్కి నిలబడి, కిటికీఊచల్ని అంటి పాకుతున్న పూల తీగెల్ని కంపితహస్తాలతో సవరిస్తున్నాడు.

వృద్ధునికి పరిచిత కంఠం మధురంగా వినవచ్చింది.

"బాబా! బాబా!"

వృద్ధుడొక్క కేకతో వెనుతిరిగి చూశాడు. కుమారుని చూడగానే అతని చేతులలో వాలిపోయాడు.

కుమారుడు ఆక్రందనస్వరంతో అన్నాడు.

"ఏమిటిది బాబా? జబ్బుగా ఉన్నావా?"

"లేదు నాయనా, లేదు. నువ్వు అకస్మాత్తుగా కళ్లబడ్డావు. అందువల్ల... అనుకోకుండా నిన్ను చూడ్డంతో.. అమ్మయ్య? ఈశ్వరా! ఇంక నిశ్చింతగా చనిపోగలననిపిస్తోంది."

"అదేమిటి బాబా? నువ్వు కొంచెం స్థిమితపడు. నేను తిరిగి వచ్చాను. మనం హాయిగా ఉందాం."

"అవును నాయనా. అలాగే. కాని నువ్వు మళ్లీ నన్ను విడిచి వెళ్ళిపోకుండా ఉంటేకదా మనం హాయిగా ఉండడం? చెప్పు? నిజం చెప్పు నాయనా?"

"ఒకరికి దుఃఖం కలిగించేది నాకు అదృష్టప్రాయమై నేను ఆనందిస్తే, కృపామయుడు నన్ను క్షమించాలి. కాని ఏంచెయ్యను? అదృష్టం కలిసివచ్చింది. కలిసివచ్చినందుకు దుఃఖించలేనుకదా! మా కెప్టెన్ లక్లేర్ చనిపోయాడు బాబా. మారెల్ సహాయంతో నాకా ఉద్యోగం దొరకవచ్చును. చూడు బాబా! ఒక్కసారి ఆలోచించు! ఇరవయ్యోఏట కెప్టెన్! నూరు లూయీల వేతనం, లాభాలలో పాలు. నావంటి పేదనావికుడు కలనైనా కనలేని మహాద్భాగ్యం కాదూ?"

"అవును నాయనా, అవును. అది అదృష్టం!" అన్నాడు వృద్ధుడు.

"నాకువచ్చే మొట్టమొదటి జీతంతో తోటమధ్య ఒక చిన్న ఇల్లు కొనాలని నిశ్చయించుకున్నాను. ఆ తోటలో నీయిష్టంవచ్చిన పూలతీగలు వేసుకోవచ్చును. కాని నువ్వంత జబ్బుపడినట్టు కనిపిస్తున్నావేమిటి చెప్పు బాబా?"

"అబ్బె, ఏమీ లేదు నాయనా. ఆందోళనపడకు. ఓపికపట్టు" అంటూనే, సత్తువ ఉడిగిపోయిన వృద్ధుడు వెనక్కి ఒరిగిపోయాడు.

"చూడు బాబా, చూడు. ఉండు. ఒక గ్లాసు ద్రాక్షరసం పుచ్చుకుందువుగాని. కొంచెం తేరుకుంటావు. అది ఎక్కడ పెట్టావు?" అంటూ డాంటీ గదిలో వెతకనారంభించాడు.

"లాభంలేదు నాయనా, ద్రాక్షరసం లేదు."

"ఏమిటి? ద్రాక్షరసం లేదా?" డాంటె తెల్లబోయి, పాలిపోయిన తండ్రిముఖంవంక చూశాడు. "అదేమిటి బాబా? డబ్బు లేకపోయిందా?"

"నాకింక లేనిదేముంది నాయనా? నువ్వు వచ్చావు. అంతే చాలు."

"కాని నేను కిందటిసారి రెండువందల ఫ్రాంకు లిచ్చి వెళ్లానుకదా?"

"అవును నాయనా, నువ్వు ఇచ్చావు. కాని మన పొరుగు 'కాడరూస్' కి ఇవ్వవలసిన ఋణంమాట మరిచిపోయావు. అతను వచ్చి జ్ఞాపకంచేశాడు. ఋణంతీర్చకపోతే మారెల్ వద్దకు వెళతానని బెదిరించాడు. నీకేమి అపకారం కలుగుతుందోనని భయపడి, నేను ఋణం తీర్చేశాను."

"ఏమిటి? అది నూటనలభై ఫ్రాంకులుకదా అతని కివ్వవలసింది? నేనిచ్చిన రెండువందల ఫ్రాంకుల్లోనూ అంతమొత్తం ఇచ్చేశావా?"

వృద్ధుడు అవునన్నట్లు తలూపాడు.

"అంటే, మూడుమాసాలకాలమూ అరవై ఫ్రాంకులతో గడిపావా బాబా? అయ్యో! తల్చుకుంటే గుండె బద్దలౌతోంది."

"అబ్బే, అల్లా అనుకోకు. అదంతా ఇప్పుడెందుకు? నువ్వు క్షేమంగా తిరిగివచ్చావు. అంతే చాలు." అని వృద్ధుడు చిరునవ్వు నవ్వాడు.

"అవును. తిరిగివచ్చాను. ఉజ్వలభవిష్యత్తుపై ఆశతో, చేత కొంత ధనంతో, తిరిగివచ్చాను. ఉండు బాబా ఇందులో నువ్వు కొంత డబ్బుతీసుకో. ముందుగా అవసరమైన కొన్ని వస్తువులు కొని తెప్పించుకో," అంటూ యువకుడు జేబులు దులిపి, తనవద్ద ఉన్న ధనమంతా తీసి మేజామీద ఉంచాడు డజను బంగారునాణ్యాలు, అరడజను క్రౌన్లు, కొన్ని చిల్లరనాణ్యాలు ఉన్నాయి.

"వెంటనే బజారుకు పంపి అవసరమైనవన్నీ తెప్పించుకుందాం బాబా. ఇవాళ హాయిగా గడుపుదాం. మళ్లీ రేపు కొంత ధనంవస్తుంది."

"తొందరపడకు నాయనా, తొందర వద్దు. ఒక్కసారిగా ఇన్నీ ఇప్పుడే కొనెయ్యడం చూస్తే, వీటికోసమే నీకోసం ఇన్నాళ్లూ నేను బెంగతో నిరీక్షిస్తున్నానని లోకులు అనుకోగలరు సుమా!"

"అవును, అదీ నిజమే. నీయిష్టప్రకారమే కానియ్యి. కాని అన్నిటికంటె ముందు నీకు పరిచర్య చెయ్యడానికి నౌకరొకడు కావాలి బాబా. నువ్వు ఒంటరిగా గడపకూడదని నా కోరిక. నేను చాటుగా కొంత కాఫీ, పొగాకు తీసుకొచ్చాను. అది నాసామానులో ఉంది. రేపొస్తుంది. ఉండు. ఎవరో వస్తున్నట్టున్నారు."

"అవును, అతను మన పొరుగు 'కాడరూస్' నువ్వు వచ్చినట్టు విని ఉంటాడు. యోగక్షేమాలు కనుక్కోవాలని వస్తున్నాడనుకుంటాను."

"అవునవును." మెల్లిగా గొణిగాడు ఎడ్మండ్, "పలికేమాటొకటి, మనసులోఉండేది మరొకటి. కానీలే. పొరుగువాడుకదా. తోచినప్పుడు సహాయంచేశాడు. అతన్ని సత్కరించడం మన ధర్మం."

ఎడ్మండ్ మాటలు ముగిసీ ముగియకముందే, కాడరూస్ ద్వారంవద్ద ప్రత్యక్షమైనాడు.

ఇరవైఅయిదు. ఇరవైఆరేళ్లుంటాయి. చిన్నగడ్డం పెంచాడు. దర్జీవృత్తి. కత్తిరిస్తున్న గుడ్డముక్క చేతిలో ఉండగానేవచ్చాడు.

"ఓహో ఎడ్మండ్! తిరిగి వచ్చావన్నమాట." చిరునవ్వుతో తెల్లని పళ్లవరుస స్పష్టంగా కనపడింది

"వచ్చాను, కాడెరూస్. సెలవివ్వండి. మీకే సహాయం కావలసినా చెయ్యడానికి సిద్ధంగా ఉన్నాను." అన్నాడు డాంటే. కాని సత్కార వాక్యాలు అతని రూక్షభావాన్ని కప్పిపుచ్చలేకపోయినాయి.

"అహ. వొద్దులే. ఎవరి సహాయం అవసరం లేకుండానే నాకు గడుస్తోంది. ఇతరులికి నేనే సహాయం చేస్తుంటాను."

డాంటేకి కొంచెం వేడి తగిలింది. కాని ఇంతలోనే కాడరూస్ అంగుకున్నాడు.

"అచ్చే. నేను నిన్నేమీ అనడం లేదోయ్! నేను నీకు ఋణమిచ్చాను; అది తీరిపోయింది. అది ఇరుగు పొరుగు ధర్మంకదా! అంతే. అది చెల్లు."

"చేసిన సహాయం ఎన్నడూ చెల్లిపోదు. ధనం బాకీ చెల్లిపోవచ్చు కాని కృతజ్ఞతా ఋణం తీరదు" అన్నాడు డాంటే.

"ఆ! అదంతా ఇప్పుడెందుకులే. జరిగిందేదో జరిగిపోయింది. ఇప్పుడు నువ్వు క్షేమంగా తిరిగి వచ్చావు. ఖులాసాగా కాస్సేపు మాట్లాడుకుందాం. ఒక గుడ్డ కోసం ఓడరేవుకి వెళ్ళాను. అక్కడ డాంగ్లర్ కనిపించాడు. 'ఇక్కడున్నావేమిటోయ్' అన్నాను. 'ఇప్పుడే తిరిగి వచ్చా' నన్నాడు. 'అయితే ఎడ్మండ్ ఏడీ' అని అడిగాను. 'తండ్రిని చూడ్డానికి వెళ్ళాడనుకుంటా' నన్నాడు. సరే కదా అని ఇల్లా వొచ్చాను. పాతమిత్రుని చూద్దాం కదా అని ఇక్కడ తొంగిచూశాను."

"నిజంగానే నీకు మేమంటే చాలా శ్రద్ధ కాడెరూస్" అన్నాడు వృద్ధుడు.

"కాదుమరీ! అసలే నిజాయితీ మనుషులు ఆట్టే కనిపించని ఈ రోజుల్లో, మీరంటే నాకు చాలా గౌరవం ఏమిటోయ్! చాలా ధనవంతుడవైనట్టున్నావే!" అన్నాడు దర్జీ, మేజాపైనున్న డబ్బు వంక చూస్తూ.

డాంటే నిర్లక్ష్యభావంతో, "ఏదోలే. దేవుడిదయ. కాని ఇది నా డబ్బు కాదు. నేను లేనప్పుడు ఇబ్బంది పడ్డాడేమోనని మా బాబని అడిగాను. లేదని నాకు నచ్చచెప్పడానికి, ఉన్నది పర్సు దులిపి చూపించాడు. అదేమిటి బాబా! అదక్కడే ఉంచావ్! తీసి దాచు. కాడెరూస్‌కి ఇప్పుడు డబ్బేమైనా అవసరం ఉంటే కొంత అప్పియ్యి పోనీ"

"అబ్బెబ్బె నాకేమీ ఒద్దోయ్" అన్నాడు కాడెరూస్. "దేవుడిదయవల్ల నా వృత్తి నన్నిప్పుడు బాగానే గడుపుతోంది. సరే, బాగానేఉంది. అయితే మారెల్‌తో సఖ్యత బాగా కుదిరిందన్నమాటేగా? నువ్వూ గడుసుదనం నేర్చావులే!"

"మారెల్ నన్నెప్పుడూ ఆదరిస్తాడు."

"మరైతే అతను విందుకి పిలిస్తే నువ్వు నిరాకరించావుట తప్పుకాదూ?"

"ఏమిటీ? విందు నిరాకరించావా?" ఆత్రుతగా అడిగాడా వృద్ధుడు. "ఏమిటి డాంటే? అతను నిన్ను విందుకి ఆహ్వానించాడా? మరెందుకు నిరాకరించావు నాయనా?"

"వెంటనే నిన్ను చూడాలని బాబా. చూడందే నిలవలేకపోయాను."

"మారెల్ ఎంత నొచ్చుకుని ఉంటాడో! కెప్టెన్ అవాలని కోరుకుంటున్నవాడైతే, కొంచెం యజమానిని మెప్పించడానికి ప్రయత్నించాలి" అన్నాడు కాడెరూస్.

"మెప్పించడానికి నేను ప్రయత్నించ నక్కరలేకుండానే కెప్టెన్ అవాలని ఆశ"

"అవునవును. అదీ బాగానే ఉందిలే, మంచిదే. నీ పాతమిత్రులంతా సంతోషిస్తారు. ఈ శుభవార్త వింటే సంతోషించే వాళ్లు సెంట్ నికొలాస్ కోట కవతల మరొకరుంటారని కూడా నా ఊహ."

వృద్ధుడు ప్రశ్నించాడు: "ఎవరు! మర్సిదా మాటేనా?"

యువకుడన్నాడు "అవును బాబా. నిన్ను చూశాను. నా బెంగ తీరింది. ఇంక కాటలన్స్ నివాసానికి వెళ్ళాలనుంది బాబా. ఏమంటావు?"

"అవును నాయనా వెళ్లు. ఇటువంటి కొడుకునిచ్చి భగవంతుడు నన్ను కనిపెట్టాడు. అలాగే తగిన భార్యనకూర్చి భగవంతుడు నిన్నాశీర్వదిస్తాడు."

"భార్యా!" అని ఆశ్చర్యపడ్డాడు కాడెరూస్. "అప్పుడే భార్య అంటున్నారేమిటండీ! ఇంకా కాలేదుగా? అయినా, తొందరపడ్డం మంచిది డాంటే. మర్సిదా అపురూపసుందరి. అంత చక్కని యువతి ఉంటే, ఆమెని కోరే వరులనేకులుంటారు. మర్సిదాపైన ఆసక్తి పెట్టుకుని డజనుమంది యువకులున్నారు."

"నిజమే." అన్నాడు డాంటే, చిరునవ్వుతో. అయితే లోని తొందరపాటు అణుచుకోలేకపోయాడు.

"నిజమే." అన్నాడు కాడెరూస్. "వాళ్లలో కొందరు తగినవరులు కూడా ఉన్నారు. అయితే, నువ్వు కెప్టెన్ కాబోతున్నావు కాబట్టి నిన్ను నిరాకరించే ప్రమాదం లేదనుకో"

"అచ్చే. అలా అనకూడదు" అన్నాడు డాంటే. "స్త్రీలంటే నాకింతకంటె మంచిభావం ఉంది. ముఖ్యంగా మర్సిదాపట్ల. నేను కెప్టెన్ అయినా సరే కాకపోయినా సరే, ఆమె నాపట్ల ఒకే ఆసక్తితో ఉంటుందని నా నమ్మకం."

"మరీ మంచిదీ! అయినా, నా సలహా పెడచెవిని పెట్టకు. నువ్వు తిరిగి వచ్చినట్టు, ఆమె పైన నువ్వు ఆశలు పెట్టుకున్నట్టు వీలైనంత త్వరలో ఆమెకి తెలియపరచడం మేలు"

"అలాగే చేస్తాను" అంటూ డాంటే, తండ్రిని ఒకసారి ఆలింగనం చేసుకుని బయలుదేరాడు. డాంటే వెళ్ళిన వెంటనే కాడరూస్ బయలుదేరాడు. మెట్లుదిగి వెళ్లి వీధిమలుపులో వేచి ఉన్న డాంగ్లర్‌ను కలుసుకున్నాడు.

"ఏమయింది? అతన్ని చూశావా?" అని ప్రశ్నించాడు డాంగ్లర్.

"ఇప్పుడే అతనివద్దనుంచి వస్తున్నాను."

"తనకి కెప్టెన్ అవాలని కోరిక ఉన్నట్టు నీతో ఏమైనా అన్నాడా?"

"అనడమేమిటి? అప్పుడే కెప్టెన్ అయినట్లే మాట్లాడుతున్నాడు! మారెల్ అతనికి మాటఇచ్చాడట."

"అలాగేం? అంతా ఉట్టిది. అయినా, ఇంకా కెప్టెన్ కాలేదుగా! అది మాత్రం నిజం."

"ఆ. వాడి మొహం. అది అసలు వాడికి రావడమేమిటి? రాకూడదు. వస్తే ఇంక వాడితో మాట్లాడగలమా!"

"ఆమాటకొస్తే, అసలు వాణ్ని ఇంకో మెట్టు దించెయ్యాలి. ఇంకా వాడికి ఆ కాటలన్ యువతిని ప్రేమించే ఆశ ఉన్నట్టేనా?"

"ఉన్నట్టేనా ఏమిటి? వెర్రిప్రేమ పట్టుకుంది. ఇప్పు

ఆమెని చూడ్డానికి వెళ్లాడు. కాని— నేనా వ్యవహారపడ్డం లేదనుకుంటాను— అక్కడ వాడికి కొంత ఆశాభంగం కలగవచ్చు."

"అంటే? అదేమిటో విశదంగా చెప్పనారు? ఆ అమ్మాయిని గురించి కూడా పూర్తిగా చెప్పు?"

"ఏముంది? మర్నిదా పట్నాని కొచ్చేటప్పుడల్లా కొటలక్ యువకుడ కడుకూడా కూడాఉంటున్నాడు. అతనుపొడుగ్గా ఉంటాడు. నల్లనికళ్లు, గోధుమ ఛాయ. ఆమె అతన్ని బావఅంటుంది."

"అల్లాగా! అయితే ఆమెని చేసుకోవాలనే నా అతని ఉద్దేశం. అంతేనా?"

"అదేనని నా ఊహ. లేకపోతే ఇరవై ఒకేళ్ల యువకుడు పదిహేడేళ్ల యువతివెంట ఎప్పుడూ ఎందుకు తిరుగుతూ ఉంటాడు?"

"ఇప్పుడు డాంటే కొటలన్స్ నివాసానికే వెళ్లాడ కాదూ చెప్పావు?"

"నేను చూస్తుండగానే కదా, బయలుదేరాడు?"

"సరే. మనం దారికి ఈపక్కనించే నడిచివడితే. రిజర్వ దగ్గర కెళ్లి, అక్కడకూచోవచ్చు. ఒకగ్లాసు పుచ్చుకుంటూ కూచుంటే సరి. ఆ దారినే డాంటే తిరిగి వస్తాడుగా! అప్పుడు ఏం జరిగిందో వాడి ముఖం చూసి చెప్పచ్చు."

"అవును. అయితేనడు."

ఇద్దరూ కలిసి గబగబా నడిచి హోటల్‌కి వెళ్లారు. పదినిమిషాల క్రితం డాంటే ఆదారినే వెళ్లినట్లు హోటల్ యజమాని పాంఫ్లిల్ కూడా చెప్పాడు. కొటలన్స్ నివాసానికే వెళ్లాడని నిర్ధారణచేసుకుని, ఇద్దరూ చెరొక గ్లాసు ద్రాక్షసారాయం తెప్పించుకునివృక్షచ్ఛాయక్రింద నిరీక్షిస్తూ కూర్చున్నారు.

# రిపబ్లిక్ ప్రథమ వర్షం

(5-వ పేజీ తరువాయి)

ణకోసం అహర్నిశలు పాటుబడుతున్న షేక్ అబ్దుల్లా ప్రభుత్వం చేయగలిగినదానిలో నూరోవంతు మన ప్రభుత్వాలు చేయలేకున్నాయి. ప్రత్యక్షంగా జరుగుతున్న దగావర్తకాన్ని అణిచే బాధ్యతని ఇంతవరకూ ఏ ప్రభుత్వమూ తలచనైనా లేదు. ఈనాడు ప్రజలకి నిత్యావసరాలైన ఏ వస్తువు కాని వర్తకులకు అన్యాయ ధనార్జన ఇవకుండా ప్రజలచేతుల్లో పడ్డంలేదంటే అది అతిశయోక్తి కాదు. చివరకు పసిబిడ్డల పాలపిండిడబ్బాలు కూడా వర్తకుల పాపపుమూటల్ని పెద్దవి చేస్తేగని ప్రజల కళ్ళబడటం లేదు.

ఈనాడు సమాజంలో వర్తకులవలె వర్గ సహకారంతో ప్రవర్తించేది మరొక వర్గం లేదు. కాని వర్తకంలో అవినీతిని అణచడానికి శాసనాలు లేవు. పీనల్ కోడ్‌లో కంట్రాక్టుల ఉల్లంఘనకోసం తీసుకోబడిన శ్రద్ధ, వ్యాపారదుర్నీతిపరుల్ని శిక్షించడంలో కనిపించదు. అదే పీనల్ కోడ్ ఈనాటికీ మనకి వేదాక్షరంగా ఉంది. చీనాలో కమ్యూనిస్టులు ప్రభుత్వం స్థిర పర్చుకోగానే క్షణమైనా ఆలస్యం చెయ్యకుండా ప్రారంభించిన కార్యక్రమం ఏమిటంటే, సంఘానికి కలిగే అపకారాన్ని గమనించకుండా కేవలం స్వార్థపరత్వంతో వ్యాపారం సాగించే వారిని శిక్షించడం. మూడుమాసాల్లో చీనాలో ఇన్‌ఫ్లేషన్ తిరుగుముఖంపట్టింది.

అవసరాన్ని బట్టి, ఆచరణ యోగ్యతను బట్టి శాసనాలు చెయ్యడం మనదేశంలో ఇంకా అలవడలేదు. రిపబ్లిక్ రాజ్యాంగం అన్ని అవకాశాలను ఇస్తున్నది. వానిని వినియోగించుకోవడమే మిగిలిఉంది.

కమ్యూనిస్టుదేశాలలో లేని మానవప్రాథమికస్వత్వాలు ఇవ్వబడినాయి. ఈస్వత్వాలనిరోధానికి తంత్రాలు పన్ని ఒక వర్గం మరొక వర్గాన్ని పీడిస్తుంటే చూస్తూ ఊరుకునే గతి అమెరికన్లకి పట్టిందేకాని మనకి ఆ బాధలేదు. ఏవర్గమైనా పీడిస్తుంటే వ్యక్తులు కోర్టులద్వారా ప్రతిక్రియ చెయ్యగల అవకాశం ఉంది. కాని రెండువిధాలా లభించిన అవకాశాలు అందరికీ వినియోగపడ్డం లేదు మొదటిది రిపబ్లిక్ వ్యవస్థ అంతర్యం తెలియని శాసకుల అజ్ఞానంవల్ల. రెండవది పరిపాలకుల అసమర్థతవల్ల. హరిజనుల స్థితిగతులలోనూ, కార్మికుల జీవనంలోనూ అమోఘమైన పరిణామం రాగలదని ఆశించిన వారందరికీ ఆశాభంగమయింది. ఏడాదిలో ఏమి సంభవించిందో చూసుకుంటే ఉపకారంకంటె అపకారం అధికంగా కలిగినట్లు గోచరిస్తుంది. దీనికికారణం మన పరిపాలకుల భావనాగతిని చూస్తే స్పష్టపడుతుంది. కమ్యూనిజం తలెత్తకుండా అణిచివెయ్యడంకోసం ఉద్యమకారుల్ని కాల్చి చంపుతున్నారు. కాని ఆ బీజాలు మొలకెత్తే క్షేత్రాన్ని సంస్కరించడం ప్రధానమని భావించడంలేదు. కార్మికులు కర్షకుల ఆకలి తీర్చి కమ్యూనిజాన్ని నివారించడం మన పరిపాలకులకు తెలియదు. వర్తకవ్యాపారాల్లో అవినీతిని నిర్మూలించినట్లయితే ఆర్థికసమస్యలు మూడొంతులు తీరిపోతాయని తెలియదు. నాయకుల్ని చంపడంతో సమస్య తీరిపోతుందని భావిస్తారు. ఉన్న శిక్షాశాసనంతో అరాచకవాదుల్ని శిక్షించలేరు.

ఈ యేడాది అనుభవాన్ని బట్టి ఒక్కటే చెప్పవచ్చును. రిపబ్లిక్ రాజ్యాంగం ఇచ్చిన అవకాశాల్ని మన శాసకులు పూర్తిగా వినియోగించుకోలేకపోయారు. ఈ అనుభవాన్ని వారు పరిశీలించుకోవడం అవసరం. దానినిబట్టి పురోభివృద్ధికి కృషి చెయ్యవచ్చును. [ఎక్స్పర్] ★

## పిల్లి శకునము

(40-వ పేజీ తరవాయి)

వచ్చింది. మరణించక ముందే వీడిలా శకునాలపక్షిలా పాడుతున్నాడని, బయటకి వచ్చి ఛకారగుళ్ళు తగిలించారు.

తన దుఃదృష్టమును తానే నిందించుకొంటూ మనవాడు మరో యింటికి దారితీశాడు. ఆ ఇంటివద్ద తనలో "ఆదిశేషువుకు నాపై దయ లేకపోయింది. శ్రీరాముడైనా కరుణిస్తాడనుకుంటే అతడుగూడ కటాక్షింపలేదు. మగవారి హృదయము కఠినశిలవంటిది. స్త్రీహృదయము వెన్నవలె చాల మెత్తనిది. సీతమ్మవారిని తలిస్తే ఆమెకైనా నాపై దయ కలగక పోతుందా, అని అనుకుంటూ సీతాదేవిని లంకలో ఆంజనేయులు చూచిన సందర్భంలో ఆంజనేయులు పాడిన

"కనుగొంటినమ్మా సీతమ్మా
నిన్, కనుగొంటినమ్మా!"

అనేపాట తలపునకువచ్చి ఆ పాటను గంభీరంగానూ, రాగయుక్తంగాను పాడసాగాడు మన హరిదత్తుడు.

ఆ యింటావిడ పేరు సీతమ్మ. ఆమెకు చాలనాళ్ళనుండి పాయసం తినాలని ఉంది. కాని అది వండుకు తినడానికి భర్త ఆటంకంవల్ల సాగలేదు. ఆరోజున ఆమెభర్త ఊరిలో లేడు. అదే సమయమని ఇంకా తెల్లవారకుండానే పాయసం వండుకొని కాలే కాలేది ఎవరూ చూడకుండా తలుపులు వేసుకొని తింటూ ఉన్నది. ఆమెకు ఈ పాట వినిపించింది. ఇక ఆమెగుండెలు గుండెల్లో లేవు. నిజంగా తన్ను ఆ బ్రాహ్మణుడు చూసే పాడుతున్నాడనుకుంది. ఈ సంగతి తన భర్తకు తెలిస్తే ఏమవుతుంది? అమ్మో....

కంగారుగా చేయి కడుక్కొని, మూలనున్న పాత చీపురుకట్ట తీసుకొని వెళ్ళి అనుకున్నంత పనీ చేసింది.

హరిదత్తుడు "కుయ్యో మొర్రో" అనుకుంటూ యింటిముఖం పట్టాడు. అతడి పెళ్ళాం వీపుపై వాతలు చూచి, సంగతి అడిగింది. ఆతడు జరిగినది దాచక చెప్పాడు. దాంతో భార్యకూడా చడామడా నాలుగు జాడించింది, మొదట తన మాట వినలేదని.

పాపం! ఇదంతా పిల్లి మహిమేననుకుని, ఇంకెప్పుడూ పిల్లి అడ్డం వస్తే ఎక్కడికూ వెళ్ళనని అతడు తీర్మానించుకున్నాడు.

చూశారా! ఇందలో పిల్లి తప్పు మాత్రం ఏముంది? అన్నీ అలా కలిసి వచ్చాయిగాని.

---

## నేటిప్రపంచం

(7-వ పేజీ తరువాయి)

లకు తెచ్చినాచాలునని బ్రిటన్ ఫ్రాన్సులు ప్రయత్నించాయి.

ఇప్పుడు చీనా నిరాకరించడంవల్ల, సందిగ్ధంగా కాక అసందిగ్ధంగా ముఖ్యమైన మూడు షరతులికీ అంగీకరించక తప్పని సరి వచ్చింది. ఈ షరతుల్ని అమెరికాచేత ఎలాగైనా ఒప్పించాలని విశ్వప్రయత్నం జరుగుతున్నది.

ఈ ప్రయత్నాల్ని చూసినట్లయితే ఒక్క విషయం మాత్రం స్పష్టపడుతుంది. అమెరికా ఎంత ప్రయాసపడినా సరే చీనాపై కత్తి గట్టడానికి అన్యదేశాలేవీ సిద్ధంగా లేవు. కాబట్టి కొరియా యుద్ధం చీనా అమెరికాలమధ్య యుద్ధంగా గాని, ప్రపంచయుద్ధంగా గాని, పరిణమించే ప్రమాదం లేదన్నమాట. ఆ ప్రమాదం ఇంకా వుందని ఎవరైనా అంటున్నారంటే, అది తమ అవసరం నిమిత్తం అనేమాటే కాని వారు వాస్తవంగా విశ్వసించినది కాదు.

[సూర్యనారాయణ]

---




---

# విజయవాడ రోడ్లు









Regd No M 4479



Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, ThambuChetty St' Madras,